ఆక్రమించారు.. దున్నేశారు!

- ఆవులమంద గ్రామంలో పోరంబోకు భూమిపై కన్ను
- చెట్లు తొలగించి చదును చేసి సాగుకు సిద్ధం
- అధికారులకు గ్రామస్థుల ఫిర్యాదు
- పరిశీలించి బోర్డు ఏర్పాటు చేయించిన తహసీల్దార్


ఆవులమంద గ్రామంలో ఆక్రమించి దున్నిన పశువుల మేత పోరంబోకు భూమి

కురిచేడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కురిచేడు మండలం ఆవులమంద పంచాయతీ పరిధిలో పశువుల మేత పోరంబోకు భూమిని వారం రోజుల నుంచి కొంతమంది ఆక్రమించి దున్నుతున్నారు. దీంతో మూగజీవాలకు గ్రాసం చిక్కదని గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ రజనీకుమారి ఆ భూములను పరిశీలించారు. ఆక్రమణదారులకు హెచ్చరికలు జారీ చేసి బోర్డు ఏర్పాటు చేయించారు. కురిచేడు మండలం ఆవులమంద పంచాయతీ పరిధి కొత్తూరు గ్రామ సమపంలో కొండబోడు అనుకుని సర్వే నంబరు 140లో 124.91 ఎకరాల పశువుల మేత పోరంబోకు భూమి ఉంది. వారం రోజుల నుంచి కొందరు ఆ భూమిని ఆక్రమించే యత్నాలు చేస్తున్నారు. ఒక్కొక్కరుగా చెట్లు పీకి చదును చేశారు. మరి కొంతమంది ఇది మాది అంటూ హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. ఒకరిని చూసి మరొకరు పంటల సాగుకు దిగారు. మేత పోరంబోకు భూమి పూర్తిగా అన్యాక్రాంతమైతే గ్రామంలో పశువులకు గ్రాసం లేకుండా పోయే పరిస్థితి ఎదురవుతుంది. దీంతో పోరంబోకు భూమి ఆక్రమణ విషయమై కొంత మంది గ్రామస్థులు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈనేపథ్యంలో తహసీల్దార్ రజనీకుమారి మంగళవారం ఆవులమంద గ్రామ పరిధిలో కబ్జాకు గురైన పశువుల మేత పోరంబోకు భూమిని పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే క్షమించేది లేదని హెచ్చరించారు. ఆక్రమణదారులకు ప్రభుత్వ భూమి ఆక్రమణల చట్టం 1905 ప్రకారం ఫాం-7లో నోటీసులు ఇస్తున్నట్లు ఆమె తెలిపారు.

పారిశ్రామిక ప్రగతి


దొనకొండ ప్రాంతంలో పరిశ్రమల కోసం కేటాయించిన భూములు

దొనకొండకు వరుసగా ప్రాజెక్టులు

- తొలుత సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుపై విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ ప్రకటన
- ఇటీవల రక్షణ రంగానికి చెందిన భారీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన బీడీఎల్ సంస్థ
- తాజాగా ప్రపంచ స్థాయి క్యాన్సర్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు
- ప్రజాప్రభుత్వంలో చిగురిస్తున్న ఆశలు
- ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎండమావిగా అభివృద్ధి

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిన్నరలోనే దొనకొండలో పారిశ్రామిక ప్రగతి దిశగా అడుగులు పడుతున్నాయి. వరుసగా కీలక ప్రాజెక్టులకు ఆమోదం లభిస్తోంది. ఇటీవల సోలార్, తర్వాత రక్షణ రంగం నుంచి భారీ పరిశ్రమ, తాజాగా క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్.. ఇలా ఒకదాని వెంట మరొక ప్రాజెక్టు రాబోతున్నాయి. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో అన్నిరంగాల్లో వెనుకబడిన దొనకొండ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, జీవనోపాధి నిమిత్తం పేద ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్తున్న వలసలను నివారించాలన్నా పరిశ్రమల ఏర్పాటు ఎంతో ముఖ్యం. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రజాప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో ప్రాజెక్టులు తీసుకువస్తుండటం దొనకొండలో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధిపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతోంది.


దొనకొండలో భూములను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో ప్రతినిధుల బృందం (ఫైల్)

దొనకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దొనకొండలో భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే సోలార్ పవర్ ప్రాజెక్టుతోపాటు బీడీఎల్‌కు చెందిన పరిశ్రమ ఏర్పాటుకు నిర్ణయం జరిగింది. తాజాగా క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు సౌత్ కొరియాకు చెందిన సంస్థ, చల్లా గ్రూపులతో ఒప్పందం కుదుర్చుకుంది. మరికొన్ని పరిశ్రమలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) దొనకొండలో రెండు దశలుగా రూ.1,200 కోట్ల పెట్టుబడితో క్షిపణుల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. అందుకు 1,400 ఎకరాల భూమి అవసరమని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,600 మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి

మిగతా 6వ పేజీలో

ప్రపంచ స్థాయి క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు

సీఎం చంద్రబాబునాయుడు పిలుపు మేరకు దొనకొండ ప్రాంతంలో 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,260 కోట్లతో ప్రపంచస్థాయి క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నట్లు దక్షిణ కొరియాకు చెందిన వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం చైర్మన్ వెల్లడించారు. చల్లా గ్రూప్స్ సంస్థల భాగస్వామ్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో దీన్ని నిర్మించనున్నట్లు ఆయన ప్రకటించారు. విజయవాడలో సోమవారం ఆయా సంస్థల ప్రతినిధులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కేంద్రంలో 1,500 పడకలతో ఇన్ పేషెంట్ వార్డు, క్యాన్సర్ శస్త్ర చికిత్సలు, మెడికల్ స్కూల్, నివాస సముదాయం, బొటానిక్ గార్డెన్ తదితరాలు ఏర్పాటు చేస్తారు. తద్వారా దాదాపు 4వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.




వర్క్‌షాపులో మాట్లాడుతున్న రాష్ట్ర హార్టికల్చర్ మిషన్ డైరెక్టర్ విద్యాశంకర్

రూ.100 కోట్లతో ఉద్యాన క్లస్టర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సరికొత్త నిర్ణయం

- ఆయా వర్గాల ప్రతినిధులతో అధికారుల వర్క్‌షాప్
- ఉద్యాన పంట ఉత్పత్తులకు విలువ జోడింపు ప్రధానాంశం

ఒంగోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంట ఉత్పత్తులకు విలువ పెంపు ద్వారా రైతులకు అధిక ఆదాయం లభించేలా క్లస్టర్ విధానం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సిద్ధమయ్యాయి. ఈ ఏడాది నుంచి అమలు చేయనున్న విధానంలో ఉద్యాన పంటలు అధికంగా ఉండే జిల్లాల్లో గరిష్ఠంగా రూ.100 కోట్లతో క్లస్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వాలు భారీ సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించాయి. అందులో మన జిల్లా కూడా ఎంపికైంది. క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చే వారిని గుర్తించేందుకు అధికారులు మంగళవారం ప్రత్యేక వర్క్‌షాపు నిర్వహించారు. ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గోపీచంద్ నేతృత్వంలో స్థానిక కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కోల్డ్ స్టోరేజీ యజమానులు, ఆ రంగంలో ఉన్న అభ్యుదయ పారిశ్రామిక వేత్తలు, ఎగుమతిదారులు, తోటల సాగుపై రైతులను ప్రోత్సహించే స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. హార్టికల్చర్ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ వై.విద్యాశంకర్, నాబార్డు డీజీఎం రవికుమార్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు, ఉద్యాన పంటల శాస్త్రవేత్త ఎం.రవీంద్రబాబులు హాజరై పలు అంశాలను వివరించారు.

40శాతం రాయితీ

ప్రధానంగా ఉద్యాన పంటల క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన విధి విధానాలు, కేంద్ర, రాష్ట్ర హార్టికల్చర్ మిషన్ల ద్వారా అందే రాయితీలను అధికారులు వివరించారు. సాంకేతిక సలహాలు, ఉద్యాన పంటల సాగు పెంపు, తక్కువ ఖర్చుతో అధిక ఉత్పత్తి, ప్రాసెసింగ్, ఎగుమతులు, యూనిట్ ఏర్పాటు వల్ల రైతులకు జరిగే మేలు, యూనిట్ ఏర్పాటుకు నిధుల సమీకరణ తదితరాలను వెల్లడించారు. క్లస్టర్ యూనిట్ ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు మూడు మాసాల్లో సమగ్ర వివరాలతో ప్రభుత్వానికి దరఖాస్తు చేయాల్సి ఉంది. గరిష్ఠంగా రూ.100 కోట్లతో క్లస్టర్ ఏర్పాటుకు అవకాశం ఉందని, అందులో 40శాతం రాయితీ లభిస్తుందని ఉద్యాన శాఖ ఏడీ గోపీచంద్ తెలిపారు.


కంభం సమీపంలో వారం రోజులుగా నీటిలో ఉన్న అరటి తోట

అరటి రైతు విలవిల

ఇంకా నీటిలోనే 200 ఎకరాల్లో తోటలు

- గెలలు పండి చెట్లతో సహా కుళ్లిపోతున్నవైనం
- గుండ్లకమ్మ బ్రిడ్జిపై తగ్గని ప్రవాహం
- రైతులు పొలాలకు వెళ్లలేని పరిస్థితి
- కంభం మండలంలో రూ.కోటికిపైగా నష్టం

కంభం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ అరటి రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. కంభం, అర్ధవీడు మండలాల్లో కురిసిన భారీ వర్షాలకు గుండ్లకమ్మ, జంపలేరు వాగులు 50సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేని విధంగా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో వారంరోజుల నుంచి కంభంలో సుమారు 200ఎకరాలకు పైగా అరటి తోటలు వరద నీటిలో ఉన్నాయి. అక్కడికి వెళ్లి చెట్లకు కాసిన వందలాది అరటి గెలలు కోసేందుకు వీలు లేకపోవడంతో చెట్ల పైనే మగ్గి రాలిపోతున్నాయి. దీంతో రైతులు కన్నీరుపెడుతున్నారు. తుఫాన్ ప్రభావం తగ్గి వారమవుతున్నప్పటికీ గుండ్లకమ్మ ఉధృతంగానే ప్రవహిస్తుండడంతో పొలాలకు

మిగతా 6వ పేజీలో

సజావుగా ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్

- 51 మంది హాజరు, ప్రమోషన్ వద్దన్న ఒకరు
- మరో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు గైర్హాజరు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు చెందిన గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్ సజావుగా జరిగింది. కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీవో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఈ ప్రక్రియను నిర్వహించారు. గ్రేడ్-6లకు గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు సీనియారిటీ ప్రకారం 55 మందిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. 51 మంది మాత్రమే హాజరయ్యారు. ఒకరు తనకు ప్రమోషన్ వద్దని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. మరో ముగ్గురు కౌన్సెలింగ్‌కు రాలేదు. కార్యక్రమంలో ఏవో శివారెడ్డి, మార్కాపురం డీఎల్‌పీవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చేలు చెరువులయ్యాయి!

- నేటికీ పొలాల్లో వరద నీటి ప్రవాహం
- రూ.కోట్లలో నష్టపోయిన రైతులు
- కోతకు గురైన పొలాలు, పలుచోట్ల గోతులు
- ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు

7


తిమ్మాపురం వద్ద మిర్చి పొలం నుంచి దిగువకు పారుతున్న నీరు

పూలు కొనలేం.. పండ్లు తినలేం..!

- ఆకాశాన్నంటుతున్న ధరలు
- కార్తీక మాసం ప్రభావంతో పెరిగిన రేట్లు
- తుఫాన్‌తో దిగుబడి తగ్గి మరింత డిమాండ్

7


మీకోసం అర్జీలపై సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

అర్జీలపై ప్రత్యేక దృష్టి

- వాటిని పరిశీలించడం దినచర్యగా పెట్టుకోవాలి
- అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ కార్యాలయానికి రాగానే 'మీ కోసం' అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి స్థితిని పరిశీలించాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. మీకోసం అర్జీల పరిష్కారమవుతున్న తీరుపై సంబంధిత విభాగ అధికారులతో

మిగతా 6వ పేజీలో

ఒంగోలులో 7న మెగా ప్లాంటేషన్

- విద్యార్థుల భాగస్వామ్యంతో ఒకేరోజు ఐదువేల మొక్కలు
- ప్రధాన రోడ్ల వెంట నాటేలా ఎమ్మెల్యే జనార్దన్ ప్రణాళిక
- పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు


మొక్కలు నాటేందుకు రోడ్డు పక్కన గుంతలు తీస్తున్న ఎక్స్‌కవేటర్

ఒంగోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర సుందరీకరణ, మౌలిక సౌకర్యాల మెరుగుపై దృష్టి సారించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మరో భారీ కార్యక్రమానికి సన్నాహాలు చేస్తున్నారు. నగరంలో పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తూ పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 7న నగరంలో ఒకే రోజు ఐదువేల మొక్కలు నాటేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఒక్కో విద్యార్థి ఒక్కో మొక్కను ఏకకాలంలో నాటేలా నగరంలోని డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలతో మాట్లాడారు. ఆ విధంగా వేలాది మందిని కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నారు. నగరంలోని మంగమూరు రోడ్డు, గుంటూరు రోడ్డు కొత్తపట్నం రోడ్డు.. ఇలా మొత్తం ఎనిమిది ప్రధాన రోడ్లలో మొక్కలు నాటనున్నారు. ఆ కార్యక్రమంలో జిల్లాలోని కీలక ప్రజాప్రతినిధులంతా పాల్గొననున్నారు. ఇందుకు

మిగతా 6వ పేజీలో

హరహర మహాదేవ

- నేడు కార్తీక పౌర్ణమి
- సముద్రస్నానాలు ఆచరించనున్న వేలాది మంది

వివరాలు 7వ పేజీలో

గ్రానైట్ సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు

● మంత్రుల సమావేశంలో నిర్ణయం ● వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని కమిటీకి దిశానిర్దేశం

చీమకుర్తి, నవంబరు (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో విస్తరించిన గ్రానైట్ పరిశ్రమ సమస్యలు, పరిష్కారాలపై అధ్యయనం చేసి నివేదికను వారం రోజుల్లో సమర్పించాలని గ్రూపు ఆఫ్ మినిస్టర్స్ ఆదేశించారు. గ్రానైట్ సీనరేజీ వసూలు హక్కుల విషయంలో ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ సమ్మె చేయటం తదుపరి గనులశాఖామంత్రి హామీ ఇవ్వటంతో సమ్మెకు విరామం ఇవ్వటం గతంలో జరిగాయి. అయితే సీనరేజు వసూలు చేసే సంస్థ రంగప్రవేశం చేసిన తర్వాత రోజు ఏదో చోట గొడవ జరుగుతుండటం, సీనరేజీ వసూలు ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్పవద్దంటూ గ్రానైట్ పరిశ్రమ వెలుగెత్తటంతో సమస్య నెలకొంది. మూడు దఫాలు చర్చలు జరిగినా ప్రయోజనం లేకపోవటంతో మంగళవారం అమరావతిలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు గ్రానైట్ అసోసియేషన్, సీనరేజీ వసూలు సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఇరుపక్షాలు తమ సమస్యలను మంత్రుల ముందు ఏకరవు పెట్టారు. ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో విస్తరించిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. అందరి వినతులు విన్న మంత్రులు గ్రానైట్ సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కారమార్గాలను కూడా వారం రోజుల్లో సూచించాలని కమిటీని ఆదేశించారు. ఈ కమిటీలో గనులశాఖ అధికారులు, సీనరేజీ వసూలు సంస్థ ప్రతినిధులు, గ్రానైట్ ఓనర్ల అసోసియేషన్ నాయకులు ఉన్నారు. ఈ సమావేశంలో అసోసియేసన్ నాయకులు యర్రంనేని కోటేశ్వరరావు, ఆళ్ల రవి, మండవ రత్నాకర్, కాట్రగడ్డ రమణయ్య, వై.శ్రీనివాసరావు, మలినేని వెంకటేశ్వర్లు, లగడపాటి శ్రీనివాసరావు, భవానీ ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అసోసియేషన్ నాయకులు



కొండేపల్లి దారిలో కోతకు గురైన రోడ్డుకు ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్న మరమ్మతులు

రోడ్లకు మరమ్మతులు

మార్కాపురం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో దెబ్బతిన్న రోడ్లకు అధికార యంత్రాగం మరమ్మతులు చేయిస్తోంది. మండలంలోని నికరంపల్లి - పెద్దనాగులవరం రోడ్డులో వాగు ఉధృతంగా ప్రవహించి రోడ్డు కోతకు గురైంది. మాల్యవంతునిపాడు గ్రామం నుంచి బడేఖాన్‌పేటకు వెళ్లే రోడ్డు కోతకు గురైంది. కొండేపల్లి తారు రోడ్డు కోతకు గురైంది. అధికారులు పరిశీలించి టీడీపీ నాయకులతో కలిసి మరమ్మతు పనులు చేయించారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రికవరీ పేరుతో వేధిస్తే చర్యలు

● డీఎస్పీ డాక్టర్ నాగరాజు

మార్కాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రుణాల రికవరీ పేరుతో ఏజెంట్లు ప్రజలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు హెచ్చరించారు. స్థానిక ఎస్‌డీపీవో కార్యాలయంలో మంగళవారం రికవరీ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని సుమారు 100 మంది రికవరీ ఏజెంట్లకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. వారిలో దాదాపు చాలామందికి ఆర్‌బీఐ గైడ్‌లైన్స్ గురించి తెలియదన్నారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా మాత్రమే ఏజెంట్లు రికవరీ చేయాలన్నారు. కానీ క్షేత్రస్థాయిలో రికవరీ ఏజెంట్లపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. రుణాల రికవరీ కోసం ఉదయం 8.00 గంటలలోపు సాయంత్రం 7.00 గంటల తర్వాత ఫోన్‌లు చేయకూడదన్నారు. శిక్షణ పొందిన వాళ్లు మాత్రమే రుణాలను రికవరీ చేయాలన్నారు. రుణాలు తీసుకున్న వారిని మానసికంగా బ్లాక్‌మెయిల్ చేయకూడదన్నారు. వేధింపుల విషయమై తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై, బ్యాంకులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సమావేశంలో సీఐ పి.సుబ్బారావు, టౌన్, రూరల్ ఎస్సైలు ఎం.సైదుబాబు, పి.అంకమ్మరావు పాల్గొన్నారు.

బోడపాడు చెరువు కాలువకు మరమ్మతులు

మార్కాపురం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడపాడు చెరువు కాలువ మరమ్మతు పనులను మార్కాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు దగ్గుల శ్రీనివాసరెడ్డి చేయించారు. మార్కాపురం చెరువు అలుగు నీరు బోడపాడు చెరువుకు చేరుతుంది. గత కొంత కాలంగా కాలువలో చిల్లచెట్లు దట్టంగా పెరగడంతో నీరు వచ్చే అవకాశం లేదు. ఈ సమస్యను రైతులు, టీడీపీ గ్రామ నాయకుడు బొగ్గు శేఖర్‌రెడ్డి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి సంబంధిత అధికారులకు సూచించడంతో ఎక్స్‌కవేటర్‌తో కాలువకు మరమ్మతులు చేశారు. దీనిపై గ్రామస్థులు, రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

● డీఈవో కిరణ్‌కుమార్



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

పొదిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మార్చిలో జరగనున్న పదవతరగతి పరీక్షా కేంద్రాల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని డీఈవో కిరణ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం పొదిలిలో పలుపాఠశాలలను ఆయన పరిశీలించారు. జిల్లాలో ప్రస్తుతం 183 కేంద్రాలు ఉండగా, అవి చాలకపోతే కొత్త కేంద్రాల ఏర్పాటుపై పరిశీలన చేస్తున్నట్లు డీఈవో తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. జీపీఎస్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయగానే విద్యార్థికి కేటాయించిన సెంటర్, లోకేషన్ వివరాలు వస్తాయని తెలిపారు. ఆయన వెంట మార్కాపురం ఉపవిద్యాశాఖ అధికారి మామిళ్లపల్లి శ్రీనివాసులు, డీసీఈబీ శ్రీనివాసులు, పొదిలి, కొనకనమిట్ల ఎంఈవోలు నాగలక్ష్మి, నరసింహారావు ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరుగురు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు చెంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఒంగోలులో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 కబడ్డీ పోటీలలో పాఠశాలకు చెందిన డెవిడ్, అభి, విష్ణువర్ధన్, నాగరాజు, జశ్వంత్, భానుతేజ ప్రతిభ కనబరిచి కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో ప్రకాశం జిల్లా జట్టు తరుపున ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు.

సాయిబాబా శతజయంతిని ప్రభుత్వ పండుగలా జరపడాన్ని ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పుట్టపర్తి సాయిబాబా శతజయంతి వేడుకలను ప్రభుత్వ పండుగగా జరపాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన 862 జీవోను రద్దు చేయాలన్నారు. ఈ రకమైన నిర్ణయం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమన్నారు. సాయిబాబా విశిష్టమైన వ్యక్తికాదని అందువల్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగల్ కాలేషా బేగ్, గుమ్మళ్ల నరసింహారావు, ఉప్పుటూరి ప్రకాశరావు, సుభాని, రామకృష్ణ, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే బీఎన్‌కు అస్వస్థత

ఒంగోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయ్‌కుమార్ మంగళవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయన్ను ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. గ్రానైట్ వ్యాపారుల సమస్యపై విజయవాడ వెళ్లి మంత్రులను కలిసి వచ్చిన తర్వాత ఆయన గుండెపరమైన సమస్యకు గురవడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. స్వల్ప అస్వస్థతేనని, ఇబ్బంది లేదని చికిత్స చేస్తున్న వైద్యులు తెలిపారు. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది.

పారిశ్రామిక ప్రగతి

(5వ పేజీ తరువాయి)

అవసరమైన అనుమతులన్నీ సకాలంలో వస్తే ఏడాదిలో పరిశ్రమ పనులను ప్రారంభించి, రెండేళ్లకు పూర్తి చేసేలా ఆ సంస్థ ప్రతిపాదించినట్లు తెలిసింది. అందులోభాగంగా ఇటీవల డీఆర్‌డీవోకు చెందిన ప్రతినిధులు దొనకొండకు వచ్చి ఈ ప్రాంతంలోని భూములు, మౌలిక సౌకర్యాలను క్షుణ్ణంతగా పరిశీలించి భూములకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కనిగిరి ఆర్డీవో, స్థానిక తహసీల్దార్ ద్వారా తెలుసుకున్నారు.

ఆ ఐదేళ్లు ప్రగతి శూన్యం.. మళ్లీ ప్రారంభం

రాష్ట్ర విభజన అనంతరం 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు దొనకొండ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని నాడు అసెంబ్లీలో ప్రకటించారు. అనంతరం ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ఎందరో విదేశీ ప్రతినిధుల బృందాలు పర్యటించి పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారిస్తున్న సమయంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో పరిశ్రమల అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పారిశ్రామిక ప్రగతి ఎండమావిగా మారింది. తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ఆధ్వర్యంలోని ప్రజాప్రభుత్వం ఏడాదిన్నర కాలంలో చూపుతున్న చొరవతో దొనకొండ ప్రాంతంలో భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. త్వరలో దొనకొండ దశ మారి బంగారు కొండగా అభివృద్ధి చెందటం ఖాయమని ప్రజలు భావిస్తున్నారు.

ఆనందంగా ఉంది

ప్రజా ప్రభుత్వం దొనకొండలో పారిశ్రామిక అభివృద్ధికి వడివడిగా అడుగులు వేస్తోంది. ఇక్కడ అనేక పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమమవుతుండటం ఆనందం కలిగిస్తోంది. ఈ ప్రాంత అభివృద్ధికి పరిశ్రమలు ఏర్పాటు అవసరమని నేను సీఎం చంద్రబాబు, ఐటీశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లా. సానుకూలంగా స్పందించిన వారు స్పష్టమైన హామీ ఇచ్చి అమలు చేస్తున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, పేదలకు ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకుంటున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు.

\- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి

ఒంగోలులో 7న మెగా ప్లాంటేషన్

(5వ పేజీ తరువాయి)

సంబంధించిన ఏర్పాట్లపై కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. తొలుత గతనెల 24న మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆ రోజున డీఆర్సీ సమావేశం ఉండటంతో ఇన్‌చార్జి మంత్రి, జిల్లాకు చెందిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరవుతారని వారందరితో మొక్కలు నాటించాలని భావించారు. అయితే ఆ సమావేశం వాయిదా పడటంతోపాటు మొంథా తుఫాన్ ఆ సమయంలో నగరాన్ని ముంచెత్తడంతో కార్యక్రమం వాయిదా పడింది. తిరిగి ఈనెల 7న డీఆర్సీ సమావేశం జరగనుంది. ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలు ఆ సమావేశానికి వస్తున్నారు. దీంతో ఆ సమావేశం లోపు వారందరూ మొక్కలు నాటేలా ఎమ్మెల్యే జనార్దన్ కార్యక్రమాన్ని రూపొందించారు.

ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు

వేలాదిమంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉండటంతో ప్రణాళికాబద్ధంగా కార్యక్రమ నిర్వహణపై కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. రోడ్లు అత్యధిక భాగం సిమెంట్‌వి కాగా వాటికి ఇరువైపులా ఎక్కడ మొక్కలు నాటాలన్నది గుర్తించి మిషన్ల ద్వారా కటింగ్ చేసి గుంతలు తీస్తున్నారు. అలాగే పలు కళాశాలల యాజమాన్యాలతో మంగళవారం కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఏ కాలేజీ నుంచి ఎంతమంది విద్యార్థులు హాజరవుతారు, ఏ కాలేజీ వారు ఏ రోడ్డులో మొక్కలు నాటాలన్న దానిపై చర్చించారు. ఒక్కో బస్సులో 50 మంది కాలేజీ విద్యార్థులు వస్తే వారికి కాలేజీ నుంచి ఒకరు, కార్పొరేషన్ నుంచి ఒకరు సిబ్బంది అందుబాటులో ఉండి మొక్కలను క్రమపద్ధతిలో నాటించేలా షెడ్యూల్‌ను సిద్ధం చేస్తున్నారు. అలాగే మొక్కలు నాటే రోడ్డులో ట్యాంకర్లతో నీరు, ట్రాక్టర్ ద్వారా మట్టి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నారు. నగరంలో పచ్చదనం పెంపు కోసం చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోరారు.

అరటి రైతు విలవిల

(5వ పేజీ తరువాయి)

వెళ్లేందుకు ఉన్న కల్వర్టు దాటలేకపోతున్నామని వాపోతున్నారు. వరద నీటిలో ఉన్న 200ఎకరాల అరటి తోటలో కాచిన గెలలను కోయడానికి వీలులేక పనికిరాకుండా పోవడంతో సుమారు కోటి రూపాయలకు పైగా పంట నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. అరటి తోటలను ముంచేంత వరదను మునుపెన్నడూ చూడలేదన్నారు. వాగు ఉధృతి తగ్గాలంటే మరో నాలుగు రోజులు పడుతుందని అప్పటికి చెట్లతో సహా కుళ్లి కాయలు రాలిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉద్యానవన శాఖ అధికారి శ్వేత వివరణిస్తూ.. కంభం, చింతలపాలెం, గూడెం ప్రాంతాలలో వరదలో మునిగిన అరటి తోటలను పరిశీలించామని తెలిపారు. నష్టం వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపించామని చెప్పారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి

(5వ పేజీ తరువాయి)

మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సమీక్షించారు. అర్జీల ఆడిట్, సకాలంలో పరిష్కారం, రీఓపెన్ కాకుండా చూడటం, అర్జీదారులతో వ్యవహరించాల్సిన తీరు తదితరాలపై దిశానిర్దేశం చేశారు. సమస్యలను సకాలంలో సహేతుకంగా పరిష్కరించడంతోపాటు మాట్లాడే తీరు కూడా గౌరవప్రదంగా ఉండాలన్నారు. మీకోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అర్జీదారులకు ఫోన్ చేసి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, పంచాయతీ, విద్య, రోడ్లు భవనాల శాఖల అర్జీలు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని మీకోసం విభాగ జిల్లా నోడల్ అధికారి మాధురి ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సకాలంలో అర్జీలను పరిష్కరించడంలో జాప్యం చేస్తున్న విభాగాలు, అధికారుల వివరాలను ప్రతిరోజూ తన దృష్టికి తేవాలని ఆమెను కలెక్టర్ ఆదేశించారు. అర్జీలను పరిష్కరించడంలో జాప్యం చేస్తున్న హెచ్‌ఎంపాడు, పుల్లలచెరువు తహసీల్దార్లతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడారు డీపీవో వెంకటేశ్వరరావు, డీఈవో కిరణ్‌కుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ రవినాయక్‌లను కూడా తన చాంబర్‌కు పిలిపించి అర్జీల పరిష్కారంలో జాప్యం ఎంత మాత్రం సరికాదని, వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మీకోసం అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ కృష్ణమోహన్, సూపరింటెండెంట్ నాగజ్యోతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున జిల్లాలో వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. మీ కోసం కార్యక్రమంలో 70 శాతం అర్జీలు రెవెన్యూ సంబంధిత అంశాలపైనే వస్తున్నాయని, అందువల్ల సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో వ్యవసాయ, ఉద్యానశాఖ, పశుసంవర్థక, మత్స్యశాఖలకు సంబంధించిన నష్ట వివరాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి వెంటనే నివేదికలు పంపాలని ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన ఈ పంట నమోదును గడువులోపు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, పురపాలక శాఖలకు సంబంధించి దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. స్వర్ణ గ్రామ పంచాయతీల్లో భాగంగా గ్రామ పంచాయతీలు నిర్వహించే ప్రతి ఆర్థిక లావాదేవీలు ఇక నుంచి డిజిటల్ రూపంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. డ్వామా ద్వారా జిల్లాలో జరగనున్న ఉపాధి పనులు నూరుశాతం అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖల వారీగా సమీక్షించి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు చిరంజీవి, వెంకటేశ్వరరావు, జోసెఫ్ కుమార్, నారాయణ, డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

వరిలో ఉల్లికోడు నివారణ చర్యలు చేపట్టాలి

అద్దంకి, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : వరిలో ఉల్లికోడు నివారణ చర్యలు తీసుకోవాలని ఏడీఏ ఎప్రాయం చెప్పారు. మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ తరువాత వరిలో ఉల్లికోడు ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతుల జాబితా అన్ని రైతు సేవాకేంద్రాలలో ఉంచామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, శేషయ్య, ఖాజాబీ, శేషారావు పాల్గొన్నారు.



ధర్మవరంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ ఎప్రాయం, ఏవో వెంకటకృష్ణ

యాజమాన్య పద్ధతులు పాటించండి

పంగులూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : రైతులు పంట సాగులో సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని భగవాన్‌రాజుపాలెం, రామకూరు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు హరి, బీబీ జాన్, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవలో...

బల్లికురవ, నవంబరు4(ఆంధ్రజ్యోతి): వరి పంట సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని కొత్తూరు, వెలమవారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈవో మౌలాలి పాల్గొన్నారు.

నేడు జొన్నతాళిలో శాంతి కల్యాణ మహోత్సవం

మార్టూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం మండలంలోని జొన్నతాళి గ్రామంలో గంగమ్మ దేవస్థానం వద్ద గంగా పార్వతీ సమేత శ్రీమహాకాళేశ్వరిస్వామి శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు సాయంత్రం స్వామి పంచలోహ విగ్రహాలతో గ్రామోత్సవం, తదుపరి జ్వాలా తోరణం, అనంతరం స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామని వివరించారు. గురువులు శ్రీశర్వాజీ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కమిటి సభ్యులు తెలిపారు.

నేడు మార్టూరులో అఖండ కర్పూరజ్యోతి

మార్టూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం మండలంలోని అమరావతి నూలుమిల్లు ఎదురుగా ఉన్న నాగార్పమ్మ దేవస్థానంలో అఖండ కర్పూరపు జ్యోతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విశేషంగా భక్తులు తరలి రావాలని కోరారు.

నేడు చీరాలలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కట్

చీరాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు ఈపూరుపాలెం గ్రామమంతా సేవలకు అంతరాయం ఉంటుందని చెప్పారు. అలాగే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చీరాల మండల పరిధిలోని కొత్తపాలెం, విఘ్నేశ్వర కాలనీ అంతరాయం కలుగుతుందని తెలిపారు. అంతేకాకుండా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మున్సిపల్ పరిధిలోని పాపరాజుతోట, స్వర్ణ రోడ్డు, కొట్ల బజార్, పువ్వాడవారి వీధి, అయ్యప్పస్వామి టెంపుల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు అద్దంకిలో...

అద్దంకి, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ టవర్ లైన్ల ఏర్పాటు నేపథ్యంలో బుధవారం అద్దంకి పట్టణంలోని ద్వారకానగర్, ఆటోనగర్, మండలంలోని శింగరకొండ, శింగరకొండపాలేలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం, మౌలానగర్, గరటయ్య కాలనీ, రేణింగవరం రోడ్డు తదితర ప్రాంతాలలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు.

నేడు బల్లికురవలో ...

బల్లికురవ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : బల్లికురవలో నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఇన్‌చార్జి ఏఈ సుబ్బారావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తుఫాన్ నష్టాన్ని పారదర్శకంగా అంచనా వేయాలి

● ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన కరణం వెంకటేష్

చీరాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా రైతులు, నేతన్నల కుటుంబాల్లో కన్నీరే మిగిలిందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం వేటపాలెం మండలం దేశాయిపేట విఘ్నేశ్వర కాలనీలో నీట మునిగిన పంట పొలాలను, అలాగే మోకాళ్ల లోతు నీళ్లల్లో ఉన్న మగ్గాలను పరిశీలించారు. ఆయా బాధితులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షం తీవ్రత అధికంగా ఉండటం వలన ప్రజలు పరిస్థితి దయనీయంగా ఉందని చెప్పారు. అనంతరం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడును కలిసి సమస్య తీవ్రతను వివరించారు. ప్రభుత్వానికి నష్టం విలువ పారదర్శకంగా రూపొందించి సాయం సమకూరే చూడాలని కోరారు. అందుకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన వెంకటేష్ వెంట పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బస్సులు తిప్పితే సీజ్

● రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్

ఒంగోలు క్రైం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంట్రాక్ట్ క్యారియర్ బస్సులు, స్కూలు బస్సుల తనిఖీలు నిర్వహించామని, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను తిప్పితే సీజ్ చేస్తామని రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల హెచ్చరించారు. మంగళవారం బస్సులు తనిఖీలు నిర్వహిస్తూనే ఆయా వాహనాల యజమానులతో ఒంగోలులోని డీటీసీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీటీసీ సుశీల మాట్లాడుతూ మోటార్ వాహన చట్టంలోని నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేయాలని ఆదేశాలు ఇచ్చానమన్నారు. స్కూలు, కాలేజీల బస్సులను నిత్యం తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు తనిఖీలు జరుగుతాయిన్నారు. రహదారి భద్రత, ప్రమాణాలు పాటించకపోయినా, ప్రభుత్వంనానికి పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేసేందుకు వెనుకాడబోమని ఆమె స్పష్టం చేశారు.

మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలుపు స్ఫూర్తితో ర్యాలీ


అద్దంకి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్‌ను గెలిచిన సందర్భంగా మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గోపాలరావు వారి వీధి నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు, కార్యదర్శి అలహరి హరిప్రసాద్, డాక్టర్ దేవపాలన, అద్దంకి లేవిప్రసాద్, చప్పిడి వీరయ్య, పసుపులేటి ఆంజనేయులు, మహమ్మద్ రఫీ, శ్రీనివాసులు, గూడా లక్ష్మారెడ్డి, చిన్ని కామేశ్వరరావు, తమ్మన శ్రీనివాసరావు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తనాలను నాటే యంత్రాల పంపిణీ

మార్టూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : తక్కువ శ్రమ, వ్యయంతో మహిళా రైతులు యంత్రాల ద్వారా మొక్కజొన్న విత్తనాలను నాటడానికి అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారిణి లావణ్య చెప్పారు. మంగళవారం మార్టూరులో వ్యవసాయమార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో మండలంలోని మహిళా రైతులకు అడ్వాంటా సీడ్స్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటిలో భాగంగా ఉచితంగా మొక్కజొన్న విత్తనాలను నాటే యంత్రాలను పంపిణీ చేశారు. ఏవో లావణ్య చేతుల మీదగా, కంపెనీ ప్రతినిధులు ఆ యంత్రాలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రోహిత్ కుమార్, సుమంత్ పాల్గొన్నారు.

చేలు చెరువులయ్యాయి

● నేటికీ పొలాల్లో వరద నీటి ప్రవాహం ● రూ.లక్షల్లో పైరు, ఆస్తి నష్టం ● ఆదుకోవాలంటున్న రైతులు



ఇప్పటికీ పంట పొలాల్లో తగ్గని వరద

పెద్ద దోర్నాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ఉధృతి రైతులకు తీరని గాయంగా మిగిల్చింది. కోలుకునే సరికి ఎన్నాళ్లు పడుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొందని బాధిత రైతులు దొడ్డా వెంకటేశ్వర్లు, పత్తి మల్లికార్జున, డమాం వెంకట సుబ్బయ్య, బయ్యా చిన్న ఆదెయ్య, మండ్లా రాములు, నూత లపాటి కాశయ్య, నుసుళ్లపల్లి గాలీశ్వరయ్య, నల్లబోతుల ఆంజనేయులు తదితరులు వాపోతున్నారు. ఇంత జరిగినా అధికారులు ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని, నేటికీ తుఫాన్ తాలూకా వరద నీరు పంట పొలాల్లో ప్రవహిస్తోందని కన్నీరు పెడుతున్నారు. ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ బీభత్సానికి కడపరాజుపల్లె చెరువు నిండి అలుగు ద్వారా ప్రవహించిన వరదకు మండలంలోని కడపరాజుపల్లె, తిమ్మాపురం గ్రామంలోని పంట పొలాలు తీవ్రంగా నష్టపోయాయి. ఇప్పటికీ జలపాతాల్లా సాగు చేసిన మిరపపై ప్రవహిస్తుండడంతో మొక్కలు మొత్తం చచ్చిపోయాయి. దాంతో పాటు సారవంతమైన భూములు కోతలకు గురై పెద్ద పెద్ద కుంటలు ఏర్పడ్డాయి. లక్షలు ఖర్చు చేసి నాలుగు నెలలు పెంచిన మిరప పైరుతో పాటు చేలన్నీ చెరువులుగా మారాయి. కడపరాజుపల్లె గ్రామంలో యాభై ఎకరాలు, తిమ్మాపురం గ్రామంలోని యాభై మంది రైతులకు చెందిన సుమారు వంద ఎకరాలు నీటిలో నానుతూనే ఉన్నాయి. సాధారంగా వాన కురిసి వెలిసిపోతే ఆ పంట దెబ్బతింటే మళ్లీ బాగు చేసుకుని మరో పైరు సాగు చేస్తారు. కానీ ఇక్కడా పరిస్థితికి భిన్నంగా మారింది. ఇప్పుడే కాదు ఎప్పటికీ సాగు చేయలేని నీటి కుంటలు ఏర్పడ్డాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసినా చక్కబడే అవకాశాలు లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఏమి చేయాలో కూడా తెలియక కన్నీరు పెడుతున్నారు. ప్రభుత్వం స్పందించి క్షేత్ర స్థాయిలో పరిశీలించి నష్ట పరిహారంతో పాటు భూములు బాగు చేసుకునేందుకు సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

మిరప నాశనం



రెండున్నర ఎకరాల్లో రూ.2లక్షలకు పైగా ఖర్చు చేసి మిరప వేశాను. పైరు బాగా వచ్చింది. పూత దశలో తుఫాన్ వచ్చి సర్వనాశనం చేసింది. పైరుతో పాటు చేను పనికిరాకుండా పోయింది. ఎప్పుడు కోలుకుంటామో తెలియదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- దొడ్డా వెంకటేశ్వర్లు, తిమ్మాపురం గ్రామ రైతు

భూమి బాగుకు సాయమందించాలి



రెండు ఎకరాల్లో మిరప నాటాను. బాగా కాపుకు వచ్చే సమయానికి తుఫాన్ ముంచింది. ఇప్పటికీ సముద్రంలా పారుతోంది. చేనంతా నీటి కుంటలు పడి చెరువును తలపిస్తోంది. ప్రభుత్వం పంట నష్టంతో పాటు భూమి బాగుకు సాయమందించాలి.

- నూతలపాటి కాశయ్య, తిమ్మాపురం గ్రామ రైతు

పూలు కొనలేం పండ్లు తినలేం!

● ఆకాశాన్నంటుతున్న ధరలు
● కార్తీక మాసం ప్రభావంతో పెరిగిన రేట్లు
● మొంథా తుఫాన్ దెబ్బకు తగ్గిన దిగుబడి



ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం వచ్చిందంటేనే పూలు, పండ్ల ధరలకు రెక్కలొచ్చేస్తాయి. నెలరోజులపాటు దేవతామూర్తులకు విశేష పూజలు అందించడంతోపాటు, ప్రతి ఆలయం భక్తులతో కళకళలాడుతుంది. నిన్న మొన్నటి వరకు సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే పూలు, పండ్ల ధరలు ప్రస్తుతం కార్తీక మాసం పుణ్యమా అని మరింత పెరిగాయి. మరోవైపు అయ్యప్ప స్వామి భక్తులు, భవానీ మాలధారణ, శివమాల ధారణలు ఈ మాసంలోనే అత్యధికంగా ఉండటంతో పూలు, పండ్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒకవైపు కార్తీక మాసం, మరోవైపు మొంథా తుఫాను ఎఫెక్ట్ కారణంగా దిగుబడి తగ్గడంతో వాటి రేట్లు కొండెక్కి కూర్చున్నాయి. దీంతో భక్తులు భారమైనా తప్పక కొనుగోలు చేయాల్సి వస్తోంది. మరోవైపు వ్యాపారులకు సైతం దిగుబడి తగ్గిన వాటి ధరలు పెంచి అమ్మడంతో వ్యాపారాలు మరింత ఊపందుకున్నాయి.

కార్తీక మాసంలోనే డిమాండ్

కార్తీక మాసం ప్రారంభం అయిన రోజు నుంచి తొలి కార్తీక సోమవారం, నేడు కార్తీక పౌర్ణమి కావడంతో ఎక్కువ మంది ఉపవాస దీక్షలు ఉంటారు. పండ్లు, ఫలాలు తిని రాత్రికి భోజనం చేయడం మంచిదని పెద్దలు చెబుతుండగా, అందుకోసం మహిళలు ఉపవాస దీక్షతో పూజలు చేయడం సాంప్రదాయంగా వస్తుంది. అయితే ఈ సీజన్‌లో పండ్ల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. యాపిల్, నారింజ, దానిమ్మ, జామకాయ, కీర దోస, పుచ్చకాయ లాంటి పండ్లు ఎక్కువగా కొనుగోలు చేస్తుండగా, గత వారం రోజు క్రితం వరకు కేజీ రూ.100 నుంచి రూ.150 మాత్రమే అమ్మిన పండ్లు తుఫాను ప్రభావంతో దిగుబడి తగ్గిందనే కారణం చూపి, ధరలు ఒకేసారి కేజీకి రూ.100 పెంచేసి అమ్మకాలు చేస్తున్నారు. ఇక అరటి పండ్లు ఇతర రోజుల్లో డజను రూ.50 నుంచి రూ.60 ఉండగా, ప్రస్తుతం డజను రూ.100కు పెంచేశారు. దీంతో ఏ పండ్లు కొనాలన్నా కనీసం రూ.250లకు తక్కువ లేకపోవడంతో చేసేదేమి లేక భక్తులు అరకేజీలతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు పూజలు మానుకోలేక, ఇటు పూలు, పండ్లు కొనలేక పెరిగిన ధరలతో నోరెళ్లబెడుతున్నారు.

పూల ధరలకు రెక్కలు

పండ్ల ధరలు చూస్తే కొనలేని పరిస్థితి నెలకొనగా, ఇక సున్నితంగా కనిపించే పూలు ముట్టుకుంటేనే ధరల ముళ్లు గుచ్చుకుంటున్నాయి. బంతిపూలు, చేమంతులు, వంటి పూలకు సాధారణ రోజుల్లో పెద్దగా డిమాండ్ లేకపోగా, ప్రస్తుతం అన్ని పూలకన్నా ఇవి రెండే ధరల విషయంలో విరుచుకు పడుతున్నాయి. గతంలో కేజీ బంతిపూలు, చేమంతులు సుమారుగా రూ.100 లోపు మాత్రమే ఉండగా, ప్రస్తుతం వాటి ధర మరింట రెట్టింపు అయింది. పూలు బంతి, చేమంతి, పూలు కేజీ రూ.200 వరకు పలుకుతుండగా, ఇక కనకాంబరం, విరజాజి, కాగడాలు, మందారం వంటి పూలు మూర రూ.50 నుంచి రూ.70 వరకు పలుకుతున్నాయి. గులాబీల సంగతి కొనే పరిస్థితి లేదని మహిళలు వాపోతున్నారు. అదేమని అడిగితే తుఫాను ప్రభావం కారణంగా దిగుబడి తగ్గిందనే సమాధానం రావడంతో కొనుగోలుదారులు చేసేదేమీ లేక అరకొర మూరలతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. మొత్తంగా కార్తీక మాసంలో పండ్లు, పూల ధరలు ఒక్కసారిగా పెరగడంతో వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో కష్టమైన కచ్చితంగా కొనుగోలు చేయాల్సి రావడంతో ఇటు వినియోగదారులకు భారంగా, అటు వ్యాపారులకు వరంగా మారింది.



హరహర మహాదేవ



● నేడు కార్తీక పౌర్ణమి
● సముద్రస్నానాలు, జ్వాలా తోరణం
● స్నానాలు ఆచరించనున్న వేలాదిమంది ప్రజలు
● అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

ఒంగోలు కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో అత్యంత విశిష్టత కలిగిన సముద్రస్నానాలను బుధవారం ప్రజలు ఆచరించనున్నారు. ప్రతి సంవత్సరం కార్తిక పౌర్ణమి రోజు సముద్రస్నానం చేయటం, సముద్రతీరంలో కార్తిక దీపాన్ని వెలిగించి మహిళలు పూజలు చేయటం ఆనవాయితీ. పౌర్ణమి రోజున జ్వాలాతోరణం, సముద్రస్నానం ఎంతో విశిష్టమైనవని వీటిని ఆచరించటం ద్వారా విశేష ఫలితాలను పొందవచ్చని పురాణాలు చెబుతున్నాయి. జిల్లాలోని కొత్తపట్నం, పాకల, మడనూరు, ఈతముక్కల, ఉమ్మడి జిల్లాలోని చీరాల ఓడరేవు తదితర ప్రాంతాల్లో ప్రజలు వేలాదిగా నేడు సముద్రస్నానాలు ఆచరించనున్నారు. ప్రజల రాకను దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ, పోలీసు యంత్రాగం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నాయి.

శివాలయాలలో జ్వాలాతోరణం

జిల్లాలోని పలు ప్రసిద్ధ శైవాలయాలతో పాటు ఒంగోలు నగరంలోని పలు శివాలయాల్లో కార్తికపౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం నిర్వహించేందుకు ఆయా దేవస్థాన అర్చకులు, అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. బుధవారం సాయంత్రం దేవాలయాలలో జ్వాలాతోరణం జరుగనుంది. మహిళలు అటు తమ ఇళ్ల వద్ద, ఇటు దేవాలయాలలో పెద్దసంఖ్యలో వచ్చి ప్రత్యేకంగా 365 వత్తులతో చేసిన దీపాలను వెలిగించనున్నారు. నగరంలోని కేశవస్వామిపేట కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, తూర్పుపాలెం గంగా పార్వతీ సమేత రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, అంజయ్య రోడ్డు పంచముఖ శివాలయం, శ్రీగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానం, లాయర్‌పేట సాయిబాబా మందిర మరకత రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, సంతపేట సాయిబాబా మందిర కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం, గడియారం వారి వీధి రామాలయం పశుపతీశ్వర స్వామి దేవస్థానం మొదలైన అనేక చిన్న, పెద్ద శివాలయాలలో నేడు జ్వాలాతోరణం, మహిళల కార్తీకదీపారాధన జరుగనున్నాయి.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజలు సముద్రస్నానాలకు వెళ్లినప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సముద్రంలో పౌర్ణమి రోజున సహజంగానే అలల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కనుక ఎట్టిపరిస్థితులలో ఎక్కువ లోతుకు వెళ్లకూడదని, చిన్నపిల్లలను తీసుకెళ్లేవారు వారిని ఒంటరిగా వదలకుండా తమ వెంటే ఉంచుకోవాలని సూచిస్తున్నారు. పౌర్ణమి రోజు ఉదయం నుంచి సముద్రతీర ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో వాహన రాకపోకలు ఎక్కువగా ఉంటాయి కనుక ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధలను పాటిస్తూ ప్రజలకు ఇబ్బంది రాకుండా పోలీసు యంత్రాంగంతో సహకరించాలని కూడా జిల్లా అధికారులు సూచిస్తున్నారు.

డీఆర్సీ సమావేశానికి పూర్తి సమాచారంతో సన్నద్ధం కావాలి

● కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈనెల 7వ తేదీన జరగనున్న జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశానికి పూర్తి సమాచారంతో సన్నద్ధం కావాలని కలెక్టర్ రాజాబాబు అదేశించారు. డీఆర్సీ సమావేశం నేపథ్యంలో మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి కలెక్టర్ చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తయారు చేయడంపై కలెక్టర్ చర్చించారు. జిల్లాలో ఇటీవలి తుఫాన్ ప్రభావం, వివిధ రంగాల్లో నష్టం, వాటిం అంచనాల రూపకల్పన తదితర అంశాలపై పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి సిద్ధం కావాలని కలెక్టర్ అదేశించారు.

అది వ్యక్తుల ఘర్షణే!

● కులాల మధ్య సమస్య కాదు
● బండ్లమూడి ఘటనపై డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పొలంలో సరుగుడు మొక్కలు గొర్రెలు నాశనం చేశాయని అడిగిన విషయంపై వివాదం మొదలై కొట్లాటకు దారితీసిన ఘటన కులాల మధ్య సమస్య కాదని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చీమకుర్తి మండలం బండ్లమూడికి చెందిన సిరిగిరి సుబ్బారెడ్డికి చెందిన గొర్రెలు అదే గ్రామంలోని ఎస్సీ వర్గానికి చెందిన కంట్ల ఏసుదాసు పొలంలో సరుగుడు మొక్కలు నాశనం చేశాయి. ఈ విషయంపై సోమవారం ఉదయం 7 గంటలకు సుబ్బారెడ్డి ఇంటికి వెళ్లి అడిగితే సరైన సమాధానం చెప్పలేదు. అనంతరం 10 గంటల సమయంలో బండ్లమూడి బస్టాండ్ దగ్గర ఇదే విషయమై ఏసుదాసు, అతని బంధువులతో సుబ్బారెడ్డి వర్గానికి చెందిన వ్యక్తులతో వాదన జరిగింది. ఈ క్రమంలో ఓబులరెడ్డి అనే వ్యక్తి ఇరువర్గాలను సర్దిపుచ్చేందుకు ప్రయత్నం చేశాడు. కట్లం కోటయ్య కర్రతో ఓబులరెడ్డిపై దాడి చేశాడు. ఇరువర్గాలు దాడులు చేసుకు న్నాయి. కొందరికి రక్తగాయాలు అయ్యాయి. గాయపడినవారు ఒంగోలు రిమ్స్, చీమకుర్తి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇరువర్గా లపై కేసులు నమోదయ్యాయి. ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టం కింద కూడా కేసు నమోదైంది. ప్రస్తుతం బండ్లమూడిలో పికెట్ ఏర్పాటు చేసామని, ఆయా ప్రాంతాల్లో సీసీ కెమోరాలు ఏర్పాటు చేశామని డీఎస్పీ చెప్పారు.

బండ్లమూడిలో పోలీస్ పహారా



చీమకుర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రణరంగంగా మారిన బండ్లమూడి గ్రామం మంగళవారం ప్రశాంతంగా మారింది. పోలీసుల పటిష్ట పహరా, కీలకమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, గ్రామంలో అనునిత్యం పహరా కాస్తున్న పారా మిలిటరీ దళాలతో పహరా ఏర్పాటు చేశారు. మరోవైపు తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య తన సిబ్బందితో కలిసి ఎస్సీకాలనీకి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. సీఐ దాసరి ప్రసాద్ సిబ్బందితో కలిసి గ్రామంలో పహరా నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. రెండు చోట్ల పోలిస్ పికెట్లను ఏర్పాటు చేశారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ

● 36 బృందాలు ఏర్పాటుచేసిన ఎస్పీ ● రవాణా శాఖ ఆధ్వర్యంలో ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలు

ఒంగోలు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత, ప్రమాదాల నివారణ కోసం పోలీసు, రవాణా శాఖ యంత్రాంగం కదిలింది. ఇటీవల రెండు రాష్ట్రాల్లో జరిగిన భారీ రోడ్డు ప్రమాదాలతో యంత్రాంగం అప్రమత్తం అయింది. పాఠశాల, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులతో పాటుగా, భారీ వాహనాల తనిఖీలు చేపట్టారు. జిల్లాలో మంగళవారం పోలీసులు 36 బృందాలుగా ఏర్పడి తనిఖీ చేశారు. అదే సమయంలో రవాణా శాఖ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అని డీటీసీ కార్యాలయంలో ఒక్కో యజమానికి సంబంధించిన బస్సులను తనిఖీ చేశారు. రహదారి భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నారు.

ఈనెల 10లోపు తప్పనిసరిగా బస్సుల్లో లోపాలను గుర్తించి సరిదిద్దుకోవాలని రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో పోలీసు తనిఖీల్లో ప్రమాణాలు పాటించారా లేదా అనే కోణంలో పరిశీలిస్తున్నారు.



బస్సును పరిశీలిస్తున్న పోలీసులు

ఇవి తప్పక పాటించాలి

● పాఠశాల బస్సులకు 40 కిలోమీటర్ల వేగ నియంత్రణ ఉండాలి.
● డ్రైవర్‌కు హెవీలైసెన్స్ కలిగి 5 ఏళ్ల అనుభవం ఉండాలి.
● ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేశారా? అగ్ని నియంత్రణ చేసే పరికరాలు తప్పక ఉండాలి.
● ఎమర్జెన్సీ ఎగ్జిట్స్ ఉండాలి.
● ట్రావెల్స్ బస్సుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు అలారం మోగే విధంగా ఏర్పాటు చేయాలి.
● సీటింగ్ కెపాసిటీ నిబంధనలకు లోబడి ఉండాలి.

ప్రజల ప్రాణాలు విలువ గుర్తించాలి

వాహన చోదకులు ప్రజల ప్రాణాల విలువను గుర్తించి, భద్రత నియమాలు పాటించాలి. బస్సుల యజమానులు ప్రయాణ భద్రత విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై జరిమానాలు విధించడంతో పాటుగా, భద్రత లోపాలు ఉన్న వాహనాలను రోడ్లపై నడపకుండా నిలిపివేయిస్తాం.

-వి.హర్షవర్ధనరాజు, ఎస్పీ

జీజీహెచ్‌లో అధునాతన వినికిడి పరీక్ష విభాగం

● ప్రారంభించిన సూపరింటెండెంట్ మాణిక్యరావు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినికిడి లోపంతో బాధపడే వారికి, సదరం క్యాంపులకు విచ్చేసేవారిని పరీక్షించేందుకు ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అధునాతన నిర్ధారణ వైద్య పరికరాలు కేంద్రాన్ని మంగళవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జీజీహెచ్‌లో నూతన ఆడియో మెట్రి రూమ్‌ను ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం అనేక అధునాతన పరికరాలు సమకూరుస్తుందని చెప్పారు. మెట్రి రూమ్‌తో ఓటో ఎకాస్టిక్ ఎమిషన్ పరికరం అందుబాటులోకి తీసుకువచ్చామని, పుట్టుకతో వినికిడి లోపం ఉన్న వారిలో ఈ పరికరం గుర్తించి చికిత్స అందించేందుకు ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.



వినికిడి పరీక్షా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ మాణిక్యరావు

విజేతలకు అభినందన



బహుమతులు సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఒంగోలు విద్య, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 13 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజీ మ్యూజియం బెంగళూరు ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీలకు ఏపీఆర్ఎస్ గర్ల్స్, అమ్మనబ్రోలు విద్యార్థులు ప్రదర్శించిన స్మార్ట్ అగ్రికల్చర్ డ్రామా ఎంపికైంది. జిల్లాపరిషత్ ఆలకూరపాడు విద్యార్థులు ప్రదర్శించిన డ్రామా ద్వితీయ స్థానం లభించడంతో విజేతలను డీఈవో కిరణ్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభను చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కిషోర్‌బాబు, హెచ్ఎం రాధ, జిల్లాసైన్స్ అధికారి టి.రమేష్‌లు పాల్గొనగా న్యాయనిర్ణేతలుగా బ్రహ్మయ్య, రంగారావులు వ్యవహరించారు.

శిక్షణను సమర్థవంతంగా వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీచ్ టూల్ రీఫ్రెషర్ శిక్షణను సమర్థవంతంగా వినియోగించుకొని మండల స్థాయి శిక్షణా కార్యక్రమలను చక్కగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఈవో కిరణ్‌కుమార్ సూచించారు. ఒంగోలులోని డీఆర్ఆర్ఎం హైస్కూలులో మంగళవారం టీచ్ టూత్ రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణకు మండలానికి ఇద్దరు చొప్పున 76 మంది మాస్టర్ ట్రైనర్స్‌కు రెండు రోజుల పాటు తర్ఫీదు ఇవ్వనున్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు మండలస్థాయిలో శిక్షణ ఇచ్చేవిషయంలో తగిన విధంగా వ్యవహరించాలన్నారు. ఒంగోలు ఎంఈవో టి.కిషోర్‌బాబు కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష నోడల్ అధికారులు డి.నాగరాజు, ఎం.జాలరత్నం, పి.నాగేంద్రనాయక్, టీచ్‌టూల్ జిల్లా కో ఆర్డినేటర్ చైతన్య పాల్గొన్నారు.

వరద ముంపు నివారణ చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో నగర సుందరీకరణ పేరుతో కోట్లాది రూపాయాలు అమృత్-2 నిధులతో కాంట్రాక్టర్ల జేబులు నింపే ప్రక్రియను నిలిపివేసి నగర ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, సభ్యులు జి.రమేష్, తంబి శ్రీనివాసులు, సయ్యద్ హుస్సేన్ మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో ఒంగోలు నగరం మొత్తం కకావికలమైందన్నారు. అధికారులు వెల్లడించిన నష్ట వివరాలు ఆందోళన కలిగించేలా ఉందని చెప్పారు. అధికారుల నివేదిక ప్రకారం పోతురాజుకాలువ పరివాహక ప్రాంతం, నల్లవాగు ఇరువైపులా 15 డివిజన్ల పరిధిలో 54కాలనీల్లో 25శాతం ప్రజలు ముంపునకు గురయ్యారన్నారు. ఒక్కొక్క కుటుంబం సగటున రూ.10వేల వరకు నష్టపోయారన్నారు. అయితే జిల్లావ్యాప్తంగా కేవలం 9051 కుటుంబాలకు మాత్రమే నష్టం నమోదు చేయడాన్ని వారు తప్పుపట్టారు. నష్టపోయిన బాధితులందరికీ న్యాయం చేయాలని వారు కోరారు.

ఈదుమూడిలో గండి పూడ్చివేత


రోడ్డుపై పడిన గండి (ఫైల్)


గండిని పూడుస్తున్న ఎక్స్‌కవేటర్

నాగులుప్పలపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఈదుమూడిలోని ఎస్సీకాలనీ సమీపంలో సైఫన్ వద్ద పొలాలకు వెళ్లే డొంకరోడ్డుకు గండి పడింది. నిత్యం అటుగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డు పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉండగా ఏఈ వీరాంజనేయులు గండి పడిన రోడ్డు మరమ్మతులకు నిధులు కోరుతూ ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. అయితే రైతుల ఇబ్బందుల దృష్ట్యా గ్రామ సర్పంచ్ బోలే లక్ష్మి, కార్యదర్శి రంగారెడ్డి గ్రామ పంచాయతీ నిధులతో బొబ్బేపల్లి నుంచి గ్రావెల్ తెప్పించి గండిని పూడ్పించారు. దీతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

అపెక్స్ విద్యార్థులకు బహుమతులు


ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

ఒంగోలు విద్య, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మంగళవారం తన కార్యాలయంలో నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ పోటీల్లో ఒంగోలులోని అపెక్స్ విద్యార్థులు పలు బహుమతులు సాధించారు. వ్యాసరచనలో కె.మనోజ్ఞ ప్రథమ, హీనా తృతీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ కె.శివకోటిరెడ్డి, డైరెక్టర్ వాకా రాజశేఖర్‌రెడ్డి, ఏవో ఎస్కే. జిలానీబాషా అభినందించారు.

క్రీడల్లోనూ రాణించాలి


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో రమణయ్య

నాగులుప్పలపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో తిరుమలశెట్టి రవి, ఈవీ.రమణయ్య సూచించారు. బి.నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో అండర్- 14, అండర్-17 బాలబాలికల మండలస్థాయి కబడ్డీ పోటీలను వారు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. శరీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. బాలుర విభాగంలో నిడమానూరు హైస్కూల్ విద్యార్థులు విజేతగా నిలిచారు. అండర్-17 బాలికల విభాగంలో ఉప్పుగుండూరు హైస్కూల్, అండర్-14 విభాగంలో మాచవరం హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎల్.శ్రీనివాసరావు, బి.శివప్రసాద్, ఉపాధ్యాయులు బక్కమంతుల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

ఒంగోలు కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీఅభయ సేవ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దాలి మాధవరావు ఆధ్వర్యంలో మంగళవారం చీమకుర్తిలోని క్రిస్టియన్‌పాలెంలో గల తుఫాన్ బాధితులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ పాటిబండ్ల కోటేశ్వరరావు, షాలేం రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కొప్పోలురోడ్డులో భారీ గుంతలు

● ఇబ్బందిపడుతున్న వాహనదారులు


ఫ్లైఓవర్ వంతెన దగ్గర ఏర్పడిన భారీ గుంత

మొంథా తుఫాన్ ప్రభావంతో కొప్పోలు రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ఈ రోడ్డులో ప్రయాణించాలంటేనే భయపడుతున్నారు. తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు రైల్వే ఫ్లైఓవర్ వంతెన దగ్గర నుంచి కొప్పోలు రామాలయం వరకు గల తారు రోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రధానం ఫ్లైఓవర్, ఎన్టీఆర్ కాలనీ దగ్గర వద్ద భారీ గుంతలు ఏర్పడడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు రూరల్, (ఆంధ్రజ్యోతి)

ఎస్సీల మీద దాడికి పాల్పడిన

వారిపై కేసు నమోదు చేయాలి

● కలెక్టర్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి


కలెక్టర్ రాజాబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలం బండ్లమూడిలో దాడికి గురైన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బాధితులకు న్యాయం చేయడంతోపాటు, దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహజన సోషలిస్ట్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఒంగోలులో కలెక్టర్ పి.రాజాబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వైకే.విశ్వనాథ్‌మాదిగ మాట్లాడుతూ సోమవారం బండ్లమూడిలో ఎస్సీలపై మరో సామాజికవర్గం చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు ప్రత్యేక దృష్టిసారించి బండ్లమూడిలో ఎస్సీలకు భద్రత కల్పించాలని కోరారు. అనంతరం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులు కంట్లం ఏసుదాసు, కంట్లం రామయ్య, ఏసేబులను పరామర్శించారు. అదే సమయంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఫోన్ ద్వారా బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు జలదంకి నరసింగరావు, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు తొరటి ఆనంద్, లక్ష్మి నరసయ్య, బాపట్ల జిల్లా అధ్యక్షుడు దుడ్డు వందనం, నగర అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్, నాయకులు పూనూరి కృష్ణఫర్, తిరువీధి బాబు, రావినూతల కోటి, రవి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై శనగలు, మినుములు : ఏవో



రుద్రవరంలో మాట్లాడుతున్న ఏవో పావని

సంతనూతలపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై రైతులకు శనగలు, మినుములను అందజేయనున్నట్లు ఏవో పావని తెలిపారు. గుర్వారెడ్డిపాలెం, రుద్రవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనగలు, మినుములు కావల్సిన రైతులు రైతుసేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. పొలాలను కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్న రైతులు కౌలుకార్డులు తీసుకుంటేనే వ్యవసాయశాఖలో అమలవుతున్న పథకాలకు అర్హులని తెలిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంట వివరాలను వ్యవసాయసహాయకులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో కేవీ. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేయించుకోవాలి

పొన్నలూరు: శనగ విత్తనాలు అవసరమైన రైతులు ఆర్ఎస్‌కేలలో పేర్లు నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి రాము సూచించారు. మండలంలోని ముప్పాళ్ల, సింగరబొట్లపాలెం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాము మాట్లాడుతూ ప్రభుత్వం శనగ విత్తనాలను 25శాతం రాయితీతో ఇస్తున్నదన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్రంలో అన్ని రకాల ఎరువుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ముప్పాళ్ల సొసైటీ అధ్యక్షుడు మన్నెం రమణయ్య, వ్యవసాయ సహాయకులు వి.రాకేషకుమార్ రెడ్డి, పశు వైద్య సహాయకులు ఖాదర్‌వలి, పంచాయతీ కార్యదర్శి గీత పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

● జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు జవహర్


బహుమతులను అందజేస్తున్న డాక్టర్ జవహర్


మద్దిపాడులో విద్యార్థులతో ఉపాధ్యాయులు

చీమకుర్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్ కోరారు. మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాన్ని మంగళవారం చీమకుర్తిలో ఆయన విడుదల చేశారు. తదుపరి జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేవీవి జిల్లా అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి చలువాది రమేష్, కోశాధికారి బి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం చెకుముకి ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బి.మాల్యాద్రి మాట్లాడుతూ చెకుముకి పరీక్షల ద్వారా విద్యార్థుల నైపుణ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, బీవీ.సుబ్బారావు, యు.అమరనాథ్, రవిశేఖర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో..

సంతనూతలపాడు: మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముఖి టాలెంట్ పరీక్షను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు జిల్లా స్థాయిలో పరీక్షలో పాల్గొంటారని జేవీవీ నాయకుడు కోదాటి కోటేశ్వరరావు తెలిపారు.

పొన్నలూరులో..

పొన్నలూరు: మండల కేంద్రమైన పొన్నలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం చెకుముకి పోటీలు నిర్వహించారు. ఆరు ప్రభుత్వ, ఒక ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ముండ్లమూరివారిపాలెం జడ్పీ, కె.అగ్రహారంలోని శ్రీ విద్యానికేతన్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పొన్నలూరు జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు వై.వెంకటేశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక డివిజన్ కార్యదర్శి ఎస్కే.మహబూబ్‌బాషా, ఉన్నం వెంకట్రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగర కమిషనర్‌కు సత్కారం


కమిషనర్ వెంకటేశ్వరరావును అభినందిస్తున్న మాజీ సైనికులు

ఒంగోలు(రూరల్), నవంబరు4(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల ఒంగోలు నగరంలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం లేకుండా బాధ్యతలు నిర్వర్తించిన కమిషనర్ డాక్టర్ కోదూరి వెంకటేశ్వరరావును కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం రాత్రి మాజీ సైనిక సంక్షేమ సంఘం నాయకులు కలిసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు బొకే అందజేశారు. అనంతరం సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నెప్పలి నాగేశ్వరరావు మాట్లాడుతూ విపత్తు సమయంలో కమిషనర్ ప్రముఖపాత్ర పోషించి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. అదేవిధంగా మాజీ సైనిక సంక్షేమ సంఘం తరుపున పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆలపాటి వెంకటేశ్వరరావు, పి.దశరథరామయ్య, కటారి బ్రహ్మయ్య, క్యాంటీన్ మేనేజర్ గుమ్మడి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పొగనారు మడుల రైతులను ఆదుకోవాలి

కొండపి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన పొగాకు నారుమడుల సాగుదారులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నాంచార్లు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పెరిదేపి, చోడవరం, వెన్నూరు గ్రామాల్లో దెబ్బతిన్న నారుమడులను పరిశీలించారు. మండలంలో 150 ఎకరాల్లో నారుమడులు దెబ్బతిన్నాయన్నారు. 90శాతం మంది ఎస్సీలు, కూలీలు, కౌలు రైతులు నారుమడులు పెట్టి నష్టపోయారన్నారు. ఇంజన్లు, పైపులు, స్ప్రింక్లర్లు కొట్టుకుపోవడంతో కోలుకోలేని దెబ్బతిన్నారన్నారు. అనంతరం కొండపిలో తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వై.చంద్రశేఖర్, వై.వి.కృష్ణారావు, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు భారతి, సీఎస్.సాగర్, మేడిద శివకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ చెస్, యోగా పోటీలకు ఒంగోలులోని బాలాజీనగర్‌లోని నగరపాలక సంస్థ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బంకా లక్ష్మీప్రసన్న మంగళవారం తెలిపారు. తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వై.మీనాక్షి రాష్ట్రస్థాయి చెస్, పి.చందుబాబు యోగా పోటీలకు ఎంపిక కాగా, 8వ తరగతి విద్యార్థులు మిల్టన్, సీహెచ్.మహేష్, 7వ తరగతి విద్యార్థి ఆర్.ధనుష్ యోగా ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పశువుల దాణా పంపిణీ



దాణాను అందస్తున్న నాగేశ్వరరావు, వైద్యాధికారులు

మద్దిపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పశువులకు రాయితీతో దాణా అందిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం మద్దిపాడులోని పశువైద్యశాలలో రైతులకు దాణాను అందజేశారు. ప్రభుత్వం రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యలమందరావు, మద్దా ఆంజనేయులు, చుండూరి వెంకట్రావు, శేషగిరిరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కారుమంచి-మల్లవరప్పాడు రోడ్డుకు మరమ్మతులు

టంగుటూరు (కొండపి), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా దెబ్బతిన్న కారుమంచి-మల్లవరప్పాడు మధ్యలో దెబ్బతిన్న 200 మీటర్ల రోడ్డుకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదేశాలతో టెంపరరీ రిస్టొరేషన్ మెయింటెనెన్స్ కింద పనులు చేస్తున్నారు. కారుమంచి గ్రామ టీడీపీ నాయకుడు ఈదర ప్రభాకర్ ఆధ్వర్యంలో ఇప్పటికే కొంత మేరకు మరమ్మతులు చేశారు. అయితే భారీ వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీలుగా పూర్తిస్థాయిలో పనులు చేస్తున్నామని ఆర్‌అండ్‌బీ ఒంగోలు సెక్షన్ ఏఈఈ నాగార్జున వివరించారు. పనులు త్వరగా పూర్తి చేస్తామని ఆయన చెప్పారు.

తప్పు చేసిన వారు శిక్షలు అనుభవించాల్సిందే..

● సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇబ్రహీంషరీఫ్

ఒంగోలు క్రైం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన వారు శిక్షలు అనుభవించాల్సిందేనని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ ఇబ్రహీంషరీఫ్ పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని జిల్లా జైలులో ఖైదీలకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయాధికారి ఇబ్రహీంషరీఫ్ మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకోలేని ఖైదీలు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ అనే పద్ధతిలో ఉచితంగా నియమిస్తామని, ఈ అవకాశాన్ని వినయోగించుకోవాలని కోరారు. న్యాయస్థానంలో శిక్షలు ఖరారు అయ్యేవరకు నేరస్థులు కారన్నారు. అదేవిధంగా జైలు అధికారులు ఖైదీలకు నాణ్యత గల ఆహారపదార్థాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూను అమలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ కౌన్సిల్ పి.వీరరాఘవులు, జైలర్ మజ్జి అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పంట నష్ట జాబితాల ప్రదర్శన

● ఏవో శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండల పరిధిలో పంటలు నష్టపోయిన రైతుల జాబితాలను ఈ నెల 5వ తేదీ నుంచి రెండు రోజులపాటు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శిస్తామని ఏవో పోతినేని శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. గ్రామాల వారీగా పంటలు నష్టపోయిన రైతులు, పంటల వివరాలను వ్యవసాయశాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలు సిద్ధం చేశారన్నారు. మండలంలో వరి 2,500, మొక్కజొన్న 50ఎకరాలు, ప్రత్తి ఒక హెక్టారులో నష్ట పోయినట్లు గుర్తించామన్నారు. ఆ నివేదికలను జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయానికి పంపించామని, ఆ జాబితాలను పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శనకు ఉంచుతాయని తెలిపారు. వాటిపై అభ్యంతరాలు ఉంటే సరి చేస్తామన్నారు. కాగా వరదలో మునిగిన వరిపంటలో కుళ్లు తెగులు సోకకుండా నీటి నిల్వ లేకుండా చేసుకొని లీటరు నీటిలో ట్రిల్ట్ 2 ఎంఎల్, పురుగుసోకినట్లయితే ఎస్పేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని ఏవో సూచించారు.

పట్టణ ప్రాంతాల అభివృద్ధిపై మాగుంట సమీక్ష

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పట్టణ ప్రాంతాల్లో తాగునీటికి సంబంధించి పునరుద్ధరణ, అమృతపథకంపై ఒంగోలు ఎంపీ, గృహ, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాడింగ్ కమిటీ చైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి సమీక్ష నిర్వహించారు. మంగళవారం ఢిల్లీలోని పార్లమెంట్ అనుబంధ భవన్‌లో గృహ,పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించి దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నాడు.

రేపు మాగుంట రాక

ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గురు, శుక్రవారాల్లో ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. గురువారం ఉదయం 8గంటలకు స్థానిక రామనగర్‌లోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో జరిగే పవిత్రోత్సవాల్లో పాల్గొంటారు. శుక్రవారం ఉదయం రంగా భవన్‌లో జరిగే కార్యక్రమంలో, 11 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే డీఆర్సీ సమావేశంలో మాట్లాడారు.

దళితులపై దాడి హేయం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం బండ్లమూడిలో శ్రీనివాసులురెడ్డి, బాలటబుల్‌రెడ్డి సమక్షంలో వారి అనుచరులు మూకుమ్మడిగా దళితులపై దాడి చేయడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే.మాబు ఖండించారు. సీపీఎం ప్రతినిధి బృందం మంగళవారం స్థానిక రిమ్స్‌లో బాధితులను పరామర్శించి జరిగిన ఘటనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిమ్స్ సూపరిటెండెంట్ మాణిక్యరావుతో మాట్లాడారు. బాధితులు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. అనంతరం బాధిత స్వగ్రామైన బండ్లమూడి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, బి.రఘురాం, వి.బాలకోటయ్య, బంకా సుబ్బారావు, నెరుసుల వెంకటేశ్వర్లు, పల్లాపల్లి ఆంజనేయులు, కంకణాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులపై అనుచిత ప్రవర్తన తగదు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపట్ల తాళ్ళూరు ఎస్ఐ అనుచితంగా ప్రవర్తించడం దారుణంగా ఉందని మాదిగ సంక్షేమపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుజన్‌మాదిగ ఆరోపించారు. స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళ్ళూరు గ్రామానికి చెందిన మాదిగలు అక్కడి పోలీస్‌స్టేషన్‌కు వెళితే వారిని కులం పేరుతో ఎస్ఐ అసభ్యపదజాలంతో దూషించడం హేయమైన చర్య అన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన ఎస్ఐ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తొరటి ఆనంద్, జి.యోహన్, త్యాగరాజు, పి.నారాయణ, కోటేశ్వరరావు, జాషువా తదితరులు పాల్గొన్నారు.

నేడు బండారు రామారావు వర్ధంతి

ఒంగోలు కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నాట్యమండలి ఆధ్వర్యంలో ప్రముఖ పౌరాణిక రంగస్థల నటుడు బండారు రామారావు 49వ వర్ధంతి సభను బుధవారం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక డీఆర్ఆర్ మునిసిపల్ స్కూల్ వద్ద ఉన్న బండారు రామారావు, డీవీ.సుబ్బారావు విగ్రహాలకు నివాళి కార్యక్రమం, సాయంత్రం 7 గంటలకు మునిసిపల్ ఆడిటోరియంలో చింతామణి, సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. అభిమానులు, కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

శ్రీగిరిలో ప్రత్యేక పూజలకు శ్రీకారం

ఒంగోలు కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో సాయంత్రం అంకురార్పణ చేశారు. ఇక బుధవారం ఉదయం 7.30 గంటలకు కుంభపూజ, 9 గంటలకు శ్రీవారికి అష్టోత్తర శత సహస్ర కలశాభిషేకం, సాయంత్రం కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి తెలిపారు. కార్యక్రమాలను ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ. రామకృష్ణా రావు, ఆలూరు జైశంకర్ తదితరులు పర్యవేక్షించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

ఒంగోలు క్రైం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మృతి చెందిన కానిస్టేబుల్ దూదేకుల మాబుసుభానీ కుటుంబానికి సహోద్యోగులు చేయూతనిచ్చారు. మంగళవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో 2020 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుళ్ళు ఎస్పీ హర్షవర్ధనరాజు చేతుల మీదుగా రూ.2.46 లక్షలు చెక్కును అందజేశారు. కానిస్టేబులు మామసుభానీ 2024 అక్టోబరు 19న చీమకుర్తిలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. ఆయన కుటుంబానికి భరోసా కల్పిచేందుకు ఏఆర్ కానిస్టేబుళ్లు ముందుకు వచ్చి ఈమేరకు ఆర్థికసాయం అందిచారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలి : బీజేపీ

మద్దిపాడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజలు సాధ్యమైనంత వరకు స్వదేశీ ఉత్పత్తులను ఉపయోగించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు కోరారు. మంగళవారం మద్దిపాడు శ్రీనటరాజ కళా సమితిలో ప్రతి ఇంటా స్వదేశీ-ఇంటింటా స్వదేశీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారి జీవితంలో అవసరమైన వస్తువులను సాధ్యమైనంత వరకు మన దేశంలో తయారైన ఉత్పత్తులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ గుర్రం సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ దుంపా కోటిరెడ్డి, ఉపాధ్యక్షులు కామిశెట్టి వెంకయ్య, ఎస్సీ మోర్చా అధ్యక్షులు చలంచర్ల వీరాంజనేయులు, పోనూరి యలమంద, ఆత్మకూరి వాసు, నరేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

7న ఎన్జీరంగా జయంతి కార్యక్రమాలు

ఒంగోలు(రూరల్), నవంబరు4(ఆంధ్రజ్యోతి): పద్మవిభూషణ్ ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి కార్యక్రమాలు ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు ఆచార్య ఎన్జీరంగా భవన్ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు నగరం సంతపేటలో గల ఎన్జీరంగాభవన్‌లో జరిగే వేడుకల్లో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. రైతు నాయకులు, రైతులు పాల్గొనాలని కోరారు.

8న పొగాకు వేలం ముగింపు

ఒంగోలు(రూరల్), నవంబరు(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2లో ఈనెల8వ తేదీతో పొగాకు వేలం ముగుస్తుందని వేలం నిర్వహణాధికారి జె.తులసి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీన మిగిలి ఉన్న బేళ్లను వేలానికి తీసుకురావాలని ఆమె కోరారు.

చెరువు కట్టలు, రోడ్లకు దెబ్బ



తుఫాన్ కారణంగా తెగిపోయిన సోమిదేవిపల్లి దశబంధ చెరువు కట్ట



సంగపేట గ్రామం వద్ద కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డు



అనుములపల్లి - గౌతవరం తారు రోడ్డు దుస్థితి

- ముంచిన మొంథా తుఫాన్
- వృథాగా పోతున్న నీరు
- ఆందోళనలో రైతులు

రాచర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సంభవించిన మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన చెరువు కట్టలు, ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నాయి. సోమిదేవిపల్లి గ్రామ సమీపంలోని దశబంధ చెరువు కట్ట తెగిపోవడంతో నీరంతా వృథాగా పోతుండడంతో కట్ట కింద పొలాలున్న రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సంగపేట సమీపంలోని ఆర్ అండ్‌బి రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనుములపల్లి - గౌతవరం గ్రామాల మధ్య తారు రోడ్డు దెబ్బతినడంతో వృద్ధులు, పాఠశాల విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. మండలంలో వివిధ గ్రామాల్లో తారు రోడ్లు, అంతర్గత రోడ్లు కూడా తుఫాన్ కారణంగా దెబ్బతిన్నాయని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. కొన్ని గ్రామాల్లో డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో రోడ్లపై నీరు నిలిచి ఇప్పటికీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి దశబంధ చెరువు సోమిదేవిపల్లి ఆర్‌అండ్‌బి రోడ్డు మరమ్మతులకు సమస్యకు వెంటనే పరిష్కారానికి చొరవ చూపారు. అనుములపల్లి గౌతవరం గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లపై నీరు నిల్వ ఉండడంతో పరిష్కార చర్యలు చేపట్టలేదు.

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు దోర్నాల విద్యార్థి



ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్ద దోర్నాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయిని శ్యాంప్రసన్నతాంజలి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 3న ఒంగోలులో జరిగిన అండర్-17 విభాగం చెస్ పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన వీ నాగవంశీమాధవ్ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానాన్ని చేసుకున్నాడు. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు ఆమె తెలిపారు. ఎంఈవో మస్తాన్ నాయక్, ఉపాధ్యాయ సిబ్బంది రామానాయక్, హెచ్ రామానాయక్, నాగమూర్తి, అనసూయదేవి, విజయమాణిక్యం, రహమత్ విద్యార్థిని అభినందించారు.



విశ్వభారతి స్కూల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో విజేతలు

శాస్త్రీయ విజ్ఞానం అభివృద్ధి చెందాలి

గిద్దలూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ విజ్ఞానం అభివృద్ధి చెందినప్పుడే మూఢనమ్మకాలు పోతాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి పి.స్వరూపారెడ్డి అన్నారు. పట్టణంలోని విశ్వభారతి హైస్కూలులో జేవీవీ ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి సైన్స్ పరీక్ష మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భైలడుగు బాలయ్య, జేవీవీ డివిజన్ అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కె.రామిరెడ్డి, పలు పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు. మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో కేఎస్‌పల్లె జిల్లాపరిషత్ హైస్కూలు విద్యార్థులు ప్రథమ స్థానం, పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని, సంజీవరాయునిపేట హైస్కూలు విద్యార్థులు తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో సూర్య విద్యానికేతన్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. జిల్లాస్థాయి సైన్స్ సంబరాలకు కెఎస్‌పల్లె ఉన్నత పాఠశాల, సూర్యవిద్యానికేతన్ పాఠశాల ఎన్నికయ్యారు.

కంభం : జన విజ్ఞాన వేదిక కంభం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక బోర్డు స్కూల్ నందు జన విజ్ఞాన వేదిక మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎంఈవో అబ్దుల్ సత్తార్ ప్రశ్నా పత్రాలను విడుదల చేశారు. కంభం బాలికల పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థినులు, వాసవీ విద్యానికేతన్ నుంచి ముగ్గురు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.

రాచర్ల : విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎంఈవోలు షేక్ మొయినుద్దీన్, వీ గిరిధర్ శర్మ అన్నారు. రాచర్ల జన్మభూమి భవనలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించారు. ఈ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానం, అనుములవీడు, రాచర్ల విద్యార్థులు రెండో స్థానం, జేపి చెరువు, ఎడవల్లి విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారని ఈనెల 23న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని కోరారు.

కొమరోలు : మండల స్థాయి చెకుముకి పోటీల్లో స్థానిక ఎస్‌బీఐ పాఠశాల ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు, బొర్రా వెంకటరత్నం తెలిపారు.

మార్కాపురం వన్‌టౌన్ : విద్యార్థులలో శాస్త్రీయ దుక్పధం అవసరమని వేమన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతమ్మ అన్నారు. స్థానిక రెడ్డి మహిళా కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వార్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశ్న పత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి, జనవిజ్ఞాన నాయకులు బాబు, శివ, రవికుమార్, ముక్తేశ్వరరావు, రామాంజనేయులు పాల్గొన్నారు.

తర్లుపాడు : జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టులో చెన్నరెడ్డి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

గిద్దలూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై మంగళవారం గిద్దలూరు, రూరల్ అర్బన్ సీఐ రామకోటయ్య, సురేష్ ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి పత్రాలను, లైసెన్సులను పరిశీలించి డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.

కంభం : కంభంలో సీఐ మల్లికార్జున, ఎస్ఐ నరసింహులు బస్సులు, వాహనాలను తనిఖీ చేశారు. సక్రమంగా లేని వాటికి జరిమానా విధించారు.

రాచర్ల, : మోటార్ వాహనాలకు సంబంధించి వాహనదారులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఏఎస్సై శ్రీనివాసరావు అన్నారు. గిద్దలూరు కంభం జాతీయ రహదారిపై రాచర్ల స్టేషన్ వద్ద మంగళవారం ఆయన వాహనాలు తనిఖీ చేశారు.

రైతులకు శనగల పంపిణీ

కంభం, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి) : రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తున్నదనిమార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం అర్ధవీడు మండలం నాగులవరంలో రైతులకు సబ్సిడీపై శనగలను పంపిణీ చేశారు. భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ బ్యాంక్ చైర్మన్ రంగారెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, శివగంగ ప్రసాద్, గోపాల్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి రంగారెడ్డి పాల్గొన్నారు.

నేడు కార్తీక పౌర్ణమి

గిద్దలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలకు శివాలయాలన్నీ ముస్తాబయ్యాయి. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలుకానున్న దృష్ట్యా ఆయా దేవాలయాలలో నిర్వాహకులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. పట్టణంలోని శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీకుసుమ హరనాథ క్షేత్రంలో గురువారం ఉదయం సుమారు 100 మంది దంపతులతో సామూహిక అభిషేకాలు జరిపించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం సాయంత్రం శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానం, శ్రీకుసుమ హరనాథ, శ్రీవాసవీ కన్యకపరమేశ్వరి, శ్రీఅభయాంజనేయస్వామి, నాగమయ్య దేవస్థానాలు, ముండ్లపాడులోని భవానీ శంకరాలయంలలో జ్వాలాతోరణం, కోటి దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చాలా దేవాలయాల పరిధిలో భక్తులకు అల్పాహార ఏర్పాట్లను పూర్తి చేశారు.

జగదాంబకు ప్రత్యేక పూజలు



మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని జగదాంబ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగదాంబ సమేత మార్కాండేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు అంజనేయ శర్మ, వరుణ్ తేజ శర్మ స్వామికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. జగదాంంబకు కుంకుమార్చన, అలంకరణ, విశేష పూజలు చేశారు. ఈవో ఇదుల చెన్నకేశవ రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పొదిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో సీఎం సహాయనిధి చెక్కులను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మి మంగళవారం పంపిణీ చేశారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ పలు రకాల వైద్య సేవలు చేయించకున్న వారికి ఆమె చెక్కులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్యం చేయించుకోలేని పేదలకు వైద్య సాయం అందించాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమన్నారు. గత వైసీపీ పాలనలో సీఎం సహాయ నిధి సాయాన్ని ఆపేశారని, ఆరోగ్యశ్రీ కింద సేవలందించిన ఆసుపత్రులకు బిల్లులు చెల్లించలేదని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసిందన్నారు. నిరంతరాయంగా వైద్య సేవలందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని వసంతలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, క్లస్టర్ ఇన్‌చార్జి ఆవులూరి యలమంద, జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు రసూల్, తెలుగుయువత మండల నాయకులు కాలేషా, నాయకులు తలమళ్ల వెంకట్రావు, సామంతపూడి నాగేశ్వరరావు, తానికొండ వెంకట్రావు, కాటూరి శ్రీనివాసులు, యాసిన్, సోమయ్య, జ్యోతిమల్లి, గౌస్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థుల ప్రతిభ

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జరిగిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని అన్ని మండాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పలు కాంపీటేషన్ పోటీలను మండల విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ పోటీలలో వైపాలెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన టెన్త్ విద్యార్థులు ఎల్ భవ్యశ్రీ, త్రిపురాంతకం జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన నవదీప్, గణపవరం ఏపీఆర్‌ఎస్ విద్యార్థి కే నాగరాజు ఎంపికైనట్లు ఎంఈవోలు ఆంజనేయులు, మస్తాన్‌నాయక్, మల్లునాయక్, ఇందిర తెలిపారు. ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఎన్‌ఈపీ-2020లో భాగంగా ఐటీ, ఐటీఈఎస్ ట్రేడ్ విభాగాలలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణలో 9వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థినులు పాల్గొన్నారు. వారిలో నలుగురిని స్కూల్ లెవల్ ప్రోగ్రాంకు ఎంపిక చేసినట్లు ఒకేషనల్ ట్రైనర్ జే పావని బాయి తెలిపారు. ఎస్ శైలజ, సీహెచ్ అనురాధ, వీ దేవి, ఎస్ కాంతామణి ఈ-కామర్స్ నెట్‌వర్క్‌లో ఎంపికైనట్లు తెలిపారు. కళాశాల ప్రత్యేకాధికారి ఎస్.తిరుమలదేవి, సీహెచ్ గురవమ్మ, సునంద, సుజాత, మస్తాన్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లను బాగుచేయండి

తర్లుపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తర్లుపాడులోని ఎస్సీపాలెం వద్ద రోడ్డుపై మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడ్డాయి. తర్లుపాడు నుంచి తుమ్మలచెరువుకు వెళ్లే రోడ్డుదెబ్బతిన్నది. నాగేళ్లముడుపు నుంచి ఫతేపురం వెళ్లే రోడ్డు ధ్వంసమైంది. ఉన్నతాధికారులు స్పందించి ఛిద్రమైన రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎస్సీపాలెం వద్ద రోడ్డు దుస్థితి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు



మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. మండలంలోని ఎగువచెర్లోపల్లి వద్ద ఉన్న మోడల్ స్కూల్‌ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠ శాలలోని వసతులు, వంటగదిని పరిశీలించిన ఎరిక్షన్‌బాబు విద్యార్థులతో మాట్లాడారు. నీటి సమస్య ఉన్నట్లు విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా త్వరలో పరిష్కరించనునట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తోందని, వినియోగించుకొని ఉన్నతంగా ఎదగాలని ఎరిక్షన్‌బాబు సూచించారు. భోజనాన్ని రుచిగా, సుచిగా ఒండి అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్ నాయక్, ప్రిన్సిపాల్ ఆంజనేయులు, టీడీపీ మండల అధ్యక్షుడు షేక్‌మాబు, సొసైటీ అధ్యక్షుడు బట్టు సుధాకర్‌రెడ్డి, ఎలకపాటి చెంచయ్య, రాఘవ, చంటి, రమణారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకాలు



సామూహిక రుద్ర పూజలు చేస్తున్నవేదపండితులు

గిద్దలూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు ఆధ్యాత్మికంగా, ఆరోగ్యంగా పాడిపంటలతో ఉండాలనే సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు స్వామి ఆనంద్, వేదపండితులు శరత్, చంద్రశేఖరశర్మ అన్నారు. ప్రజల ఆర్థిక సహాయంతో సామూహిక రుద్రపూజలను నిర్వహించారు. యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఏటా గ్రామాలలో సామూహిక రుద్రపూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యోగా టీచర్స్ పాలుగుళ్ల పురుషోత్తంరెడ్డి, బి.నరేష్, వేణుగోపాలస్వామి దేవస్థాన చైర్మన్ చల్లా నరసింహులు, పాలేరు రమణరెడ్డి, మండ్ల శ్రీనివాసులు, డాక్టర్ శివారెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెంలో రామలింగేశ్వరస్వామికి మంగళవారం భక్తులు రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గోళ్ల సుబ్రమణ్యం, అర్చకులు మృత్యుంజయ శాస్త్రి పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తితో కార్తీకపౌర్ణమి జరుపుకోవాలి

పొదిలి : ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమిని జరుపుకోవాలని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక పార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామి ఆలయంలో బుధవారం జరిగే కార్తీక పౌర్ణమి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ భక్తు లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సీఐ రాజేష్ కుమార్, ఎస్ఐ వేమన ఉన్నారు.

7న అరుణాచలానికి బస్సు

గిద్దలూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని అరుణాచల పుణ్యక్షేత్రానికి ఈనెల 7వ తేదీన ఆర్టీసీ బస్సును నడపనున్నట్లు డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 7వ తేదీ రాత్రి 8గంటలకు గిద్దలూరు నుంచి బస్సు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం గిరిప్రదర్శణ చేసుకుని 9వ తేదీ ఆదివారం రాత్రికి బస్సు గిద్దలూరుకు చేరుకుంటుందని తెలిపారు. ఒక్కొక్కరికీ రూ.2500 టికెట్ అని తెలిపారు. ఆసక్తి గల వారు 7382889095, 9959225745 సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న వరలక్ష్మి

విద్యతోనే చెంచు గిరిజనుల అభివృద్ధి

పెద్ద దోర్నాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : విద్యతోనే చెంచు గిరిజనుల అభివృద్ధి సాధ్యమని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి అన్నారు. ఎస్టీ చెంచు కాలనీలో జన్ జాతీయ గౌరవ్ దివాస్‌లో భాగంగా మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనులకు అందిస్తున్న పథకాలను వినియోగించుకొని లబ్ధి పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం సహాయ గిరిజన సంక్షేమ శాఖాధికారి వెంకటేశ్వర్లు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, కనకయ్య, రవీంద్ర, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలపై చెంచులకు అవగాహన

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు తెలుసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అసిస్ట్ ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. మండలలోని వెంకటాద్రిపాలెంలో చెంచు కుటుంబాలతో మంగళవారం సమావేశం నిర్వహించి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ బీ కామ్లానాయక్, బాలలక్ష్మీబాయి, వెంకటేశం, లక్ష్మీబాయి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొమరోలు మండలంలో ఆర్‌డీఎస్‌ఎస్ పనులు చేస్తున్న క్రమంలో పలు గ్రామాలలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. మండలంలోని మల్లారెడ్డిపల్లె, ఎర్రపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాలలో బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నామని తెలిపారు.

జనగణనపై శిక్షణ

పొదిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పైలట్ జనగననపై మూడురోజులపాటు సచివాలయ సిబ్బందికి జరగనున్న శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. మంగళవారం మండల బాలుర ఉన్నత పాఠశాల అవరణలో ప్రారంభమైన శిక్షణ కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. జనగణన కింద నాలుగు మండలాలను కేటాయించినట్లు తెలిపారు. వాటిలో మొదటిగా పొదిలి నగరపంచాయతీని ఎంపిక చేశారన్నారు. జనగణన 7వార్డుల్లో ఈనెల 10 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. సచివాలయ సిబ్బంది ఎలాంటి తప్పులు లేకుండా సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంవీ క్రిష్ణారెడ్డి, నగరపంచాయతీ కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి, ఉపవిద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు నివాళి

కొమరోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తాపురం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ హవల్దార్ బొంత భూతేశ్వరుడు అంత్యక్రియలు మంగళవారం ఘనంగా జరిగాయి. బొంతా భూతేశ్వరుడు రాజస్థాన్‌లోని ఆర్మీలో హవల్దార్‌గా పనిచేస్తున్నారు. జనవరికి అతను పదవీ విరమణ చేయనుండగా అంతలోనే గుండె సంబంధిత వ్యాధితో ఈనెల 1న మృతి చెందారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న కొమరోలు ఎస్సై నాగరాజు ముక్తాపురంలో భూతేశ్వరుడు పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు.

స్వదేశీ వస్తువులనే వాడాలి

గిద్దలూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు భారతీయ సంస్కృతి, సాంప్రదాయ ఉత్పత్తులను వినియోగించాలని కోరుతూ భారతీయ జనతాపార్టీ నాయకులు మంగళవారం మండలంలోని ముండ్లపాడు గ్రామంలో కరపత్రాలను పంపిణీ చేశారు. స్వదేశీ ముద్దు, విదేశీ వద్దు నినాదంతో భారతీయ ఉత్పత్తులను వినియోగించాలని, విదేశీ వస్తువులను నిషేధించాలని బీజేపీ నాయకుడు మట్టిమల్ల పుల్లయ్య అన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ప్రవీన్‌గౌడ్, వీరచక్రం, బాలకోటిరెడ్డి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తులకు అన్ని వసతులు కల్పించాలి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని భైరవకోన పుణ్యక్షేత్రానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం భక్తులు అధికసంఖ్యలో వస్తారని దేవదాయ, ధర్మాదాయ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు పేర్కొన్నారు. శ్రీదుర్గాంబ పంచముఖ అమ్మవారిని దర్శించుకొనేందుకు వస్తున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణతో కలిసి భైరవకోన క్షేత్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జలపాతాన్ని తిలకించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం. వెంకటేశ్వర నాయక్, ఈవో డి.వంశీకృష్ణారెడ్డి, దేవస్థాన చైర్మన్ శ్యామ్ సుందరరాజు, మాజీ చైర్మన్ జీవీ రామరాజు, సింగిల్‌విండో చైర్మన్ సీహెచ్ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

కురిచేడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దర్శిలో ఈనెల 8న జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం మండల గౌరవాధ్యక్షుడు సందు వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా మంగళవారం మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని కురిచేడు పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కేవీ పిచ్చయ్య, అశోక్, జార్జి, గండి శ్రీను, చిట్టెమ్మ, మరియమ్మ, చంద్రకళ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మారెళ్ళ, ఈదర పంచాయతీలకు ఇన్‌చార్జ్ కార్యదర్శుల నియామకం

ముండ్లమూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ, ఈదర పంచాయతీ కార్యదర్శులు ఎన్.రాధాకృష్ణమూర్తి, జె.శ్రీనివాసరావులు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతితో బదిలీపై వెళ్లారు. వారి స్థానాల్లో మారెళ్ళకు ముండ్లమూరు కార్యదర్శిగా పనిచేస్తున్న పరమేశ్వరి, ఈదరకు బొప్పూడివారిపాలెం కార్యదర్శిగా పనిచేస్తున్న వల్లభనేని ఏడుకొండలను ఇన్‌చార్జ్ కార్యదర్శులుగా నియమించినట్టు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు.

రేపు టీడీపీ కార్యాలయం ప్రారంభం

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురంలో గురువారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు బొబ్బూరి రాజేష్ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి

పామూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు అన్నారు. మండలంలోని కంభాలదిన్నెలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మన్నం రమణయ్య అధ్యక్షతన మంగళవారం కేఎస్‌ఎస్ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల్లో మొదటి ప్రాధాన్యత కేఎస్‌ఎస్ సభ్యులకు ఉంటుందని, వారికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. సమావేశంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, గోళ్ల భాస్కరరావు, జి. కొండయ్య, వీరబాబు, ఓ.సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సుల తనిఖీ

పామూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాల బస్సులను కండిషన్‌లో ఉండాలని ఏఎస్‌ఐ షేక్ జిలానిబాషా పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రయివేట్ పాఠశాలలకు చెందిన బస్సులను తనిఖీ చేశారు. బస్సులకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉండాలన్నారు.

ఇంటింటికీ స్వదేశీ పత్రాలు పంపిణీ

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ మండల ప్రవాస యోజన భాగంగా ఇంటింటికి స్వదేశీ నినాదం పేరుతో సిక్కర్లు అతికిస్తున్నట్లు ప్రవాస యోజన ప్రముఖ్ కేవీ రమణయ్య తెలిపారు. సీఎస్‌పురంలో జిల్లా కార్యవర్గసభ్యుడు వెంకట సత్యంతో కలిసి వివిధవ్యాపార సంస్థల వద్ద స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో సాదు వెంకటేశ్వర్లు, పి.వెంకట రమణారెడ్డి, పి.చెన్నయ్య, బత్తుల రమేష్, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు వద్ద రెడీమిక్స్ లోడుతో వస్తున్న టిప్పర్ ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి బోల్తా పడింది. మండలంలో జరుగుతున్న జాతీయ రహదారి రోడ్డు పనులకు తారును సరఫరాచేసే టిప్పర్ ఉలవపాడుకు వస్తున్న క్రమంలో ఎదురుగా కారు వచ్చింది. కారును తప్పించే క్రమంలో టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ క్షేమంగా బయటపడ్డారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

పీసీపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి ఎస్.రంగాక్రిష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని వెంగళాయపల్లి, కోదండరామపురం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి ఈ-పంట నమోదు చేయించుకునేందుకు ఈనెల 8వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

సమన్వయంతో అధికారులు పనిచేయాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేసి కనిగిరి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గస్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని సూచించారు. ప్రజలు నుంచి వచ్చే వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. కనిగిరి ప్రాంతం క్షామపీడిత ప్రాంతంగా ఉండటంతో వర్షాలు పడినప్పుడు మాత్రమే పంటలకు అనువుగా ఉంటుందన్నారు. ఈక్రమంలో వర్షపు నీటిని వృథాగా పోకుండా చెరువులు, అలుగులు లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విశ్వనాథరెడ్డి, పీఆర్ డీఈ శ్రీధర్‌రెడ్డి, హౌసింగ్ డీఈ కోటిరెడ్డి, ఇరిగేషన్ డీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఎంఈవోలు నారాయణరెడ్డి, దేవిరెడ్డి రామిరెడ్డి, తహసీల్దార్ జయలక్ష్మి, ఆర్‌అండ్‌బీ డీఈ సంజీవ్‌కుమార్, విద్యుత్ డీఈ ఉమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

యుద్ధప్రాతిపదికన గండి పూడ్చివేత

దర్శి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువకు పడిన గండిని అధికారులు యుద్ధప్రాతిపదికన పూడ్చి వేయించారు. జిల్లాకు మంగళవారం సాగునీరు విడుదల చేశారు. దీంతో రైతుల్లో నెలకొన్న ఆందోళన తొలగింది. సాగర్ ప్రధాన కాలువకు 154వ కిలోమీటర్ వద్ద నాలుగు రోజుల క్రితం గండి పడిన విషయం తెలిసిందే. ఎగువ ప్రాంతాల్లో ఉన్న కొండల నుంచి భారీ వర్షాలకు అధికనీరు రావటంతో కాలువ కట్ట కోసుకుపోయింది. భారీ వర్షాలతో సాగర్ ప్రధాన కాలువకు నీటి సరఫరా నిలిపివేశారు. ఇప్పటివరకు సాగునీటి అవసరం లేకపోయినప్పటికీ కాలువ కట్ట తెగి నీరు నిలిచిందని తెలిసిన రైతులు సాగునీరు ఎప్పుడు వస్తుందోనని ఆందోళన చెందుతున్నా రు. ఎన్ఎస్‌పీ అధికారులు తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయటంతో త్వరగా నీటి విడుదలచేసే అవకాశం లభించింది. ప్రస్తుతం సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు(ప్రకాశం బార్డర్)కు 1200 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. క్రమేపి నీటి పరిమాణాన్ని పెంచటం జరుగుతుందని ఎన్ఎస్‌పీ ఈఈ విజయలక్ష్మి, డీఈ పూర్ణచంద్ తెలిపారు. ఆయకట్టు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అన్నీ ప్రాంతాలకు బుధవారం నుంచి సాగునీరందుతుందని వివరించారు.



సాగర్ కాలువకు పడిన గండిని పూడ్చిన దృశ్యం

దొనకొండ స్టేషన్‌లోని సమస్యలను పరిష్కరిస్తాం

» రైల్వేబోర్డు మెంబర్ శిద్దా సూర్యకుమారి

దొనకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దొనకొండ రైల్వేస్టేషన్‌లోని సమస్యలను ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామని రైల్వే బోర్డు మెంబర్ శిద్దా సూర్యకుమారి హామీ ఇచ్చారు. మంగళవారం దొనకొండ రైల్వేస్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా రైల్వేస్టేషన్‌లో 2, 3 ప్లాట్‌ఫారమ్స్‌లో మంచినీటి సమస్య, టాయిలెట్స్ లేకపోవటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్టు పలువురు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ధర్మవరం, షిరిడిసాయి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ వచ్చే నెలలో ఢిల్లీలో జరిగే సమావేశంలో సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్లాట్‌ఫారంపై స్టాల్స్ ఏర్పాటు చేసుకునేవారు తమ దృష్టికి తెస్తే స్టాల్స్ మంజూరుకు చర్యలు చేపడతానన్నారు. రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ పథకంలో భాగంగా అభివృద్ధి పనులు ఏళ్ల తరబడి నత్తనడకన జరుగుతున్నాయని ఆమె దృష్టికి తీసుకెళ్లగా, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డితో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈసందర్భంగా భారత ప్రభుత్వం శిద్దా సూర్యకుమారితో రూపొందించిన స్టాంప్‌ను చూపించగా ప్రజలు అభినందించారు.

కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు రొడ్డా వెంకటరామయ్య, పోతురాజు వెంకటరామయ్య, బత్తుల శ్రీను, రిటైర్డ్ రైల్వే పింఛనర్స్ అసోసియేషన్ నాయకుడు బి.జయరాజ్, మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు కాళ్ల హనుమంతు, మాడిశెట్టి రమేష్, పరుచూరి రామలింగయ్య, షేక్ గఫూర్, బచ్చు చలపతి, తదితరులు పాల్గొన్నారు.



భారత ప్రభుత్వం రూపొందించిన స్టాంప్‌ను చూపుతున్న రైల్వేబోర్డు మెంబర్ శిద్దా సూర్యకుమారి

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

తాళ్లూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తప్పుడు కేసులు నమోదుచేస్తూ అకారణంగా దూషిస్తున్న ఎస్.మల్లికార్జునరావుపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు అపపర్తి ఆదాంమాదిగ్ డిమాండ్ చేశారు. దళితుల పట్ల ఎస్‌ఐ అనుచిత వైఖరిని నిరసిస్తూ మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ శివరాంపురం గ్రామంలో రెండు రోజుల కిత్రం వివాహ వేడుకల్లో కొందరు యువకులు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించగా ఉన్నతాధికారుల ఆదేశంతో కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఆవేడుకలకు తాళ్లూరు దళిత వాడకు చెందిన డీజే బాక్స్‌లు అద్దెకు ఇచ్చే అనపర్తి విజయ్ కుమార్(బాబు) వాటిని ఏర్పాటుచేశారన్నారు. పొట్ట కూటికోసం వెళ్లిన వారిపై కేసు నమోదు చేయటమేకాక స్టేషన్‌కు పిలిపించి దూషించారన్నారు. డీజే తీసుకెళ్లిన కూలీని కొట్టారని తెలిపారు. ఈవిషయమై మాట్లాడేందుకు వెళ్లినవారిని దూషిస్తూ బయటకు పంపడం ఎంత వరకు సమంజసమన్నారు. ఆదాం మాదిగ మాట్లాడుతూ వివాహ వేడుకల్లో డీజే ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌ను వదిలేసి బతుకుదెరువుకు డీజే తీసుకెళ్లిన ఆటోను కేసులో పెట్టారన్నారు. డీజే తీసుకెళ్లిన కూలీని స్టేషన్‌కి పిలిపించి ఎస్‌ఐ కొట్టినట్టు చెప్పారు. దళితులపట్ల అనుచితంగా వ్యవహరించిన ఎస్‌ఐపై తగు చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత నేతలు గర్నెపూడి యోహాన్, విజయ్‌కుమార్, అనపర్తి సత్యవర్ధన్ రావు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దళితులు

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

తాళ్లూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ఎంఈవో జి.సుబ్బయ్య అన్నారు. మంగళవారం తూర్పుగంగవరం జడ్పీ హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు మంగళవారం జరిగాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకుడు సుబ్రమణ్యం, హెచ్‌ఎం వైఎస్‌ఆర్‌కే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులో పెదయిర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. 8వ తరగతి చదువుతున్న కె.కౌశిక్‌చౌదరి, 9వ తరగతి చదువుతున్న కె.బిందు, 10 తరగతి చదువుతున్న బి.అఖిలాండేశ్వరిలు మంచి ప్రతిభతో రాణించారు.

పామూరు: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన విధానం పెంపొందించేందుకే చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ టి.చెన్నకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను ఎంఈవో పి.కోటిరెడ్డి మంగళవారం విడుదల చేశారు. ఈ టాలెంట్ టెస్ట్‌కు 15 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వి.మాలకొండారెడ్డి, సురేంద్ర, కె.శంకర్, అబ్దుల్‌ఖాదర్, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా సీఎస్‌పురం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.

రికవరీ ఏజెంట్లు నిబంధనలు పాటించాలి

దర్శి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రికవరీ ఏజెంట్లు, ఆధార్ అనేబుల్ పేమెంట్స్ నిర్వాహకులు ఆర్థిక లావాదేవీల విషయంలో నిబంధనలు పాటించాలని డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం స్థానిక పీజీఎస్ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది నిర్వాహకులు నగదు రికవరీల్లో హడావుడి చేసి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. కొంతమంది ఆధార్ అనేబుల్ పేమెంట్స్ సెంటర్స్ నిర్వాహ కులతో ఆర్థిక లావాదేవీల్లో తేడాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ వై.రామారావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మోపాడు ఆధునికీకరణ పనులను నాణ్యతగా చేపట్టాలి

పామూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మోపాడు రిజర్వాయర్ ఆధునికీ కరణ పనులను నాణ్యతగా చేపట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు అన్నారు. మండలంలోని మోపాడు రిజర్వాయర్‌ను రైతు సంఘం సభ్యులతో కలిసి మంగళవారం పరిశీలించారు. తుఫాన్ ప్రభావం తో కురిసిన వర్షాలకు రిజర్వాయర్‌లో 17 అడుగులకు నీటిమట్టం చేరింద న్నారు. ఈసమయంలో మరమ్మతు పనులు చేయడంవల్ల ఆయకట్టు దారులు పైర్లు వేసుకోవడానికి ఆటంకంగా ఉంటుందన్నారు. ఈసందర్భం గా వారు రిజర్వాయర్ కాలువల రివిట్‌మెంట్, చెట్లు తొలగింపు, కట్టమీద గోడ నిర్మాణ మరమ్మతు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో నీటి సంఘం చైర్మన్ చుంచు కొండయ్య, రైతుసంఘం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, మద్దిశెట్టి ప్రసాదు, కె.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కనిగిరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. పట్టణంలోని పామూరు బస్టాండు, నక్కలతిప్ప ప్రాంతంలో, కందుకూరు రోడ్డులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను మారుస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. దీంతో కందుకూరు రోడ్డు, చెప్పుల బజార్, నక్కలతిప్ప, గార్లపేటరోడ్డు, డాక్టర్ రామయ్యనాయుడు ఆసుపత్రి, ఇందిరాకాలనీ, ఎన్జీవో కాలనీ, సాయిబాబా గుడి వీధి రోడ్డు, మందిరం బజార్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రకృతి సాగుతో ప్రయోజనం

తాళ్లూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సాగుతో ప్రయోజనం కలుగుతుందని దర్శి ఏడీఏ బాలాజీ నాయక్ తెలిపారు. మండలంలోని నాగంబొట్లపాలెం, రామభద్రాపురం, తూర్పుగంగవరం గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి, ప్రకృతి సాగు ఇన్‌చార్జ్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మకాలు చేస్తే కఠినచర్యలు

కనిగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మకాలుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు అమ్మే షాపులపై మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈతనిఖీల్లో 20కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని రూ.10 వేలు జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులు పొందాలి

ముండ్లమూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలు రైతు లందరూ సంబంధిత వీఆర్‌వోలను కలసి గుర్తింపు కార్డులు పొందాలని మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు అన్నారు. మంగళవారం మండలంలోని పులిపాడు, పెదఉల్లగల్లు గ్రామాల్లో జరిగిన పొలం పిలు స్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పంట నమోదుకు ఈనెల 8 ఆఖరు తేది అని తెలిపారు. ఈఅవకాశాన్ని రైతులందరూ సద్వినియో గం చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కోసం పొలంను ఆధార్ లింకు చేసుకొని బ్యాంక్ ఖాతాకు లింకు చేయాలన్నారు. రైతులు విచ్చల విడిగా పురుగు మందులు వాడవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు విజయనిర్మల, కాంతిరత్న తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పీసీపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు మండలంలోని పెదఅలవలపాడు గ్రామం వద్ద ఎస్‌ఐ జి.కోటయ్య ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. లారీలు, బస్సులు, ట్రాక్టర్‌లు తదితర వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇతర పత్రాలు లేకపోయినా, నిబంధనలు పాటించకపోయినా జరిమానా వేయడంతో పాటు కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్స్ అన్ని తమ దగ్గర ఉండుకోవాలని డ్రైవర్‌లకు సూచించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

హెచ్‌ఎంపాడు(కనిగిరి), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అపరాల పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని హెచ్‌ఎంపాడు మండల ఏవో వన మా రవికుమార్ అన్నారు. హెచ్‌ఎంపాడు మండల కేంద్రంతో పాటు ఆవు లవారిపల్లి గ్రామంలో మంగళవారం వ్యవసాయ పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు అపరాల పంట పసుపురంగు లోకి మారి మొక్క చనిపోయే అవకాశం ఉందన్నారు. మొక్క చనిపోకుండా ఉండేందుకు లీటరు నీటికి ప ది గ్రాముల 19:19:19 లేదా పదిగ్రాముల పోటాషియం నైట్రేట్ (13-0-45) తో పాటు మూడుగ్రాముల అన్నభేది, అర గ్రాము నిమ్మ ఉప్పు చొప్పున కలిపి మొక్కలపై పిచికారి చేయాలన్నారు. అధిక వర్షాలతో కలుపు తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు అంతర కృషిచేసి కలుపును నివారించుకోవాలన్నారు.



పూలతో అలంకరించిన రాతి గృహలు

భైరవకోనలో ప్రత్యేక ఏర్పాట్లు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక శైవక్షేత్రమైన భైరవకోన క్షేత్రానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం వచ్చే భక్తుల కోసం దేవదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లుచేస్తున్నారు. శ్రీత్రిముఖ దుర్గాంబ అమ్మవారి దేవస్థానాన్ని సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దారు. కొండ గృహల్లో ఉన్న దేవతల గుడులను రంగురంగుల విద్యుత్ దీపాలతో, పూల మాలలో అలంకరించారు. ఆలయం ముందు ఉన్న కొలనులో నుంచి చంద్రని కిరణాలు త్రిముఖ దుర్గాదేవి ముఖ వర్చస్సు తేజో వంతమై పర్యాటకులకు, కనువిందు చేసేందుకు ఈవో వంశీకృష్ణారెడ్డి, చైర్మన్ శ్యాంసుందరరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లుచేస్తున్నారు.

పామూరు: కార్తీకపౌర్ణమి సందర్భంగా బుధవారం శివాలయంను సందర్శించే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసి నట్లు దేవస్థాన ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. పట్టణంలోని చారిత్రాత్మక పాధాన్యతగల శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించేందు కు, దీపాలను నీళ్లలో వదిలేందుకు కావలసిన విద్యుత్ సౌకర్యం ఏర్పాట్లు చేయించినట్లు తెలిపారు. దేవస్థానంలో దైవదర్శనం కోసం భక్తులకు ఎలాం టి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక బారిగేడ్లను ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో దొనకొండ విద్యార్థిని ప్రతిభ

దొనకొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇటీవల జిల్లాస్థాయిలో అన్నీ పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో దొనకొండ విశ్వభారతి పాఠశాలకు చెందిన విద్యార్థిని జిల్లాలో రెండవస్థానం సాధించిందని పాఠశాల చైర్మన్ మల్లెల రామిరెడ్డి తెలిపారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విశ్వభారతి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వల్లపునేని అను జిల్లాస్థాయిలో రెండవ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈమేర కు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మంగళవారం సర్టిఫికెట్ అందజేసి అభినందించినట్లు తెలిపారు.



దొనకొండ విద్యార్థినీ అనూకు సర్టిఫికెట్ అందజేస్తున్న జిల్లా ఎస్‌పీ హర్షవర్ధన్‌రాజు

మోటారు లేకుండానే బోరు నుంచి నీరు

తాళ్లూరు, నవంబరు 4(ఆంధ్ర జ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు భూగర్భజలాలు పెరిగాయి. ఈక్రమంలో కొత్తపాలెంకు చెందిన మారం వెంకటరెడ్డి పొలంలో మోటార్ లేకుండానే బోరునుంచి నీరు పెల్లుబికింది. ఇటీవల కురిసిన వర్షాలకు భూమిలో నీరు అధికంగా చేరి బోర్ల లో నీటి మట్టం పెరిగింది. దీంతో మోటారు లేకుండానే బోరు నుంచి నీరు వస్తుంది.



మోటార్ లేకుండా బోరునుంచి వస్తున్న నీరు

డివిజన్ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పీసీపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కనిగిరి డివిజన్ స్థాయిలో జరగనున్న ఖోఖో, కబడ్డీ పోటీలకు అండర్14, అండర్17 విభాగాల్లో పెదయిర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 11మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు షెక్ అబ్దుల్ సుభాన్ తెలిపారు.

సోమవారం కంచర్లవారిపల్లి జడ్పీ ఉ న్నత పాఠశా లలో ఎంపిక కోసం జరిగిన పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. పోటీలకు ఎంపికైన వి ద్యార్థులను ఉపాధ్యాయులు అభినం దించారు.





మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి పడమర బాపట్లలో నీటమునిగిన దోస పైరు

మళ్లీ వర్షం!

- బాపట్లలో కుండపోత వాన
- తీవ్ర ఆందోళనలో రైతులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ దాదాపుగా పంటలను ఊడ్చేసింది. తుఫాన్ తీరం దాటి ఆరు రోజులు గడుస్తున్నా ఇంకా పొలాలు చెరువులనే తలపిస్తున్నాయి. పంట చేలల్లో నిలబడిన నీళ్లను బయటకు పంపించడానికి అన్నదాతలు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇంజన్ల ద్వారా, పొలాల గట్లకు గండి కొట్టి నీటిని బయటకు పంపుతున్నారు. ఇప్పుడిప్పుడే నీళ్ల తగ్గి కొంచెం పంటలు తేలి కనబడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓ వైపు వాతావరణ శాఖ అల్పపీడన హెచ్చరికలు రైతులను కలవరపెడుతుంటే.. మంగళవారం సాయంత్రం బాపట్లలో గంటన్నర పాటు కురిసిన భారీ వర్షం వారిని తీవ్ర ఆందోళనకు గురిచేసింది. చీరాలలో చిరు జల్లులు కురవగా, జిల్లా వ్యాప్తంగా మేఘావృతమైంది. జిల్లా వ్యాప్తంగా ముంపు బారిన వరి పంట విస్తీర్ణమే 68 వేల ఎకరాలుగా వ్యవసాయశాఖ లెక్కతేల్చింది. వరి కంకులు నీళ్లలో రోజులు తరబడి ఉండడంతో.. తాలు ఎక్కువగా వచ్చి దిగుబడుల్లో భారీ కోత తప్పదనే అభిప్రాయం రైతులు వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల పంట మొత్తం నేలవాలి నీళ్లలోనే ఉండిపోవడంతో కుళ్లిపోయే స్థితికి చేరుకుందని వాపోతున్నారు. కూరగాయల పైర్లు కూడా నీటము నగడంతో పెట్టుబడి మొత్తం వర్షార్పణమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకోసారి పంట పొలాలు ముంపు బారిన పడితే ఇక పూర్తిగా దిగుబడులపై ఆశలు వదిలేసుకోవడమేనని అన్నదాతలు చెబుతున్నారు.

సముద్ర స్నానాలు నిషేధం

బాపట్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తిక మాసం పౌర్ణమి రోజు బుధవారం సూర్యలంక సముద్ర తీరంలో భక్తుల పుణ్య స్నానాల ఆచరణకు బ్రేక్ పడింది. సూర్యలంకతో పాటు పాండురంగాపురం, రామచంద్రాపురం, వాడరేవు, రామాపురం బీచ్‌ల్లో సముద్ర స్నానాలను అధికారులు పూర్తిగా నిషేధించారు. కార్తిక పౌర్ణమికి సూర్యలంకలో సముద్ర స్నానానికి భక్తులను అనుమతించాలని ముందుగా అధికా రులు భావించి.. అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. అయితే వాతావరణం అనుకూలించక పోవడం.. మంగళవారం భారీ వర్షం కురవడంతో.. కార్తిక పౌర్ణమి రోజు కూడా భక్తులకు, పర్యాటకులకు ప్రవేశం లేదని ఆర్డీవో పి. గ్లోరియా ప్రకటన విడుదల చేశారు. మళ్లీ తీరానికి అనుమతి ఎప్పటి నుంచి అనేది ప్రకటించే వరకు సూర్యలంక తీరానికి రాకూడదని ప్రకటించారు. ఏ ఒక్కర్నీ సముద్రం వైపు రాకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. మొంథా తుఫాన్ ప్రభావంతో గత నెల 22న నుంచి బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరానికి పర్యాటకుల ప్రవేశాన్ని అధికారులు నిలిపివేశారు. తుఫాన్ కారణంగా సముద్రంలో అనేకచోట్ల గుంతలు ఏర్పడటంతో.. ప్రమాదాలు పొంచి ఉన్నాయని గ్రహించిన అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. సూర్యలంక ప్రధాన రహదారికి అడ్డుగా బారికేడ్‌లు ఏర్పాటు చేసి రాకపోకలను పూర్తిగా నిషేధించారు. కార్తిక మాసం రెండో సోమవారం సూర్యలకలో ప్రవేశం ఉంటుందని భక్తులు భావించారు. పోలీసు, రెవెన్యూ అధికారులు ముందుగా ఈ నెల 4వ తేదీ వరకు అనుమతి లేదని ప్రకటించారు. ఇప్పుడు పౌర్ణమి రోజు కూడా రాకపోకలకు పూర్తిగా నిషేధం విధించారు.

కొనుగోళ్లు.. కంటితుడుపే

బర్లీ పొగాకు రైతులకు అన్యాయం జరగదు.. చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తాం.. అని ఒకవైపు ప్రభుత్వం చెబుతోంది. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి విరుద్ధంగా ఉంటున్నాయని రైతులు వాపోతున్నారు. బర్లీ రైతులను గట్టెక్కించాలని ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించగా.. నెలల తరబడి కొనుగోళ్ల ప్రక్రియను సాగదీస్తోంది. ఇప్పటికి రెండు విడతలుగా గడువు పొడిగించినా కొనుగోళ్ల ప్రక్రియ కంటితుడుపుగానే సాగుతోంది. దీంతో పొగాకు దిగుబడులను అటు నిల్వ చేసుకోలేక.. ఇటు ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలియక రైతులు అల్లాడుతున్నారు. ఇదే సమయంలో ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు బర్లీ రైతులను ముంచేశాయి. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు సంబంధించి మూడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా.. కొనుగోళ్లకు సంబంధించి మార్క్‌ఫెడ్ దాగుడుమూతలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొగాకుపై మార్క్‌ఫెడ్ దాగుడు మూతలు

- గడువు పెంపుతో సరి.. కొనుగోళ్లు నామమాత్రం
- మొంథా తుఫాన్‌తో బర్లీ రైతు మరింతగా కుదేలు
- 20,000 క్వింటాళ్లకు అనుమతివ్వాలని తాజాగా ప్రతిపాదనలు



పర్చూరు : ఉప్పుటూరులో తడిచిన పొగాకును ఆరబెడుతున్న రైతులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జూన్ చివరి వారంలో బర్లీ కొనుగోళ్లను చేపట్టిన మార్క్‌ఫెడ్, సెప్టెంబరు చివరి వరకు సేకరణ జరుపుతామని తొలుత ప్రకటించింది. ఆ గడువు ముగిసే నాటికి గుంటూరు,బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలో 2,08,510 క్వింటాళ్ల బర్లీని కొనుగోలు చేసినట్లు అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. రైతుల (మిగతా 6వ పేజీలో)

50 వేల క్వింటాళ్లకు 9 వేలు

నాలుగు జిల్లాల పరిధిలోని రైతుల దగ్గర బర్లీ నిల్వలు ఇంకా 50,000 క్వింటాళ్ల వరకు ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. రెండు దఫాలుగా గడువు పొడిగించిన సమయంలో 25,000 క్వింటాళ్ల కొనుగోళ్ల జరపాల్సి ఉంది. అయితే గడవు ముగిసేప్పటికి 9,000 క్వింటాళ్లతోనే సరిపెట్టింది. అయితే షెడ్యూల్ ఇచ్చినా రాకపోవడం వల్లే కొనుగోళ్ల అంతగా జరగలేదని మార్క్‌ఫెడ్ ప్రకటనపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా!

- డ్రైవర్ మృతి, గుండెపోటే కారణం?



రాంబాబు(ఫైల్)

వేమూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వేమూరులో మంగళవారం మధ్యాహ్నం గ్యాస్ సిలిండర్ల లారీ అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో ఉన్న కాల్వలో పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. విజయవాడ అర్బన్ పరిధిలోని అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన డ్రైవర్ శాఖమూరి రాంబాబు (54) రేపల్లె నుంచి ఖాళీ సిలిండర్ల లారీని విజయవాడకు తీసుకెళ్తున్నాడు. వేమూరు - దర్మాపురం మధ్య వాటర్ ట్యాంకు దాటిన తర్వాత లారీని డ్రైవర్ రోడ్డు పక్కకు పెట్టేందుకు ప్రయత్నిస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు భావిస్తున్నారు. రాంబాబు స్టీరింగ్ పట్టుకుని అదేస్థానంలో మృతి చెందాడు. అతని మృతదేహాన్ని స్థానికులు బయటకు తీశారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ శ్రీనివాసరావు స్పందిస్తూ.. డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో లారీని పక్కకు తీసే సందర్భంలో అదుపు తప్పి పడిపోవడం జరిగిందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంగా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు.

ఒప్పందం లేకుండానే ప్రోత్సాహం



జార్లపాలెం వద్ద సాగు చేసిన వైట్‌బర్లీ పొగాకు

- రైతుల వెంట పడుతున్న కంపెనీల ప్రతినిధులు
- వైట్ బర్లీ సాగుకు చర్చలు

అద్దంకి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు సాగు చేసిన రైతులను గతేడాది ఆయా కంపెనీలు నిండా ముంచాయి. సాగు సమయంలో ప్రోత్సహించి కొనుగోలు సమయానికి చేతులెత్తేశాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆయా కంపెనీల ప్రతినిధులతో పలు దఫాలు చర్చలు జరిపినా ఏమాత్రం కనికరించ లేదు. వైట్ బర్లీ పొగాకును మా త్రం కొన్ని కంపెనీలు కొంత మేర, మరికొన్ని మొక్కుబడిగా కొనుగోలు చేశాయి. ఇక బ్లాక్ బర్లీ పొగాకు రైతుల వద్దనే నిల్వ ఉండి పోయింది. కూటమి ప్రభుత్వమే పంట కొనుగోలు చేసి నిల్వ చేసింది. ఈ ఏడాది బర్లీ పొగాకు సాగు చేయవద్దని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది. ఒక వేళ వైట్ బర్లీ పొగాకు సాగు చేసే పక్షంలో ఆయా కంపెనీల నుంచి ముందస్తుగానే ఒప్పంద పత్రాలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ప్రకటించింది. కానీ, ప్రస్తుతం పలు కంపెనీల ప్రతినిధులు ఆయా గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి.. వైట్ బర్లీ పొగాకు సాగు చేయాలని రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే పలువురు రైతులతో వైట్ బర్లీ నారు మళ్లు కూడా పోయించారు. వర్షాలకు పలు చోట్ల పంట సాగు చేసిన పొలాలు, నారుమళ్లు దెబ్బతినడంతో మళ్లీ సాగు చేయాలని కోరుతున్నారు. అయితే రైతులను ప్రోత్సహిస్తున్న ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంకా ఒప్పంద పత్రాలు ఇవ్వకుండానే ఊరిస్తున్నట్లు తెలుస్తుంది. అదును దాటిపోతుండటంతో కొందరు రైతులు ధైర్యం చేసి సాగు చేస్తుండగా, మరికొందరు వేచిచూసే ధోరణితో ఉన్నారు. ఈ విషయమై మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటకృష్ణను వివరణ కోరగా వైట్ బర్లీ సాగు విషయంలో కంపెనీలు ఒప్పంద ప త్రాలు ఇచ్చిన తర్వాతే మాత్రమే సాగు చేసుకోవాలని రైతులకు ఇప్పటికే చెప్పామని వెల్లడించారు.

- కొలిక్కిరాని 'మన బడి మన భవిష్యత్' నిర్మాణాలు
- 18 నెలలుగా పాఠశాలల్లో ఎక్కడి నిర్మాణాలు అక్కడే
- రూ.400 కోట్ల పనులు పెండింగ్.. వేధిస్తున్న గదుల కొరత

పేరు మార్చారు.. పనులు మరిచారు



చీరాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నాడు నేడు అంటూ పాఠశాలల్లో భవన నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేసింది. కూటమి ప్రభుత్వం నాడు నేడు పేరును 'మన బడి మన భవిష్యత్' అని మార్చింది. అయితే పేరు మార్చిన ప్రభుత్వం 18 నెలలుగా పాఠశాలల్లో పనులను పట్టించుకోలేదు. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని అనేక పాఠశాలల్లో తరగతి గదుల సమస్యతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వరండాల్లో, చెట్ల కింద బోధనలతో ఉపాధ్యాయులు సరిపెడుతున్నారు. వర్షాలు, ఎండల సమయాల్లో వారి ఇబ్బందులు చెప్పనలవికాకుండా ఉంటున్నాయి. అయినా అధికారులు, పాలకులు అసంపూర్తి నిర్మాణాలపై దృష్టి సారించడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు ఎప్పటికి పూర్తి అవుతాయో తరగతి గదులు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో తెలియక ఉపాధ్యాయులు, విద్యార్థులు మదన పడుతున్నారు. నాడు నేడు పేరుతో గత ప్రభుత్వం రెండు దశల్లో రూ.600 కోట్లకుపైగా నిధులు వెచ్చించి పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టింది. ఐదేళ్ల పనులు సక్రమంగా జరగలేదు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా రూ.400 కోట్లకుపైగా నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. దాదాపు 450పైగా ఉన్నత పాఠశాలల్లో 70శాతానికిపైగా నిర్మాణాలు జరిగాయి. అయితే వాటికి ప్రస్తుత ప్రభుత్వం నిధులు (మిగతా 6లో)



ప్రత్యేకంగా అలంకరించిన శ్రీగంగా పర్వతవర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి

వైభవంగా కోటి కుంకుమార్చన

బాపట్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఎస్‌పీ అగ్రహారంలో వేంచేసియున్న గంగా పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం 500 మంది మహిళలతో కోటి కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ఉదయం శత చండీయాగం, మహా రుద్రయాగంలో 363 రుద్ర మంత్రంతో అభిషేకం చేశారు. అనంతరం అవధాన సరస్వతీ డాక్టర్ తాతా సందీప్‌శర్మ ప్రవచనం ఏర్పాటు చేశారు. సాయంత్రం పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచనం జరిగింది. బ్రహ్మశ్రీ తాళ్ళపాక మణికంఠ శివాచార్యస్వామి యాజ్ఞిక పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొల్లిపర ప్రసాద్‌స్వామి, గూడూరు చిట్టిబాబు, సాయివెంకట్, పంగులూరి కౌండిన్య, నెమలికంటి హనుమంతరావు సహకారంతో ధర్మకర్త ఆదూరి హరినారాయణ, వేలాది మంది భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్న సంతర్పణ చేశారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


సత్య సాయిబాబా భక్తులకు శుభవార్త

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భగవన్ శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈస్టుకోస్టు రైల్వే ప్రకటించిన ప్రత్యేక రైళ్లన్నింటికి గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డు స్టేషన్లలో నిలుపుదల సౌకర్యాన్ని కల్పించింది. ఈ మేరకు ఈస్టుకోస్టు రైల్వే చీఫ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ దిబ్యన్‌జన్‌రాయ్ మంగళవారం సమాచారం ఇచ్చారు.

- అరకు - యల్హాంక స్పెషల్స్‌కు నరసరావుపేట, మా ర్కాపురం రోడ్డులో నిలుపుదల కల్పించింది.
- శ్రీకాకుళం రోడ్డు - బెంగుళూరు స్పెషల్స్‌కు గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డులో హాల్టింగ్ ఇచ్చారు.
- భువనేశ్వర్ - బెంగళూరు కం టోన్మెంట్ - బెంగళూరు టీవోడీ స్పెషల్‌కు అనకాపల్లి, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డులో
- సంబల్‌పూర్-బెంగళూరు కంటోన్మెంట్-సంబల్‌పూర్ టీవోడీ స్పెష ల్స్‌కి గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డులో
- కటక్-బెంగళూరు కంటోన్మెంట్ - కటక్ టీవోడీ స్పెషల్స్‌కి అనకాపల్లి, గుంటూరు, నరసరా వుపేట, మార్కాపురం రోడ్డులో నిలుపుదల కల్పించారు.

వాటర్ గ్రిడ్.. వచ్చేనా?

- కొన్నేళ్లుగా ఊరిస్తోన్న ప్రాజెక్టు
- గుంటూరు, బాపట్లకు రూ.7496 కోట్లతో ప్రతిపాదన
- కేంద్రం కనికరిస్తే జిల్లావాసుల నీటి కష్టాలు తప్పినట్లే



వాటర్ గ్రిడ్ నమూనా

బాపట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు తాగేందుకు అను వుగా ఉండటంలేదు.. కాల్వల్లో పారుదలయ్యే నీరు కలుషితమవు తున్నాయి.. ఈ పరిస్థితుల్లో ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు వాటర్‌గ్రిడ్ కేంద్ర ప్రభు త్వం ప్రతిపాదించింది. అయితే గుంటూరు, బాపట్ల జిల్లావాసులకు వాటర్‌గ్రిడ్ మంజూరు కావడంలేదు. ఈ పరిస్థితుల్లో గత కొన్నేళ్లుగా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారుల నోట వింటున్న వాటర్ గ్రిడ్ ప్రతిపాదన మళ్లీ తెర పైకి వచ్చింది. గుంటూరు, బాపట్ల జిల్లాలతో కలి పి గ్రామీణ నీటి సరఫరా విభాగం ప్రతిపాద నలు సిద్ధం చేసింది. నాగార్జునసాగర్ డ్యాం, ప్రకాశం బ్యారేజ్ వద్ద అందుబాటులో ఉన్న ఉపరితల నీటిని పైపులైన్ల ద్వారా గ్రిడ్‌కు తరలించి శుద్ధి చేసి సురక్షితమైన తాగునీటిని గ్రామాలకు సరఫరా చేయడమే ప్రాజెక్టు లక్ష్యం. ఇటీవల సముద్ర జలాలు బాపట్ల, కృష్ణానది తీర ప్రాంతాల్లోని భూముల్లోకి చొచ్చుకు రావడంతో భూగర్భ నీరు ఉప్పుగా మారి తాగేందుకు ఉపయోగపడటం లేదు. ఈ నేపథ్యంలో వాటర్ గ్రిడ్‌ను గుంటూరు, బాపట్ల జిల్లాలోని కొన్ని గ్రామాలను కలిపి ఏర్పాటు చేయాలని అధికా రులు భావిస్తున్నారు. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు తొలిసారి ఈ వాట ర్‌గ్రిడ్ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అయితే ఇది కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో రూ.900 కోట్లు అయితే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తం గా గ్రిడ్ ఏర్పాటు చేయొచ్చని అంచనా వేశారు. ఆ తర్వాత రూ.1600 కోట్లకు గ్రిడ్ అంచనాలు చేరుకున్నాయి. తాజాగా రూ.7496 కోట్లు అవసర మని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. జలజీవన్ మిషన్ లాంటి స్కీమ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులు మం జూరు చేస్తే తప్ప ఈ ప్రతిపాదనలు ముందుకు కదలవు. గుంటూరు, బాపట్ల జిల్లాల మీదగా ప్రవహిస్తున్న కృష్ణా నదిలో వరదలతో నీరంతా కడలి పాలౌతున్నది. ఆ నీటిలో నాలుగైదు శాతం ఒడిసి పట్టినా అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతా లకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయొచ్చు. వేల కోట్ల ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.

కమిటీ నివేదిక ఆధారంగా సమస్యల పరిష్కారం

- మంత్రులతో గ్రానైట్ పరిశ్రమల యజమానుల సమావేశం
- ఎమ్మెల్యేలు ఏలూరి, విజయ్‌కుమార్ హాజరు

మార్టూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమల యజమానుల సమస్యలపై కమిటీ ఏర్పాటు చేసి, వారం రోజుల్లో నివేదికను తమకు పంపించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనాను రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. మంగళవారం వెలగపూడిలోని సచివాలయంలోని చాంబర్‌లో మంత్రులు కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, పర్చూరు, సంతనూతల పాడు ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, బీఎన్ విజయ్‌కుమార్‌తో మార్టూరు, చీమకుర్తి, బూదవాడ, వేమవరం, గురిజేపల్లి గ్రానైట్ పరిశ్రమల అసోసియేషన్ నాయకులు సమావేశమయ్యారు. మార్టూరులో గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఈ సందర్భంగా ప్రస్తావించారు. పలు సమస్యలపై చర్చ జరిగింది. కమిటీ నివేదిక పరిశీలించిన తర్వాత చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర అసోసియేషన్ నాయకులకు తెలిపారు. సమావేశంలో మైనింగ్ డైరెక్టర్ డబ్ల్యూటీ చంద్రశేఖర్, జేడీ శ్రీనివాసరావు, పల్నాడు, బాపట్ల జిల్లాల ఏడీలు పాల్గొన్నారు. అసోసియేషన్ నాయకులు పి.సురేష్, చల్ల గుండ్ల కృష్ణ, పోపూరి శ్రీనివాసరావు, ఇంటూరి ఆంజనేయులు, పుచ్చకాయల సుబ్బరామయ్య, కొర్రపాటి వేణుబాబు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు కొల్లు రవీంద్ర, గొట్టిపాటి, బాలవీరాంజనేయస్వామి తదితరులు

రామకూరులో విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



మహమ్మద్ వలి (ఫైల్)

పంగులూరు,నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన రామకూరులో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహమ్మద్‌వలి నీటి పైపును డాబాపై నుంచి కిందకు వేసే ప్రయత్నంలో పైపు ఇంటి సమీపంలోని విద్యుత్‌లైన్ తీగలపై పడింది. ఆ పైపును పైకి లాగే ప్రయత్నంలో పైపుతో పాటు విద్యుత్‌లైన్‌కు ఉన్న తీగ చేతికి తగలడంతో మహమమద్ వలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే వలి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య జపీనా, జాఫ్రూన్(9), రాధియా, రిఫాత్(7) ముగ్గురు బాలికలు ఉన్నారు. ఎస్‌ఐ వినోద్‌బాబు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

క్రేన్ ఢీకొని భార్య మృతి

భర్త, మరో మహిళకు గాయాలు



రెబికాకుమారి మృతదేహం

అద్దంకి, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : మోటార్‌సైకిల్‌ను వెనుక నుంచి క్రేన్ ఢీకొనటంతో కంకణాల రేబికాకుమారి(30) మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు కథనం మేరకు.. మండలంలోని చెర్వుకొమ్ముపాలేనికి చెందిన కంకణాల వీరాంజనేయులు, భార్య రేబికాకుమారి, పిన్ని అరుణలు మంగళవారం ఉదయం మోటార్‌సైకిల్‌పై అద్దంకి-రేణింగవరం రోడ్డులో పొలం వెళ్తుండగా వెనుక నుంచి క్రేన్ ఢీకొట్టడంతో పడిపోయారు. రేబికాకుమారిని క్రేన్ బంపర్ ఈడ్చుకుంటూ పోయింది. క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా రేబికాకుమారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గాయపడ్డ వీరాంజనేయులు, అరుణలను మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పీఎస్సై వెంకటేశ్వరరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

పంగులూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమంజులూరు వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై లారీ ఢీకొని పది గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. కొండమంజులూరు అడ్డరోడ్డు వైపు చేరుకునేందుకు జాతీయ రహదారి దాటుతున్న గొర్రెల మందను ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళుతున్న ఓ లారీ ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో పదిగొర్రెలు మృతి చెందాయి. కొండమంజులూరు క్రాస్ రోడ్డు ఎదురుగా ఉన్న ఆర్ 5 రెస్టారెంట్ ఎదురు ఈ ఘటన జరిగింది. గొర్రెలు బొల్లాపల్లిలోని బుర్ల రామాంజనేయులుకు చెందినవిగా హైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

పరస్పర కేసుల నమోదు

మార్టూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామంలో ఇంటి స్థలం హద్దు వివాదంపై సోమవారం చోటుచేసుకుంది. గాలి ఆరోగ్యం, గాలి అరుణ్ కుమార్‌లు తమ బంధువులతో కలిసి పరస్పరం ఇంటి వద్ద కర్రలతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో అరుణ్‌కుమార్ తలకు, ఆరోగ్యం చేతులకు భుజంపై గాయాలయ్యాయి. వారు మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆరోగ్యం ముగ్గురు వ్యక్తులపై, అరుణ్ కుమార్ నలుగురు వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. దాంతో రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంగళవారం ఎస్‌ఐ సైదా తెలిపారు.

పట్టుబడిన నాలుగు ఇసుక ట్రాక్టర్లు

వేటపాలెం(చీరాల), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి నుంచి చీరాల వైపు వెళుతున్న నాలుగు అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్లు రెవెన్యూ సిబ్బందికి పట్టుబడ్డాయి. ఈ ఘటన మంగళవారం 216 జాతీయ రహదారిలో చోటుచేసుకోగా ట్రాక్టర్లు వేటపాలెం పోలీసులకు అప్పగించారు. దీంతో వారు కేసు నమోదు చేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్.. అదుపులో ప్రైవేట్ బస్సు డ్రైవరు

- విజయవాడ నుంచి బెంగళూరు వెళుతున్న ట్రావెల్ బస్సు
- బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద పోలీసుల తనిఖీలు
- రెండు గంటల సేపు బస్సులోని ప్రయాణికులు స్టేషన్ వద్ద పడిగాపులు
- ఎట్టకేలకు రెండో డ్రైవరుతో బయలుదేరిన వాహనం



మార్టూరు పోలీస్‌స్టేషన్ వద్ద ట్రావెల్ బస్సు, ప్రయాణికులు

మార్టూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : విజయవాడ నుంచి బెంగళూరుకు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులో డ్రైవరు డ్రంక్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడ్డాడు. మార్టూరు పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి మండల పరిధిలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద చోటుచేసుకుంది. ఈ సంఘటనతో దాదాపు రెండు గంటల సేపు బస్సులోని ప్రయాణికులు స్టేషన్ వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. విజయవాడలో సాయంత్రం బెంగళూరుకు బయలుదేరిన ట్రావెల్ బస్సు సుమారు 9 గంటల సమయంలో బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద చేరుకుంది. ఈ క్రమంలో మార్టూరు ఎస్‌ఐ సైదా తన సిబ్బందితో కలిసి డ్రంక్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా బస్సు డ్రైవరు మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు బస్సు స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల ప్రైవేటు ట్రావెల్ బస్సులు ఊహించని విధంగా ప్రమాదాలు బారినపడుతుండటం, ప్రయాణికుల ప్రాణాలు పోతుండటంతో సీఐ శేషగిరిరావు జాతీయరహదారిపై ప్రత్యేక నిఘా చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా బస్సు డ్రైవరు పట్టుబడటంతో, ముందు జాగ్రత్త చర్యగా ప్రమాదాన్ని పోలీసులు నిలువరించగలిగారు. ఇదిలా ఉండగా తాము ప్రయాణిస్తున్న ట్రావెల్ బస్సు డ్రైవరు మద్యం సేవించి ఉన్నారన్న విషయం బయటపడటంతో ప్రయాణికులు షాక్‌కు గురయ్యారు. వారం రోజుల వ్యవధిలో ఉభయరాష్ట్రాలలో జరిగిన ప్రైవేటు ట్రావెల్ బస్సుల ప్రమాదాలలో జరిగిన సంఘటనతో భీతిల్లుతున్న ప్రయాణికులు ఈ సంఘటనతో దిగ్భ్రాంతికి గురయ్యారు. పోలీసుల తనిఖీ వల్ల మద్యం మత్తులో ఉన్న డ్రైవరు కారణంగా తమ బస్సు ప్రమాదానికి గురికాకుండా కాపాడారని ప్రయాణికులు పోలీసులను అభినందించారు. ఎట్టకేలకు రాత్రి 10 గంటల 45 నిమిషాల తర్వాత బస్సుకు చెందిన రెండో డ్రైవరు ఆధ్వర్యంలో బస్సు స్టేషన్ నుంచి బెంగళూరుకు బయలుదేరింది. ప్రయాణికులను దగ్గరుండి సీఐ శేషగిరావు స్వయంగా బస్సులో ఎక్కించి పంపించారు. అదేవిధంగా డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడిన డ్రైవరుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- కాలిబూడిదైన సామగ్రి
- మోటుపల్లిలో ఘటన



దగ్ధమైన ఇల్లు

చినగంజాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవీధి పాలేనికి చెందిన వడ్లమూడి వెంకటరావు ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం వస్తువులు అన్ని దగ్ధమయ్యాయి. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. అకస్మాత్తుగా ఏర్పడిన విద్యుత్ లోపంతో మంటలు చెలరేగి రేకుల ఇంటిలోని నాలుగు మంచాలు, టీవీ దుస్తులు, గృహోపకరణాలు, ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు స్పందించి తహసీల్దార్ జె.ప్రభాకరరావు, చీరాల ఫైర్ సిబ్బందిని అప్రమత్తం చేసి మంటలు అదుపు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చీరాల ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు పక్క ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. ఇంటి ముందు ఉన్న పందిరి పూర్తిగా దగ్ధమైంది. సంఘటనా స్థలాన్ని గ్రామ రెవెన్యూ అధికారి పి.నాగరాజురెడ్డి పరిశీలించి లక్షన్నర రూపాయిల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. గ్రామస్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ అధికారులు సరఫరా నిలిపి వేసి మరమ్మతులు ప్రారంభించారు.

పారిశ్రామిక ప్రగతి

- దొనకొండకు వరుసగా ప్రాజెక్టులు
- ప్రారంభంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుపై విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ ప్రకటన
- ఇటీవల రక్షణ రంగానికి చెందిన భారీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన బీడీఎల్ సంస్థ
- తాజాగా ప్రపంచ స్థాయి క్యాన్సర్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు
- ఏడాదిన్నర ప్రజాప్రభుత్వం పాలనలో చిగురిస్తున్న ఆశలు
- ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎండమావిగా అభివృద్ధి

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలోనే దొనకొండలో పారిశ్రామిక ప్రగతి దిశగా అడుగులు పడుతున్నాయి. వరుసగా కీలక ప్రాజెక్టులకు ఆమోదం లభిస్తోంది. ఇటీవల సోలార్, తర్వాత రక్షణ రంగ భారీపరిశ్రమ, తాజాగా క్యాన్సర్ రీసర్చ్ సెంటర్ ఇలా వరుసగా ప్రాజెక్టులు రాబోతున్నాయి. సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. ప్రకాశం జిల్లాలో అన్నిరంగాల్లో వెనుకబడిన దొనకొండ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, జీవనోపాధి నిమిత్తం పేద ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్తున్న వలసలు నివారించాలన్నా పరిశ్రమల ఏర్పాటు ఎంతో ముఖ్యం. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రజాప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో ప్రాజెక్టులు తీసుకువస్తుండటంతో దొనకొండలో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి వేగంగా అడుగులు ముందుకు పడుతున్నాయి.



దొనకొండను సూచించే బోర్డు

దొనకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దొనకొండలో భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశాలు ప్రస్తుతం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే సోలార్ పవర్ ప్రాజెక్టుతో పాటు బీడీఎల్‌కు చెందిన పరిశ్రమను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పుడు తాజాగా క్యాన్సర్ రిసర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి సౌత్ కొరియా సంస్థ, చల్లా గ్రూపుల సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇలాగే మరి కొన్ని పరిశ్రమలు వచ్చేందుకు అవకాశాలు ఉన్నాయి. దొనకొండ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు నిమిత్తం ఇటీవల భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) సంస్థ ఒక అడుగు ముందుకేసి దొనకొండలో రెండు దశలుగా రూ.1,200 కోట్ల పెట్టుబడులతో ఆయుధ క్షిపణుల తయారు పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చి అందుకు 1,400 ఎకరాల భూమి అవసరంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,600 మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులన్నీ సకాలంలో వస్తే ఏడాదిలో పరిశ్రమ పనులను ప్రారంభించి, రెండేళ్లకు పూర్తిచేసేలా ఆ సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిసింది. అందులోభాగంగా ఇటీవల డీఆర్‌డీవో సంస్థకు చెందిన ప్రతినిధులు దొనకొండకు విచ్చేసి ఈ ప్రాంతంలోని భూములను, మౌలిక సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించి భూములకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కనిగిరి ఆర్డీవో, స్థానిక తహసీల్దార్ ద్వారా తెలుసుకున్నారు.

ప్రపంచస్థాయి క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు

తాజాగా సీఎం చంద్రబాబునాయుడు పిలుపు మేరకు దొనకొండ ప్రాంతంలో 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,260 కోట్లతో ప్రపంచ స్థాయి క్యాన్సర్ సెంటర్ ఏర్పాటుకు దక్షిణ కొరియాకు చెందిన వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం చైర్మన్ వెల్లడించారు. చల్లా గ్రూప్స్ సంస్థల భాగస్వామ్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో కాన్సర్ సెంటర్ నిర్మించనున్నట్లు ప్రకటించి విజయవాడలో సోమవారం ఆయా సంస్థల ప్రతినిధులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కేంద్రంలో 1,500 పడకలతో ఇన్ పేషెంట్ వార్డు, క్యాన్సర్ శస్త్ర చికిత్సలు, మెడికల్ స్కూల్, నివాస సముదాయం, బొటానిక్ గార్డెన్ తదితర ఏర్పాటు చేస్తారు. తద్వారా దాదాపు 4వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని వారు ప్రకటించారు.



దొనకొండలో భూములను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో ప్రతినిధుల బృందం(ఫైల్)

ఆ ఐదేళ్లు ప్రగతి శూన్యం.. మళ్లీ ప్రారంభం

రాష్ట్ర విభజన అనంతరం 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు దొనకొండ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో నాడు ప్రకటించారు. అనంతరం ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ఎందరో విదేశీ ప్రతినిధుల బృందాలు పర్యటించి పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారిస్తున్న సమయంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో పరిశ్రమల అభివృద్ధిపై ఏమాత్రం దృష్టిసారించకపోవటంతో పారిశ్రామిక ప్రగతి ఎండమావిగా మారింది. తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ఆధ్వర్యంలోని ప్రజాప్రభుత్వం ఏడాదిన్నర కాలంలో పరిశ్రమల ఏర్పాటుపై చూపుతున్న చొరవతో దొనకొండ ప్రాంతం అభివృద్ధిలో భాగంగా పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. త్వరలో దొనకొండ దశ మారి బంగారు కొండగా అభివృద్ధి చెందటం ఖాయమని ప్రజలు భావిస్తున్నారు.

ప్రశాంతంగా ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్

- 51 మంది హాజరు, ఒకరు ప్రమోషన్ వద్దన్నారు
- మరో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు గైర్హాజరు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రేడ్‌-6 పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీవో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రేడ్‌-6లకు గ్రేడ్‌-5 పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు సీనియార్టీ ప్రకారం 55 మందిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. అయితే 51 మంది మాత్రమే హాజరయ్యారు. ఒకరు తనకు ప్రమోషన్ వద్దని లిఖితపూర్వకంగా రాసి ఇవ్వగా, మరో ముగ్గురు కౌన్సెలింగ్‌కు రాలేదు. కౌన్సెలింగ్‌కు మంగళవారం ఉదయమే ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో ఏవో శివారెడ్డి, మార్కాపురం డీఎల్‌పీవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చారు.. పనులు మరిచారు..

(5వ పేజీ తరువాయి)

చెల్లించలేదు. ఆయా భవనాలు పూర్తి అయితే తరగతి గదుల కొరత తీరుతుందని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. గుంటూరులోని ఏటి అగ్రహారం, పట్టాభిపురం, కేవీపీకాలనీ, ఎన్జీవో కాలనీతోపాటు మండల పరిధిలోని లాలుపురం, నల్లపాడు, ఓబులునాయుడుపాలెం, వెంగళాయపాలెం, అంకిరెడ్డిపాలెం, ఏటుకూరు గ్రామాలతో పాటు పల్నాడు, బాపట్ల జిల్లాలో కూడా అనేక పాఠశాలల్లో అసంపూర్తి భవనాలు దర్శనమిస్తున్నాయి.

కొలిక్కిరాని విచారణ

గత ప్రభుత్వం నాడునేడు పేరుతో తల్లిదండ్రుల కమిటీలకు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. పేరుకు తల్లిదండ్రుల కమిటీ ఉన్నా దాని వెనుక మాత్రం వైసీపీ అనుచరగణమే ఉంటూ నిర్మాణాలు చేపట్టింది. నాణ్యతా లోపంతోపాటు నిర్మాణాల విషయంలో అనేక ఆరోపణలు వచ్చాయి. దీంతో కూటమి ప్రభుత్వం ఆయా పనులపై విచారణ చేపట్టాలని నిర్ణయించింది. అయితే ఈ విచారణ ఎంతవరకు వచ్చిందో కూడా అర్థం కావడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు.

అవీఇవీ

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలో వేటపాలెం విద్యార్థిని సత్తా



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రభుత్వ పాఠశాలవిద్యార్థిని మెరిసింది. ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు ఏలూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 69వ అండర్ 17 తైక్వాండో పోటీల్లో వేటపాలెం బాలికోన్నత పాఠశాలకు చెందిన యార్లగడ్డ లక్ష్మీప్రియ 48 -52 కేజీల విభాగంలో పాల్గొని తృతీయ స్థానం దక్కించుకుంది. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు సరోజినీ, ఉపాధ్యాయులు దేవభిక్షం, శ్రావణీ, తదితరులు ప్రత్యేకంగా ఆవిద్యార్థినిని అభినందించారు.

చెస్, యోగా పోటీలలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో హెచ్‌ఎం, వ్యాయామోపాధ్యాయులు

పంగులూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో జరిగిన ఉమ్మడి ప్రకాశం జిల్లాస్థాయి చెస్, యోగా పోటీలలో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. అండర్ -14 చెస్ పోటీలో చందలూరు పాఠశాల విద్యార్థి కె.సమ్మిత్‌నాయుడు విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. యోగా అండర్‌-14 విభాగంలో నాయపాము శృతి ట్రెడిషనల్‌లో ఆర్టిస్టిక్ సింగిల్, ఆర్టిస్టిక్ పెయిర్‌లో మొదటి స్థానంలో నిలిచింది. కె.హెప్సిబా, అమూల్య రిథమిక్ పెయిర్‌లో మొదటిస్థానంలో నిలువగా, అండర్‌-14 బాలుర విభాగంలో ఎం.వెంకటేష్ ట్రెడిషనల్, ఆర్టిస్టిక్ సింగిల్‌లో మొదటిస్థానం, అండర్ -17 బాలికల విభాగంలో ఎన్.భవ్యశ్రీ, ఎ.లిఖితలు ట్రెడిషనల్, ఆర్టిస్టిక్‌తో పాటు రిథమిక్‌లో మొదటిస్థానంలో నిలిచారు. విజేతలను హెచ్‌ఎం గిరిజ, పీడీలు కె.ప్రతిమ, మధుమూర్తి, పీఈటీ రవితో పాటు గ్రామపెద్దలు మంగళవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు.

శ్రమదానంతో చిల్లచెట్ల తొలగింపు



రహదారిని బాగుచేస్తున్న రాజమాత కాలనీవాసులు

చినగంజాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజమాతకాలనీకి వెళ్లే రహదారిని కాలనీవాసులు మంగళవారం బాగుచేశారు. ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి రాజమాత కాలనీ వరకు రహదారికి ఇరువైపులా పిచ్చిచెట్లు, ముళ్లకంపలు అడ్డుగా ఉండి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పొగడ్త నాగరాజు ఆధ్వర్యంలో కాలనీకి చెందిన యువతీ యువకులు శ్రమదానం చేసి రహదారికి ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో కె.ధనలక్ష్మి, గ్రామ కార్యదర్శి కె.సునీతలు పర్యవేక్షణ చేశారు.

జిల్లా స్థాయి చెకుముకి పరీక్షకు పావులూరు విద్యార్థులు

ఇంకొల్లు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయి చెకుముకి పోటీలలో పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానం సాధించారు. స్థానిక ఎన్‌ఆర్‌పీఎస్‌ఆర్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక, యూటీఎఫ్ సంయుక్తంగా మండల స్థాయిలో చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పావులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.వైష్ణవి, ఆర్.వీరమణికంఠ, పి.పవన్‌కుమార్‌రెడ్డిలు ప్రథమస్థానం సాధించి ఈ నెల 23వ తేదీన బాపట్లలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు అర్హత పొందారని జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ యు.చెంచయ్య తెలిపారు.

కొనుగోళ్లు.. కంటితుడుపే

(5వ పేజీ తరువాయి)

విజ్ఞప్తుల మేరకు అక్టోబరు 15 వరకు కొనుగోళ్లు చేపడతామని మార్క్‌ఫెడ్ తెలిపింది. తర్వాత ఆ గడువును మరో పది రోజులు పొడిగించి గత నెల 25 వరకు కేంద్రాల ద్వారా బర్లీ సేకరణ జరుపుతామని అధికారులు ప్రకటించారు. అయితే గడువు పెంపుకాలంలో నాలుగు జిల్లాల పరిధిలో మూడు కొనుగోలు కేంద్రాల ద్వారా బర్లీ సేకరణ చేపట్టామని యంత్రాంగం చెబుతోంది. కానీ ఇవన్నీ ఉత్తమాటలేనని క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియజేస్తున్నాయి. తాజాగా విరుచుకుపడిన భారీ వర్షం ధాటికి బర్లీ పొగాకు బేళ్ల కిందకు వాన నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండడంతో రైతుల ఆవేదనకు అంతేలేకుండా పోయింది. బర్లీ కొనుగోళ్లకు సంబంధించి 16,739 మంది రైతులు నమోదు చేసుకుంటే కేంద్రాలు మూసివేసే నాటికి 11,985 మంది రైతుల నుంచే బర్లీ కొనుగోలు చేశారు. ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో ఇంకా రూ.136 కోట్ల మిగులు ఉన్నట్లు అధికారికంగానే తెలుస్తోంది. బర్లీ కొనుగోళ్లకు రూ.273 కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఇప్పటివరకు జరిపిన కొనుగోళ్లకు సంబంధించి రూ.102 కోట్లు చెల్లించగా, ఇంకా రూ.35 కోట్ల వరకు పెండింగ్ ఉన్నట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు.

ఆదుకుంటామని మంత్రుల హామీ..

తుఫాన్ నష్టాన్ని పరిశీలించడానికి మంత్రులు పార్థసారథి, రవికుమార్‌లతో పాటు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు పర్చూరు నియోజకవర్గ పరిధిలో ఇటీవల జరిపిన క్షేత్రస్థాయిలో పర్యటనలో తమ ఇక్కట్లను బర్లీ రైతులు వారి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రాల ద్వారా బర్లీ కొనకపోతే తాము నిండా మునగడం ఖాయమని ఆవేదన వ్యక్తం చేయగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. దీనినిబట్టి రైతుల వద్ద ఇంకా పెద్దఎత్తున బర్లీ నిల్వలు ఉన్నాయని ప్రత్యక్షంగా తెలుస్తోంది. కానీ కొనుగోళ్లపై మార్క్‌ఫెడ్ పొంతనలేని సమాధానాలు చెప్పడం వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసమేనని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది

తాజా ప్రతిపాదనలు..

20,000 క్వింటాళ్ల బర్లీ పొగాకు సేకరణకు అనుమతివ్వాలనే ప్రతిపాదనలను అధికారులు ఈ నెల 1న మార్క్‌ఫెడ్‌కు పంపినట్లు సమాచారం. అక్టోబరు 25తో కేంద్రాలను మూసేసిన సంగతి తెలిసిందే. గడువు పెంచి 9,000 క్వింటాళ్లలోపుతో సరిపెట్టిన మార్క్‌ఫెడ్, ఇప్పుడు అదనంగా ప్రతిపాదనలు పంపడంపై రైతుల్లో నమ్మకం కుదరడం లేదు.

నీళ్లల్లోనే పైర్లు !


చింతగుంటపాలెం సమీపంలో నీటమునిగి ఉరకెత్తుతున్న మిర్చి

నేటికీ వెంటాడుతున్న తుఫాన్ ప్రభావం
ఉరకెత్తుతున్న పంటలు
ఆందోళన చెందుతున్న అన్నదాతలు

పర్చూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావం రైతులను నేటికీ వెంటాడుతూనే ఉంది. కురిసిన భారీ వర్షాలు, వరదలకు కాలువలు, వాగులు పొంగిపొరలి పంట పొలాను ముంచెత్తాయి. వర్షం తగ్గి ఐదారు రోజులు గడుస్తున్నా నేటికీ పంట పొలాలను వరద నీరు వీడలేదు. రోజుల తరబడి వరద నీటిలో పైర్లు మునిగి ఉండటంతో ఉరకెత్తి ఎండుముఖం పడుతున్నాయి. ఏమిచేయాలో పాలుపోని స్థితిలో అన్నదాతలు కొట్టుమిట్టాడుతున్నారు. మరో పక్క వాతావరణ పరిస్థితులు, వర్ష సూచనల నేపథ్యంలో రైతుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది. దీంతో ఈఏడాది సాగు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, ఇంకొల్లు మండలాల్లో వరద ప్రభావానికి వేల ఎకరాల్లో పైర్లు దెబ్బతిన్నాయి. కారంచేడు, పర్చూరు మండలాల పరిధిలో వేల ఎకరాల్లో వరి పైర్లు ఇప్పటికీ వరద నీటిలోనే ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మిర్చి, పత్తి పైర్లు ఉరకెత్తి ఎండుముఖం పట్టాయి. పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. మరో పక్క ఖరీఫ్ సీజన్ కూడా నామమాత్రంగానే సాగటం, రబీ సాగు ఇలా వరదల నేపథ్యంలో పొలాలను ముంచెత్తటంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో రైతులు అల్లాడిపోతున్నారు.


కారంచేడు ప్రాంతంలో వరద నీటిలో మునిగి ఉన్న వరి పైర్లు


నూతలపాడు ప్రాంతంలో నీట మునిగిన పత్తి పైరు

వరిలో ఉల్లికోడు నివారణ చర్యలు చేపట్టాలి

అద్దంకి, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : వరిలో ఉల్లికోడు నివారణ చర్యలు తీసుకోవాలని ఏడీఏ ఎర్రాయం చెప్పారు. మండలంలోని ధర్మవరం, శంఖవరప్పాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ తరువాత వరిలో ఉల్లికోడు ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతుల జాబితా అన్ని రైతు సేవాకేంద్రాలలో ఉంచామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, శేషయ్య, ఖాజాబీ, శేషారావు పాల్గొన్నారు.


ధర్మవరంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ ఎర్రాయం,ఏవో వెంకటకృష్ణ

యాజమాన్య పద్ధతులు పాటించండి

పంగులూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : రైతులు పంటసాగులో సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని భగవాన్‌రాజుపాలెం, రామకూరు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు హరి, బీబి జాన్, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవలో...

బల్లికురవ, నవంబరు4(ఆంధ్రజ్యోతి): వరి పంట సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని కొత్తూరు, వెలమవారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈవో మౌలాలి పాల్గొన్నారు.

రోగాలను ముందుగా గుర్తిస్తే మరణాలను తగ్గించొచ్చు


వైద్య సేవలపై బాలింతలను ఆరా తీస్తున్న డాక్టరు మాలిని

చీరాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో తరచూ వచ్చే రోగాలను ముందుగా గుర్తిస్తే శిశు మరణాలను తగ్గించవచ్చని గుంటూరు ప్రాంతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ మాలిని చెప్పారు. మంగళవారం అర్బన్ పరిధిలో మరియమ్మపేట, పాపరాజుతోట, వైకుంఠపురం ప్రాంతాల్లో ఆమె పర్యటించి ఆరోగ్య కేంద్రాల నుంచి బాలింతలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో బాలింత తొలి ఏడు రోజుల్లో మరణాల సంఖ్య అధికంగా ఉంటున్నాయని చెప్పారు. ఈక్రమంలోనే మరణాల నియంత్రణకు సంబంధించి అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
డీఎంహెచ్‌వో విజయమ్మ

పర్చూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో నీరు కలుషితంగా మారి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తీసుకునే విధంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాలని డీఎంహెచ్‌వో విజయమ్మ చెప్పారు. మంగళవారం ఆశా డే సందర్భంగా లోకేటెడ్ సీహెచ్‌సీని డీఎంహెచ్‌వో సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులు అన్ని రకాల పరీక్షలు చేయించుకునే విధంగా చూడాలన్నారు. పోషకాహార లోపం లేకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఆహారాన్ని గర్భిణులు సద్వినియోగించుకునే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని చెప్పారు. లెప్రసీపై ఈనెల 17న పెద్ద ఎత్తున సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రశాంతి, పృథ్వీ, ఎంపీహెచ్‌వో టి.సుధాకర్, సీహెచ్‌వో రావి వరలక్ష్మి పాల్గొన్నారు.


సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలుపు స్ఫూర్తితో ర్యాలీ

అద్దంకి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్‌ను గెలిచిన సందర్భంగా మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గోపాలరావు వారి వీధి నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు, కార్యదర్శి అల హరి హరిప్రసాద్, డాక్టర్ దేవపాలన, అద్దంకి లేవిప్రసాద్, చప్పిడి వీరయ్య, పసుపులేటి ఆంజనేయులు, మహమ్మద్ రఫీ, శ్రీనివాసులు, గూడా లక్ష్మారెడ్డి, చిన్ని కామేశ్వరరావు, తమ్మన శ్రీనివాసరావు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణల తొలగింపు


ఆక్రమించి ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం, అరుగును తొలగిస్తున్న డ్రోజర్, పర్యవేక్షిస్తున్న అధికారులు

అద్దంకి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణం సమీపంలో కలవకూరు రోడ్డులో ఇటుక బట్టీల వద్ద ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమించి 1వ వార్డు వైసీపీ కౌన్సిలర్ కొత్తగొర్ల వెంకటసుబ్బారావు వినాయక విగ్రహం ఏర్పాటు చేసి, దాని చుట్టూ అరుగు నిర్మించారు. ఈ నేపథ్యంలో ఆదివారం అధికారులు పరిశీలించి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం వరకు కూడా తొలగించకపోవటంతో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఆర్అండ్‌బీ అధికారులు డ్రోజర్‌తో తొలగింపజేశారు. సీఐ సుబ్బరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు బండారు రామారావు 48వ వర్ధంతి

రాష్ట్ర వ్యాప్తంగా సత్యహరిశ్చంద్రుడు పాత్రతో గుర్తింపు

అద్దంకి, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : పౌరాణిక రంగస్థల నాటక ప్రదర్శనలలో అద్దంకి పట్టణానికి చెందిన బండారు రామారావుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఐదారు దశాబ్దాల క్రితం సత్యహరిశ్చంద్ర నాటకంలో కాటిసీనును బండారు రామారావు రక్తికట్టించేవారు. ఆయన మృతి చెంది 48 ఏళ్లు అయింది. నేటికీ ఆయన పాడిన కాటిసీను పద్యాలు నాటి తరం వృద్ధుల చెవులలో రింగుమని వినపడుతూనే ఉన్నాయి. రామారావు కుటుంబసభ్యులు ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ నేటికీ రంగస్థల కళాకారులుగా కొనసాగుతున్నారు.


కాటిసీనులో బండారు

మాక్ ఎలక్షన్‌పై అవగాహన

చినగంజాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం మాక్ ఎలక్షన్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు బ్యాలెట్ బాక్సు, ఓటు వేసే విధానం, క్యూలో వెళ్లడం తదితర విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు తెలియపరచటానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శ్రీలక్ష్మి, చిలకా కుమార్, షాహిదా బేగం పాల్గొన్నారు.


చినగంజాం జడ్పీ పాఠశాలలో మాక్ ఎలక్షన్ నిర్వహిస్తున్న విద్యార్థులు

106 మందికి దంత పరీక్షలు

అద్దంకి, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలలో భాగంగా మంగళవారం సత్రం బడి, కట్టకిందపాలెం ప్రాథమిక పాఠశాలలో 106 మంది విద్యార్థులకు వారాహి దంత వైద్యశాల వైద్యులు చెన్నుపల్లి భావనా ప్రియదర్శిని, యామిని కృష్ణప్రియాంక ఆధ్వర్యంలో దంత పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, సుబ్బారావు, సాయిసేవాదళ్ కన్వీనర్ చిన్ని శ్రీహరి, ఉమాదేవి, అంజాద్‌బాషా, చప్పిడి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

నేడు జొన్నతాళిలో శాంతి కల్యాణ మహోత్సవం

మార్టూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం మండలంలోని జొన్నతాళి గ్రామంలో గంగమ్మ దేవస్థానం వద్ద గంగా పార్వతీ సమేత శ్రీమహాకాళేశ్వరిస్వామి శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు సాయంత్రం స్వామి పంచలోహవిగ్రహాలతో గ్రామోత్సవం, తదుపరి జ్వాలా తోరణం, అనంతరం స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామని వివరించారు. గురువులు శ్రీశర్వాజీ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కమిటి సభ్యులు తెలిపారు.

నేడు మార్టూరులో అఖండ కర్పూరజ్యోతి

మార్టూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం మండలంలోని అమరావతి నూలుమిల్లు ఎదురుగా ఉన్న నాగార్పమ్మ దేవస్థానంలో అఖండ కర్పూరపు జ్యోతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విశేషంగా భక్తులు తరలి రావాలని కోరారు.

నేడు చీరాలలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కట్

చీరాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు ఈపూరుపాలెం గ్రామమంతా సేవలకు అంతరాయం ఉంటుందని చెప్పారు. అలాగే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చీరాల మండల పరిధిలోని కొత్తపాలెం, విఘ్నేశ్వర కాలనీ అంతరాయం కలుగుతుందని తెలిపారు. అంతేకాకుండా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మున్సిపల్ పరిధిలోని పాపరాజుతోట, స్వర్ణ రోడ్డు, కొట్ల బజార్, పువ్వాడవారి వీధి, అయ్యప్పస్వామి టెంపుల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు అద్దంకిలో...

అద్దంకి, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ టవర్ లైన్ల ఏర్పాటు నేపథ్యంలో బుధవారం అద్దంకి పట్టణంలోని ద్వారకానగర్, ఆటోనగర్, మండలంలోని శింగరకొండ, శింగరకొండపాలేలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం, మౌలానగర్, గరటయ్య కాలనీ, రేణింగవరం రోడ్డు తదితర ప్రాంతాలలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు.

నేడు బల్లికురవలో ...

బల్లికురవ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : బల్లికురవలో నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఇన్‌చార్జి ఏఈ సుబ్బారావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు కార్తీక పౌర్ణమి.. తీర ప్రాంతాల మూసివేత

చినగంజాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మోటుపల్లి, బాపయ్యనగర్, పల్లెపాలెం సముద్ర తీరప్రాంతాలను మూసివేసినట్లు చినగంజాం ఎస్ఐ శీలం రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొంథా తుపాన్ ప్రభావంతో సముద్రంలో పెద్ద గుంతలు ఏర్పడి సముద్ర స్నానాలు చేయడానికి పరిస్థితులు అనుకూలంగా లేవని వివరించారు. బుధవారం జరిగే కార్తీకపౌర్ణమి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు తీరప్రాంతాల్లో అనుమతి లేదని తెలిపారు. పౌర్ణమి స్నానాలకు భక్తులు ఎవరూ రావద్దని, గ్రామాల్లో మైకు ద్వారా ప్రచారం చేశామని ఎస్ఐ తెలిపారు.

ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కోఆర్డినేటర్

మార్టూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : మార్టూరు గ్రామంలోని ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం జిల్లా సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ సత్యసాగర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా ఆయన గురించి విద్యార్థులకు వివరించారు. ఆ తరువాత చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జయకుమార్, సీఆర్పీ రామారావు పాల్గొన్నారు.

అవీఇవీ

తుఫాన్ నష్టాన్ని పారదర్శకంగా అంచనా వేయాలి

ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన కరణం వెంకటేష్


ఆర్డీవోకు వినతి అందజేస్తున్న వెంకటేష్, వైసీపీ నేతలు

చీరాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా రైతులు, నేతన్నల కుటుంబాల్లో కన్నీరే మిగిలిందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం వేటపాలెం మండలం దేశాయిపేట విఘ్నేశ్వర కాలనీలో నీట మునిగిన పంట పొలాలను, అలాగే మోకాళ్ల లోతు నీళ్లల్లో ఉన్న మగ్గాలను పరిశీలించారు. ఆయా బాధితులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షం తీవ్రత అధికంగా ఉండటం వలన ప్రజలు పరిస్థితి దయనీయంగా ఉందని చెప్పారు. అనంతరం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడును కలిసి సమస్య తీవ్రతను వివరించారు. ప్రభుత్వానికి నష్టం విలువ పారదర్శకంగా రూపొందించి సాయం సమకూరే చూడాలని కోరారు. అందుకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన వెంకటేష్ వెంట పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చేనేతలకు నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : కొండమంజులూరులో ఇటీవల తుపాన్‌తో మగ్గం పనులు నిలిచి ఇబ్బందులు పడుతున్న చేనేత కుటుంబాలకు ప్రభుత్వం సమకూర్చిన నిత్యావసర సరుకులను తహసీల్దార్ సింగారావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేనేత కుటుంబాలను ఆదుకునేందుకు నిత్యావసర సరుకులు సరఫరా చేసిందన్నారు. ఈ ఒక్క గ్రామంలోని 59 చేనేత కుటుంబాలకు సాయం అందచేసినట్లు చెప్పారు. ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యం, కేజీ నూనె, కంది పప్పు, బంగాళదుంపలు, ఉల్లిపాయలు అందచేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్వేత, టీడీపీ నాయకులు చింతల సహదేవుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బత్తుల వెంకటరావు, వీఆర్వో రవి పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

బల్లికురవ, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సంభవించిన మొంథా తుపాన్‌తో తీవ్ర ఇబ్బంది పడిన పలు కుటుంబాలకు మంగళవారం రాత్రి నక్కబొక్కలపాడులో తహసీల్దార్ రవినాయక్, నీటి సంఘం అధ్యక్షుడు దర్శి రామస్వామిలు రేషన్ బియ్యం, తదితర వస్తువులను పంపిణీ చేశారు. నక్కబొక్కలపాడు గ్రామంలో చేనేత కార్మికులు వర్షపు నీరు వచ్చి తీవ్రంగా నష్టపోయారు.

మొక్కజొన్న విత్తనాలను నాటే యంత్రాల పంపిణీ


యంత్రాలను పంపిణీ చేస్తున్న ఏవో లావణ్య,అడ్వాంటా సీడ్స్ ప్రతినిధులు

మార్టూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : తక్కువ శ్రమ, వ్యయంతో మహిళా రైతులు యంత్రాల ద్వారా మొక్కజొన్న విత్తనాలను నాటడానికి అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారిణి లావణ్య చెప్పారు. మంగళవారం మార్టూరులో వ్యవసాయమార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో మండలంలోని మహిళా రైతులకు అడ్వాంటా సీడ్స్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఉచితంగా మొక్కజొన్న విత్తనాలను నాటే యంత్రాలను పంపిణీ చేశారు. ఏవో లావణ్య చేతుల మీదుగా, కంపెనీ ప్రతినిధులు ఆ యంత్రాలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రోహిత్ కుమార్, సుమంత్ పాల్గొన్నారు.

కుష్ఠురోగుల గుర్తింపు సర్వేపై ఆశావర్కర్లకు శిక్షణ

పంగులూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న కుష్ఠురోగుల గుర్తింపు సర్వేలో రోగలక్షణాలు ఉన్నవారిని గుర్తించి తగిన సమాచారాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారికి అందచేయాలని డాక్టర్ శివచెన్నయ్య చెప్పారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశావర్కర్ల ప్రత్యేక సమావేశం జరిగింది. కార్యక్రమంలో ప్రదీప్, సీహెచ్‌వో జి.భారతి, ఎస్‌హెచ్‌వో భానుమతి పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న డాక్టర్ శివచెన్నయ్య

జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు


విజేతలతో జేవీవీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

పంగులూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పంగులూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. సైన్స్ సంబరాలలో భాగంగా ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన చెకుముకి పోటీలలో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోగా, కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థి తృతీయస్థానంలో నిలిచాడు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను జె.వి.వి. ప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

బొబ్బేపల్లి జడ్పీ హైస్కూలులో...

మార్టూరు, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొబ్బేపల్లి జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జనవిజ్ఞాన వేదిక వారు మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ పోటీలలో మార్టూరులోని శ్రీనివాసా హైస్కూల్ విద్యార్థులు మొదటి, రెండు స్థానాలను గెలుచుకున్నారు. వారు ఈ నెల 23వ తేదీ జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించారని ఉపాధ్యాయులు తెలిపారు.

బల్లికురవలో...

బల్లికురవ, నవంబరు4(ఆంధ్రజ్యోతి): బల్లికురవ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలల విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. కొప్పెరపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వారికి నిర్వాహకులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లింగారావు, డేవిడ్‌పాల్, పి. రామాంజనేయులు పాల్గొన్నారు.



జల సంరక్షణ చర్యలపై కేంద్రం ప్రశంస

● కలెక్టర్‌ను అభినందిస్తూ లేఖ

నెల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో జల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలకు కేంద్ర ప్రభుత్వం ప్రశంసించింది. కలెక్టర్ హిమాన్షు శుక్లా నేతృత్వంలోని అధికార యంత్రాంగాన్ని అభినందిస్తూ ప్రతిష్ఠాత్మకమైన జల సంచాయ్-జన్ భగీరథి అవార్డును ప్రకటించింది. గడిచిన ఏడాది కాలంలో జిల్లాలో నీటి వనరులను సంరక్షించడం, నీటి వృథాను అరికట్టడం, ప్రజలతో అవగాహన కల్పిస్తూ వారిని భాగస్వామ్యం చేయడంతో కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డుకు జిల్లాను ఎంపిక చేసింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి అర్చనావర్మ కలెక్టర్‌కు ప్రశంసా లేఖను పంపించారు. ఈ అవార్డు అందుకున్న సందర్భంగా రూ.25లక్షల నజరానా కూడా కేంద్రం జిల్లాకు అందించనుంది. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో జల సంరక్షణకు చర్యలు తీసుకోవాలంటూ ఈ లేఖలో సూచించింది. ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర ప్రభుత్వ అవార్డు జిల్లాకు దక్కడంపై అధికార వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.



ఆంధ్రజ్యోతి పరిశీలన

ఇది నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి. నిత్యం వేలాది వాహనాలు ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి రద్దీ ఉన్న రోడ్డుపై ఏర్పడిన గోతులు వాహనదారులను ప్రమాదాలపాలు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చిన్న గుంతలు పెద్ద గోతులుగా మారి చెరువులను తలపిస్తున్నాయి.

- సంగం (ఆంధ్రజ్యోతి)

గుంత.. విప్పండి కళ్లకు గంత!

● ఎగుడు దిగుడు రోడ్లపై అవస్థల ప్రయాణం
● ఇటీవల కురిసిన వర్షాలకు మరింత ఛిద్రమైన రహదారులు

- వివరాలు 8లో..



స్వర్ణాల చెరువు ఘాట్‌లో పూర్తయిన ఏర్పాట్లు

శివం.. శంకరం!

● శివకేశవులకు ప్రీతిపాత్రం 'కార్తీక పౌర్ణమి' ● నేడు జిల్లావ్యాప్తంగా వేడుకలు ● విస్తృత ఏర్పాట్లు

కార్తీక మాసంలో విశిష్టమైన రోజు పౌర్ణమి. ఇది శివ కేశవులకు ఎంతో ప్రీతిపాత్రమైంది. ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో బుధవారం జరుపుకునే ఈ పర్వదినానికి జిల్లాలోని అన్నీ ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. శివాలయాల్లో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కార్తీక దీపారాధనలు, నూనెలో చంద్రబింబం వీక్షణ.. తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వైష్ణవాలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, తులసి అర్చనలు, శ్రీవారి కల్యాణాలు నిర్వహిస్తారు.

- వివరాలు 8లో..

'సోమశిల' నీటిమట్టం

అనంతసాగరం నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి మంగళవారం ఎగువ నుంచి 17,592 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 70.182 టీఎంసీలు నిల్వ ఉంది.

నేడు లంకా దినకర్ రాక : రేపు విస్తృత తనిఖీలు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : 20 అంశాల కార్యక్రమ అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ బుధవారం నెల్లూరుకు వస్తున్నారని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6గంటలకు నెల్లూరుకు చేరుకుని అతిథి గృహంలో బస చేస్తారని తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేస్తారని తెలిపారు. పీఎంశ్రీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, మధ్యాహ్న భోజన పథకం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను దినకర్ తనిఖీ చేస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష ఉంటుందని తెలిపారు.

రిలయన్స్‌పై నీలినీడలు

కృష్ణపట్నంలో 2,630 ఎకరాల కేటాయింపు
16 ఏళ్ల తరువాత ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు సన్నాహాలు

అంబానీ ఆస్తులను సీజ్ చేసిన ఈడీ
పార్కు ఏర్పాటుపై సందిగ్ధత

ఒకటి కాదు.. రెండు కాదు.. దాదాపు 2630 ఎకరాల భూములు. అందులోనూ ఇప్పటికి 16 ఏళ్లు. పరిశ్రమలు పెడతారని, ఉపాధి దొరుకుతుందని ఎదురుచూసిన స్థానికులకు నిరాశే ఎదురైంది. చాన్నాళ్లకు పరిశ్రమల ఏర్పాటులో కదలిక వస్తుందని సంతోషించేలోపు మళ్లీ నిరాశే ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ దేశవ్యాప్తంగా ఉన్న అనీల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆస్తులను సీజ్ చేసిన నేపథ్యంలో కృష్ణపట్నంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయదలచిన మెగా ఇండస్ట్రియల్ పార్కుపై నీలినీడలు కమ్ముకున్నాయి.



కృష్ణపట్నంలో రిలయన్స్‌కు కేటాయించిన భూములు

నెల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పరిసర గ్రామాల్లో థర్మల్ పవర్‌ప్లాంటు ఏర్పాటు కోసం 2009లో రాష్ట్ర ప్రభుత్వం 2,630 ఎకరాలను రిలయన్స్ కోస్టల్ ఆంధ్ర ప్రాజెక్టుకు అప్పగించింది. అప్పట్లో భూసేకరణ ధర తక్కువగా ఉన్నప్పటికీ, పరిశ్రమల ఏర్పాటుతో తమ బతుకులు మారుతాయని, భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకువచ్చారు. కానీ ఆ తరువాత ఆ ప్రాజెక్టులో పురోగతి లేదు. సంవత్సరాలు గడుస్తున్నా, పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. అనేకమార్లు ప్రభుత్వాలు రిలయన్స్ సంస్థకు నోటీసులు ఇచ్చినా ఫలితం దక్కలేదు. అయితే గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఈ భూములకు మోక్షం కలిగింది. రిలయన్స్ యాజమాన్యంతో ప్రభుత్వం చర్చలు జరపడంతో కృష్ణపట్నంలోని 2,630 ఎకరాల్లో గ్రీన్ హైడ్రోజన్ తయారీ ప్లాంటును నెలకొల్పేందుకు రిలయన్స్ సంస్థ సుముఖత వ్యక్తం చేసింది. ఆ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో అనీల్ అంబానీ కృష్ణపట్నం వచ్చి భూములను పరిశీలించారు. భారీ పిచ్చిమొక్కలతో మారిపోయిన భూములు శుభ్రం చేయించారు. అయితే ప్రస్తుత పరిస్థితులలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు లాభతరం కాదని, ఆ స్థానంలో శ్రీసిటీ తరహాలో మెగా ఇండస్ట్రియల్ పార్కును రిలయన్స్ సంస్థ ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించి రూ.1800కోట్లతో డెవలప్‌మెంట్ పనులు చేయనున్నట్లు తెలిసింది. రానున్న పదేళ్లలో ఇక్కడ స్థాపించబోయే పరిశ్రమల ద్వారా సుమారు 20వేల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేసింది. ఈ మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు సంబంధించి అనుమతులకై ఇటీవల రిలయన్స్ యాజమాన్యం ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకుంది. ఈ క్రమంలో రిలయన్స్ సంస్థపై ఈడీ విచారణ జరుగుతుండడంతో, ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదని పరిశ్రమల శాఖ వర్గాల ద్వారా తెలిసింది. అయితే ఇప్పుడు ఏకంగా ఈడీ రూ.7500 కోట్ల విలువైన అనీల్ అంబానీ ఆస్తులను సీజ్ చేయడంతో కృష్ణపట్నంలో మెగా ఇండస్ట్రియల్ పార్కు పనులు ముందుకు సాగేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్‌ను సంప్రదించగా ప్రస్తుత పరిస్థితులలో మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చే అంశం ప్రభుత్వం దృష్టిలో ఉందని చెప్పారు.



కాంట్రాక్టర్ చేపట్టిన బేస్‌మెంట్ నిర్మాణానికి కొలతలు తీస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

అవినీతిని నిర్ధారించినా..

నిర్లక్ష్యమేలా!?

గత ప్రభుత్వంలో నాసిరకంగా ఇళ్ల నిర్మాణాలు
విజిలెన్స్ విచారించి ఏడాది పూర్తి
అయినా చర్యలు లేవు.. నగదు రికవరీ లేదు!

గత వైసీపీ హయాంలో హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు ఒక్కటై నాసిరకంగా ఇళ్లు నిర్మించి రూ.లక్షల ప్రజాధనాన్ని స్వాహా చేశారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం గతంలో జరిగిన ఇళ్ల నిర్మాణాలు, నిధులు స్వాహాపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అయితే, ఉదయగిరి మండలం కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి లోని జగనన్న లేఅవుట్‌లో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి ఏడాది కావస్తున్నా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఉదయగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంగిరెడ్డిపల్లి లేఅవుట్‌లో ఆప్షన్-3 కింద ఇద్దరు కాంట్రాక్టర్లు లబ్ధిదారుల ఒప్పందంతో హౌసింగ్ అధికారులు 2023లో 141 మంది లబ్ధిదారుల ఇళ్లు నిర్మించేలా తీర్మానం చేశారు. అయితే, 141 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బీఎల్-122, ఆర్ఎల్-11, ఆర్‌సీ-5, ఎల్ఎల్-1 స్థాయిలో ఉండగా 2 ఇళ్లను పూర్తి చేశారు. బేస్‌మెంట్‌లు, ఇళ్ల నిర్మాణాలు నాసిరకంగా ఉంటున్నా అప్పటి అధికారులు పట్టించుకొన్న దాఖలాల్లేవు.

● నిబంధనలకు విరుద్ధంగా..

నిబంధనలకు విరుద్ధంగా హౌసింగ్ అధికారులు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారనే ఆరోపణలు ఉన్నాయి. పూర్తిస్థాయిలో నిర్మించకుండానే ఒక్కో బేస్‌మెంట్‌కు రూ.70 వేలు చొప్పున రూ.98.70 లక్షలు కాంట్రాక్టర్లకు జమ చేశారు. అలాగే రూ.18 లక్షల విలువైన సిమెంట్, స్టీల్ అందజేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా నిర్మాణాలు చేపట్టి మరో రూ.5 లక్షలు చెల్లించడంతోపాటు స్టీల్, ఇనుము మంజూరు చేశారు. పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టకుండానే మామూళ్ల మత్తులో అధికారులు బిల్లులు మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవని ఇటీవల అధికారులు కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసినా వారిలో చలనం లేదు.

● ఏడాది గడుస్తున్నా..

గంగిరెడ్డిపల్లి లేఅవుట్‌లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై గతేడాది సెప్టెంబరులో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. నిర్మాణాలు నాసిరకంగా చేపట్టడంతోపాటు కొలతల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని గుర్తించారు. కాంట్రాక్టర్లకు అదనంగా రూ.58.20 లక్షలు పేమెంట్ చేశారని, వారి నుంచి రికవరీ చేయాలని అధికారులకు నివేదిక అందజేశారు. అయితే ఏడాది కావస్తున్నా ఇంతవరకు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోకపోవడంతోపాటు నగదు రికవరీ చేయలేదు. ఈ వ్యవహారం వెనుక హౌసింగ్ అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కేసులు నమోదు చేస్తాం

గత ప్రభుత్వంలో ఆప్షన్-3 కింద చేపట్టిన గృహ నిర్మాణాలను కాంట్రాక్టర్లు పూర్తి చేయకపోతే లబ్ధిదారుల చేత పోలీసులకు ఫిర్యాదు చేయించి కేసు నమోదు చేసేలా చర్యలు చేపడతాం. ఇటీవల కాంట్రాక్టర్లకు నోటీసులు సైతం జారీ చేశారు.

- టీ.వేణుగోపాల్, గృహ నిర్మాణ శాఖ పీడీ

విభేదాలు ఎందుకున్నాయ్!

జనసేన నాయకులతో మాటామంతీ
వివరాలు సేకరించిన ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి శివశంకర్
త్వరలో జనసేనాని పవన్‌కు నివేదిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : 'రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి మంచి పేరుంది. నాయకులు, కార్యకర్తల్లోనూ సఖ్యత ఉంది. మరి నెల్లూరులో మాత్రం వర్గవిభేదాలు ఎందుకున్నాయ్!? ఇందుకు కారణాలు ఏమిటి!?. ఏం చేస్తే అందరూ గాడిన పడతారు.' అనేక అంశాలపై జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ ఆ పార్టీ ముఖ్యనేతలతో సుదీర్ఘంగా చర్చించారు. జనసేన ఆవిర్భావం నుంచి జిల్లాలో వర్గపోర్లు నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, ఆపార్టీ అధినేత పవన్‌కల్యాణ్ డిప్యూటీ సీఎంగా రాష్ట్రంలో ఉన్నా జిల్లాలో మాత్రం వర్గపోరును నివారించలేక పోతున్నారు. ఇటీవల రెండు వర్గాలు ఒకరిపై మరొకరు ప్రత్యక్షంగా మీడియాకు ఎక్కడంతో పవన్‌కల్యాణ్ సీరియస్ ఆయ్యారు. ఈ క్రమంలో ఇరు వర్గాల నాయకులను గత నెల 28, 29 తేదీలలో మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయానికి పిలిపించుకుని క్లాస్ తీసుకున్నారు. అలాగే, జిల్లాలో జరుగుతున్న రచ్చపై పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్‌ను విచారణకు ఆదేశించారు.

● నాయకులతో సుదీర్ఘ చర్చలు

ఇందులో భాగంగా ఈ నెల 2వ తేదీ రాత్రి నెల్లూరుకు చేరుకున్న శివశంకర్ సోమ, మంగళవారాలలో జిల్లాలోని ప్రతి నియోజక వర్గానికి చెందిన నాయకుల తోపాటు పార్టీకి విధేయంగా, గతంలో చురుక్కుగా పని చేసిన వారిని సైతం పిలిపించి మాట్లాడారు. అసలు జిల్లాలో ఏం జరుగుతోంది.. ఎందుకు ఇంతలా వర్గపోరు నడుస్తోంది.. నాయకుల మధ్య సఖ్యత కుదర్చాలంటే ఏం చేయాలి తదితర వాటిపై సుదీర్ఘంగా

- మిగతా 8లో..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 575

రహదారులకు మరమ్మతులు

అల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రహదారులకు మరమ్మతులు చేయించడానికి అధికారులు సిద్ధమయ్యారు. 'ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా... ఇంతేనా ?' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ శివారులోని అల్లూరు- కావలి రహదారిలో పెట్రోల్ బంకు సమీపంలో గుంతలు పడ్డ రహదారిపై కంకర వేసి ఎక్స్‌కవేటర్‌తో చదును చేశారు. వాహన రాకపోకలకు ఇబ్బందులు తొలగడంతో వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్

ఉలవపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బీ సురేష్ తెలిపారు. మంగళవారం కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు, వైద్యఆరోగ్య సిబ్బంది పరస్పర సహకారంతో పారిశుధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలకు నీటి నిల్వలు ఉన్నచోట అబేట్, బ్లీచింగ్ చల్లి దోమలు నిర్మూలించాలన్నారు. డయేరియా ప్రబలే అవకాశాలు ఉన్నందున్న తాగునీటి విషయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించాలని, గ్రామాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో సరఫరా చేసే రక్షిత మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి

● ప్రైవేటు బస్సుల యాజమాన్యాలకు ఆర్టీవో మురళీధర్ హెచ్చరిక



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీవో మురళీధర్

కావలి రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలని ఆర్టీవో మురళీధర్ పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోటలోని ఆర్టీవో కార్యాలయంలో మంగళవారం ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలను వివరించడంతో పాటు అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఆర్టీవో మాట్లాడుతూ టూరిస్టు, ట్రావెల్స్ బస్సుల్లో ఫైర్ డిటెక్టింగ్ అలారం సిస్టం తప్పనిసరిగా ఉండాలన్నారు. 2019 ఏప్రిల్ తరువాత రిజిస్టర్ అయిన వాహనాలకు అలారం ఇంజన్‌లో అమర్చి ఉంటుందన్నారు. ఇంజన్‌లో మంటలు వ్యాపించినప్పుడు వెంటనే అలారం మోగుతుందని, తద్వారా అగ్నిప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టేందుకు వీలుంటుందన్నారు. ఎంవీఐ సుందర్‌రావు మాట్లాడుతూ 2023 అక్టోబరు 1 నుంచి రిజిస్టర్ అయిన వాహనాలకు ఫైర్ డిటెక్షన్ అండ్ సప్రసింగ్ అలారం సిస్టం తప్పనిసరిగా అన్నారు. దీనివల్ల వాహనం ఇంజన్, క్యాబిన్‌లో మంటలు చెలరేగినప్పుడు వెంటనే అలారం మోగుతుందని, ప్రయాణికుల సీట్ల వద్ద నాజల్స్ ఏర్పాటు చేయడం ద్వారా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఫాగింగ్ స్ప్రేతో మంటలు ఆర్పవచ్చన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేస్తామన్నారు. వాహనాల ఎమర్జన్సీ డోర్లు లోపల, బయట నుండి కూడా తీసే విధంగా ఉండాలని, వాహనాల్లో ఫస్ట్‌ఎయిడ్ కిట్, ఇండికేటర్ లైట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ కరుణాకర్, లక్ష్మీబాయ్ ప్రైవేటు బస్సు యాజమానులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలి

కావలి (టౌన్) నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జేవీవీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జేవీవీ చెకుముకి సైన్స్ సంబరాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఈవో హరిప్రసాద్, జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీ రవికుమార్‌లు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలను పారదోలేందుకు జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గోవిందయ్య, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కోటేశ్వరి, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు జానకీరామ్, సభ్యులు హరినాథ్, సుబ్బరాయశర్మ, ఎస్ వెంకయ్య, ఖాదర్ బాష తదితరులు పాల్గొన్నారు.



సంబరాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈవో హరిప్రసాద్

మహిళా జట్టు ప్రపంచ కప్ కైవసంపై కేసీసీ సంబరాలు

కావలి (టౌన్) నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐసీసీ మహిళా ప్రపంచ కప్‌ను భారత్ సాధించిన సందర్భంగా మంగళవారం మినీ స్టేడియంలోని కేసీసీ నెట్స్ వద్ద బాలికా క్రికెటర్లు కేక్ కట్ చేసుకుని సంబరాలు నిర్వహించుకున్నారు. కేసీసీ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారుల సంబరాలు ఆకట్టుకున్నాయి కేసీసీ క్లబ్ అధ్యక్షుడు సిద్ధు మాట్లాడుతూ మహిళా క్రికెట్ ప్రపంచ కప్‌ను భారత జట్టు సాధించడం దేశానికి గర్వకారణమన్నారు. కేసీసీ ఆధ్వర్యంలో దాదాపు 70 మంది చిన్నారులకు క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నామని, వీరికి ఈ విజయం మరింత ఉత్సాహాన్నిస్తుందన్నారు. కార్యక్రమంలో కేసీసీ సభ్యులు రాంబాబు, రఫీ, సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ ప్రభాకర్‌నాయడుకి పలువురి పరామర్శ

కావలి (టౌన్) నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైద్యులు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ ప్రభాకర్‌నాయుడును మంగళవారం పలువురు పరామర్శించారు. ప్రభాకర్‌నాయుడు అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స అనంతరం, పట్టణానికి చేరుకోవడంతో పలువురు డాక్టర్లు, ప్రజా సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు ఆయనను పరామర్శించారు. శాలువా, పూలమాలలతో సత్కరించారు. స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా మాట్లాడుతూ ప్రభాకర్‌నాయుడు తన వైద్య సేవలతో ఎందరికో ప్రాణదానం చేశారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగిరావడం శుభపరిణామమన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి

బిట్రగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని అల్లిమడుగు, ఉమామహేశ్వరపురం పంచాయతీల్లో 3 ఫేస్ విద్యుత్‌ను పునరుద్ధరించాలని మండల టీడీపీ నేత సనిగంటి వేణు మంగళవారం అధికారులను కోరారు. తెల్లగుంటలో రెండుగ్రామాల రైతులు నారుమడులు పోసుకునేందుకు సమావేశమయ్యారు. విద్యుత్ శాఖాధికారులు వెంటనే స్పందించి చిన్నకారు రైతులను ఆదుకోవాలని విన్నవించారు.

తీరప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

కావలి రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం మండలంలోని సముద్ర తీరంలో నిర్వహించే పూజలు, సముద్రస్నానాలకు విచ్చేసే భక్తులు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ జీ రాజేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొంథా తుపాను ప్రభావంతో ఏర్పడిన వాతావరణ పరిస్థితుల కారణంగా సముద్రం కసురు మీద ఉందని, తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం తీరాల్లో మాత్రమే సముద్ర స్నానాలు చేయాలని సీఐ తెలిపారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

లింగసముద్రం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కేఆర్ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సూచించారు. మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలో స్థానిక హైస్కూల్‌కు చెందిన విద్యార్థినుల జట్టు బీవీఎస్ హరిత ఆర్తి, కెసి అక్షయ, ఈ రిషితలు మొదటి స్థానం సాధించారు. వీరు ఈనెల 23న జరిగే జిల్లా స్థాయి పరీక్షకు హాజరు కావాలని జెవివి మండల గౌరవ అధ్యక్షుడు ఎం కొండయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు టి శేషారావు, ఎం మాధవరావు, షేక్ మస్తాన్‌వలి, కె ప్రభాకర్, బోసుబాబులు పాల్గొన్నారు.

ఆత్మ నిర్భర్ భారత్.. స్వయం సమృద్ధి భారత్!

బిట్రగుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల బీజేపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు వీరాల శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో 'ఆత్మనిర్భర్ భారత్.. స్వయం సమృద్ధి భారత్' కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్, జిల్లా కార్యవర్గసభ్యుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ హాజరయ్యారు. అనంతరం బోగోలు తదితర ప్రాంతాల్లో గోడపత్రికలను అంటించి అవగాహన కల్పించారు.

జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ

లింగసముద్రం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ఆదివారం ఒంగోలులో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో మండలంలోని పెదపవనిలోని భోళారావు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బ్యాడ్మింటన్ విభాగంలో 10వ తరగతి చదువుతున్న పులిమి ధనుశ్రీ, కొత్తకోట క్రాంతిసాయి ఉత్తమ ప్రతిభ కనబరిచి తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు టి శ్రీనివాస్, పిడి వెంకట క్రిష్ణలు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం, పిడి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, పీఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థులు అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పెదపవని హెచ్ఎం శ్రీనివాస్, పీడీ వెంకటకృష్ణ

నేటి నుంచి కందుకూరు - సింగరాయకొండ నైట్ సర్వీస్

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కందుకూరు - సింగరాయకొండల మధ్య గతంలో ఉన్న నైట్ సర్వీస్‌ను బుధవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం రావూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నైట్ సర్వీస్ లేనందున ప్రజల ఇబ్బందుల నేపథ్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో నైట్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని నిర్ణయించామని తెలిపారు. రాత్రి 9 గంటల నుంచి సింగరాయకొండలో నిలిచే వివిధ రైళ్ల టైమింగ్స్‌కు అనుగుణంగా ఈ సర్వీస్ నడుస్తుందని తెలిపారు.

నేడు గ్రామసభ

వలేటివారిపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలినేనిచెరువు గ్రామ సచివాలయంలో ప్రజాభిప్రాయ సేకరణపై బుధవారం ఉదయం 11 గంటలకు గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలినేనిచెరువు గ్రామ పంచాయతీ నుండి విడగొట్టి ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని అర్జీ పెట్టారు. దీంతో పోలినేనిచెరువు పంచాయతీల్లోని నాలుగు గ్రామాల ప్రజల నుండి ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామసభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆ గ్రామ సభకు నాలుగు గ్రామాల ప్రజలు హాజరుకావాలని ఎంపీడీవో శంకర్‌రావు తెలియజేశారు.

పోకూరు రహదారికి మోక్షం

● నిర్మాణానికి రూ.3 కోట్ల మంజూరు



అధ్వానంగా ఉన్న పోకూరు రహదారి

వలేటివారిపాలెం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఆర్‌అండ్‌బి అధికారులు తెలిపారు. పోకూరు నుంచి శాఖవరం, వీఆర్‌కోట మీదుగా చీమలపెంట వరకూ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయినట్లు తెలిపారు.

బస్సుల్లో ఎమర్జెన్సీ డోర్, ఫైర్ సిలిండర్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఆర్టీవో టీవీఎస్ లక్ష్మి, పక్కన ఎంవీఐ అనిల్‌కుమార్ తదితరులు

కందుకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్కూల్, కాలేజీ బస్సులకు ఎమర్జెన్సీ డోర్, ఫైర్ సిలిండర్ తప్పనిసరి అని ఆర్టీవో టీవీఎస్ లక్ష్మి స్పష్టంచేశారు. స్థానిక ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో మంగళవారం ఆమె టూరిస్టు బస్సులు, స్కూల్, కాలేజీ బస్సుల యాజమాన్యాలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, బస్సులలో ఇతరత్రా ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. టూరిస్టు బస్సులు, స్కూల్, కాలేజీ బస్సులలో రిజిస్ట్రేషన్ ధ్రువపత్రంలో ఉన్న విధంగానే సీటింగ్ ఉండాలని, అగ్నిప్రమాదాలు సంభవిస్తే తక్షణం మంటలను ఆర్పేలా ఫైర్‌సిలిండర్లు ఉండాలని, ఎమర్జెన్సీ డోర్‌లు తక్షణం తీసుకునేలా ఉండాలని సూచించారు. అలాగే టూరిస్టు బస్సులలో బస్సు బయలుదేరే ముందు అత్యవసర సమయాల్లో ఎమర్జెన్సీ డోర్ తీసుకునే విధానం గురించి, అవసరమైతే అద్దాలు పగులగొట్టేందుకు హేమర్ ఉపయోగించేతీరు గురించి ప్రయాణికులకు అవగాహన కల్పించాలని కోరారు. స్కూల్, కాలేజీ బస్సులకు కూడా తప్పనిసరిగా ఎమర్జెన్సీ డోర్ కలిగి ఉండాలని, అది పనిచేస్తుందా లేదా ప్రతిరోజు చెక్ చేయాలని కోరారు. అలాగే స్కూల్, కాలేజీ బస్సులకు వేగనియంత్రణ పరికరాలు, ఫైర్ డిటెక్టర్ అలారం తప్పకుండా బిగించాలని, ప్రతి బస్సులో డ్రైవర్‌తో పాటు అటెండెంట్ ఉండాలని సూచించారు.తరచూ తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.ఈ సమావేశంలో ఎంవీఐ అనిల్‌కుమార్, ఏఓ కె. శివప్రసాద్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా ఉపకరణాల పంపిణీ

కొండాపురం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మి పంచాయతీ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులకు మంగళవారం కోడె వెంకటరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగదు, పుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కోడె వెంకటరావు 16 వ వర్ధంతిని పురస్కరించుకొని ట్రస్టు అధ్యక్షుడు చెరుకూరు వెంకటాద్రి ఆధ్వర్యంలో కొమ్మి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. స్థానిక జడ్పీఉన్నత పాఠశాలలో షేక్ ముస్కాన్, సమీర్‌లకు ఆర్థిక సాయంతోపాటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. రామానుజపురం ఎస్సీకాలనీలో ఇంటర్మీడియేట్ విద్యార్థికి ఫీజు కట్టేందుకు ఆర్థిక సాయం చేశారు. వెంకటాద్రి మాట్లాడుతూ గత 16 ఏళ్లుగా ట్రస్టు ద్వారా కొమ్మి పంచాయతీలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమాలు ఏటా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాల్యాద్రి, మాధవి, కొమ్మి గ్రామ మాజీ సర్పంచులు చెరుకూరు రమణయ్య, జీయోనా, ట్రస్టు సభ్యులు చెరుకూరు నవీన్, కోడె సింధు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ జీసీ గుమ్మా మాల్యాద్రి, చెరుకూరు శేషయ్య, దేవినేని వెంకటసుబ్బయ్య, బేదపూడి వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ నూతన కార్యవర్గం ఎన్నిక

గుడ్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల జన విజ్ఞాన వేదిక కమిటీని ఆ సంఘ నాయకులు మంగవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వేదిక డివిజన్ నాయకుడు తానికొండ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల జేవివి అధ్యక్షుడిగా దామా సోమానాయుడు, గౌరవ అధ్యక్షులుగా బత్తల వెంకటేశ్వర్లు, బాసం వెంకటేశ్వర్లు, ఎం.వి శోభారాణి. ఉపాధ్యక్షులుగా సీహెచ్ ఆంజనేయులు, పిల్లి కళగారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా సాలి సత్యనారాయణ, కోశాధికారిగా అద్దంకి అజయ్‌కుమార్, మహిళా కార్యదర్శులుగా శివకుమారి, ప్రసన్నకుమారి, కార్యదర్శులుగా టి. వంసంతరావు, ఎన్. భరద్వాజ్, మార్తాటి జనార్ధన్, కన్వీనర్లుగా టి. రవిచంద్ర, తానికొండ పద్మజ, ఎల్. వి నాగమణి, గుర్రం ఆదినారాయణలు ఎన్నికయ్యారు.

చెత్త బుట్టల పంపిణీ

అల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గాంధీకాలనీ ప్రాంతంలోని మహిళలకు మంగళవారం నగర పంచాయతీ డీడీఓ వరప్రసాద్ స్థానిక టీడీపీ నాయకుడు నజీర్ బాషాతో కలసి చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై స్పందించిన ఇందుపూరు

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ఇబ్రహీంపేట, బోగోలు బజారులోని ఆర్‌అండ్‌బీ రోడ్డులో లోతైన గోతుల కారణంగా తరచు ప్రమాదాలు జరుగుతుండటంతో టీడీపీ నేత ఇందుపూరు రామోహన్‌రెడ్డి మంగళవారం స్పందించారు. ట్రాక్టర్లతో కంకరును తెప్పించి ఎక్స్‌కవేటర్‌తో గుంతలు పూడ్చించారు. రహదారి మరమ్మతులకు టీడీపీ నేతలు మాలేపాటి నాగేశ్వరరావు,సుధీర్‌బాబు, బీ ఫిలిప్, ఎన్ భాస్కర్, శ్యామ్ తమవంతు సహకారం అందించారు.

ఎరువుల దుకాణాల ముందు

ధరల పట్టిక ఏర్పాటు చేయాలి

లింగసముద్రం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అమ్మే ఇన్‌పుట్ డీలర్లు తమ దుకాణాల ముందు తప్పనిసరిగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలని కందుకూరు ఇన్‌చార్జ్ వ్యవసాయ సహాయ సంచాలకులు కెవి శేషారెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన లింగసముద్రంలోని రైతు సేవ కేంద్రంలో మండలంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అమ్మే డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దుకాణాలలో రైతులు ఎరువులు ఇతర ఏ వస్తువులు కొనుగోలు చేసినా రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. అలాగే డీలర్లు స్టాక్ రిజిష్టర్లను, ఓ ఫారమ్‌లను, లైసెన్సులను సవరించుకోవాలన్నారు. అలాగే మండల వ్యవసాయ అధికారులు కూడా స్టాక్ రిపోర్టులను తనిఖీ చేయాలన్నారు. ఎవరైనా డీలర్లు నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపినా, రైతుల కొనుగోలుకు సంబంధించి బిలుల్లు ఇవ్వకపోయినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గ్రామ వ్యవసాయ సహాయకులు రబీకి కావలసిన విత్తనాలు, ఎరువులు ఏ విధంగా సన్నద్ధం చేసుకోవాలి, ఈ-పంట నమోదు గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సీహెచ్‌వీఎల్ దుర్గ, సాంకేతిక వ్యవసాయ అధికారి జి మధు మరియు డీలర్లు, వీఏఏలు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు అంతర్జాతీయ గుర్తింపే లక్ష్యం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, విద్యాశాఖాధికారులు

కందుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించి వారికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, విద్యాశాఖల సమన్వయంతో కందుకూరు డివిజన్ స్థాయి అండర్ 14, అండర్ 17 బాలబాలికల క్రీడాపోటీలను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలల ఆటస్థలంలో మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, వసతులు కల్పిస్తున్నందున క్రీడాస్ఫూర్తితో గెలుపోటములను సమంగా తీసుకుంటూ తమ సామర్థ్యాన్ని మెరుగుపరుచుకుంటూ విజేతలుగా నిలవాలని నిర్దేశించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 250మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీలకు హాజరవుతుండగా ఎమ్మెల్యే ఇంటూరి స్వంత నిధులతో వారికి భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు శర్మ, సుబ్బారెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు యు. సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎంలు నరసింహమూర్తి, ద్వారకారాణి, విశ్రాంత పీడీ టి. సుబ్బారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను ఆప్కాస్‌లో చేర్పించాలి

కావలి (టౌన్) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ఆప్కాస్‌లో చేర్పించాలని సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాపూరు సునీల్ మాట్లాడుతూ కావలి మున్సిపాలిటీలో రోజువారీ పారిశుధ్య కార్మికులు 100 మందికి పైగా పనిచేస్తున్నారని, వీరిలో కొంతమంది పదేళ్లు, మరికొంతమంది ఐదేళ్లుగా పని చేస్తున్నారన్నారు. వీరికి రూ.10 వేలకు మించి వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కనీస వేతన చట్టం అమలు చేసి, కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయు పట్టణ అధ్యక్షుడు తిరుపాలు, యూనియన్ నాయకులు జె బాబు, రమేష్, పోలయ్యయ్య, ఒంగోలు రాణి, గద్దె రాగమ్మ సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా వినియోగంపై అవగాహన అవసరం

అల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూరియా వినియోగంపై ప్రతీ రైతు అవగాహనతో వ్యవహరించాలని కావలి ఏడీఏ నాగరాజు అన్నారు. అల్లూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆయన రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. యూరియా అవసరానికంటే అధికంగా వినియోగిస్తే వచ్చే నష్టాలను వివరించారు. ప్రతీరైతు యూరియా పంపిణీ కార్డులను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, సచివాయల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నాగరాజు

డీఆర్ విశ్వోదయలో సాంస్కృతిక పోటీలు

కావలి (టౌన్) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దొడ్ల రామచంద్రారెడ్డి విశ్వోదయ విద్యాసంస్థల్లో బాలల దినోత్సవ సందర్భంగా సాంస్కృతిక పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జేబీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని ఎంఎం హాలులో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్‌కుమార్, రాష్మీ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై సాంస్కృతిక పోటీలను ప్రారంభించారు. చిత్రలేఖనం, సంగీతం, కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య విభాగాల్లో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల ఆర్గనైజర్ జ్యోతిశ్రీ, రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, జేబీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి, పీడీలు ప్రసాద్ రెడ్డి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ జట్లకు క్రీడా దుస్తుల పంపిణీ

కందుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా స్త్రీ, పురుషుల బాస్కెట్‌బాల్ జట్లకు క్రీడాదుస్తులను అసోసియేషన్ చీఫ్ పాటర్న్ నవులూరి మల్లికార్జునరావు బహూకరించారు. మంగళవారం స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలల క్రీడామైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రూ. 10వేలు విలువజేసే క్రీడాదుస్తులను జిల్లాజట్లుకు ఎంపికైన క్రీడాకారులను అందజేశారు. ఈనెల 7నుంచి 10 వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి తొట్టెంపూడి సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సయ్యద్ జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు సత్కారం



మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కావలి (టౌన్) నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకుగాను సీఎం చంద్రబాబు చేతులమీదుగా అవార్డు అందుకున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను మంగళవారం పలువురు ఘనంగా సత్కరించారు. కమిషనర్ కార్యాలయంలో టీడీపీ నాయకులు మేడికొండ సుకుమార్, తలమంచి రవికుమార్, ఎల్లంటి వెంకటేశ్వర్లు, పీసీ రామారావు, జీ ప్రసాద్ పలువురు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు శ్రావణ్‌కుమార్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తుఫాన్ విపత్తులో కమిషనర్ మానవీయ చైతన్యంతో, బాధ్యతగా విధులు నిర్వహించిన తీరు అభినందనీయమన్నారు. కావలి ప్రజలకు ఎల్లవేళలా ఆయన అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని వారు కొనియాడారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఆర్డీవో

కావలి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు వేగంగా, పారదర్శకంగా సేవలు అందించాలని కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణ ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రీసర్వే, పీజీఆర్‌ఎస్, ఇతర రెవెన్యూ అంశాలపై ఆయన సమీక్షించారు. పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలకు తక్షణ పరిష్కారాలు ఎలా చూపాలో తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. అంతకుముందు ఆర్డీవో చాంబర్‌లో నియోజకవర్గంలోని రాజకీయపార్టీలు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించి కొత్తగా ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాలపై చర్చించారు. ఆక్వాకల్చర్‌కు సంబంధించి అనుమతుల జారీపై ఆర్డీవో అధ్యక్షతన సబ్‌డివిజనల్ కమిటీ సమావేశం జరిగింది. ఆక్వా కల్చర్‌కు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పర్యావరణం, స్థానిక నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనుమతుల జారీ ప్రక్రియ పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సాయి పాదుకలకు ప్రత్యేక పూజలు

అల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి నివాసానికి షిరిడీ సాయినాథుని పాదుకలు చేరుకోవడంతో మంగళవారం సాయంత్రం ఆయన నివాసంలో విశేష పూజలు నిర్వహించారు. పూల పళ్లెంలో పాదుకలను ఉంచి, సాయినాథుని జపం చేశారు. విశేషంగా భక్తులు పాల్గొని పాదుకలను దర్శించుకున్నారు. రిటైర్డ్ ఇరిగేషన్ డీఈ సుబ్రమణ్యేశ్వర రెడ్డి ఈ కార్యక్రమానికి ఆధ్యాత్మిక గురువుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విష్ణు, శివప్రియ దంపతుల తోపాటు, కుటుంబ సభ్యులు చేవూరి సూర్యనారాయణరెడ్డి, సౌజన్య పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విష్ణు అనుచరులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రాకారోత్సవం



మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల ప్రాకారోత్సవ అలంకారానికి పూజలు చేస్తున్న భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో కార్తీక మాసం వేడుకలు 13వ రోజుకి చేరాయి. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అర్చనలు జరిగాయి. భువనేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకారం, పూజలు జరిగాయి. శివనామస్మరణలతో ఆలయం మారుమోగింది. సాయంత్రం పూలంగిసేవ, కార్తీక దీపారాధనలు జరిగాయి. అనంతరం శివపార్వతులకు ప్రాకారోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను అర్చభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

కనుల పండువగా కాత్యాయనీ వ్రతం



రాజరాజేశ్వరి ఆలయంలో కాత్యాయనీ వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో మంగళవారం కాత్యాయనీ వ్రతం కనుల పండువగా జరిగింది. సౌభాగ్యం, వివాహం, ఆరోగ్యం కోసం నిర్వహించే ఈ వ్రతంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం 10గంటలకు సత్యనారాయణ వ్రతం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు రఘురామమూర్తి తెలిపారు. సాయంత్రం రాజరాజేశ్వరి ఆలయం శిఖరంపైన అఖండ కార్తీక దీపం వెలిగిస్తామని తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు క్రమశిక్షణతో మెలిగి దర్శనం చేసుకోవాలని, ఆలయ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

వర్షాలు ఆగినా... వదలని నీరు !



చౌటపాలెంలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీటిలో నడుస్తున్న వ్యక్తి



రోడ్డు పక్కన నిల్వ ఉన్న వర్షపు నీరు



చౌటపాలెంలో ఇళ్లను చుట్టు ముట్టిన వర్షపు నీరు

నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డు సమర్ స్టోరేజీ ట్యాంక్ వద్ద చౌటపాలెంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఇళ్ల ముందు భారీగా నీరు చేరి నిల్వ చేరింది. దీంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వారం రోజులుగా వర్షం లేకపోయినా, వర్షపు నీరు మట్టిలో ఇంకకపోవడంతో వీధులు,ఇళ్లు మునిగిపోయాయి.దీంతో దోమలు,విషకీటకాలు, పాముల భయం స్థానికులను వెంటాడుతోంది. ఇకపోతే నీటి నిల్వ వల్ల దుర్వాసన వ్యాపించి, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా నగర కార్పొరేషన్ అధికారులు, పాలకులు ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, నెల్లూరు



ఉలవపాడు : గుంతలమయంగా తెట్టు-రామాయపట్నం ప్రధాన రహదారి



అల్లూరు : అధ్వానంగా ఉన్న రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డు



లింగసముద్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి



మర్రిపాడు : కంప సముద్రం వెళ్లే రహదారిపై గుంతలు



కందుకూరు : అడుగుకో గుంతతో నరకాన్ని తలపిస్తున్న మాచవరం - పరకొండపాడు రహదారి



బుచ్చిరెడ్డిపాళెం : చెన్నూరు మార్గం దుస్థితి



ఉదయగిరి : దుత్తలూరు సెంటర్‌లో గుంతలమయంగా జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు

గుంత.. విప్పండి కళ్లకు గంత!

జిల్లాలో గుంతల రోడ్లు వాహనదారులను హడలెత్తిస్తున్నాయి. చిన్న చిన్న గుంతలన్నీ ఇటీవల భారీ వర్షాలకు పెద్ద గోతులుగా మారిపోయి, నీటితో నిండిపోయాయి. గ్రామీణ రహదారుల నుంచి జాతీయ రహదారుల వరకూ ఇదే పరిస్థితి. వీటికి ప్యాచ్ వర్క్‌లు చేయకపోవడంతో వాహనదారులతోపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెల్లూరు-మనుబోలు మధ్య జాతీయ రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల మూలంగా గతంలో అనేక చోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కొన్ని ప్రమాదాల్లో ప్రయాణికులు మరణించిన సందర్భాలు ఉండగా, మరికొన్ని చోట్ల గాయాలపాలయ్యారు. అలాగే, కందుకూరు, ఉలవపాడు, అల్లూరు, ఉదయగిరి, లింగసముద్రం, మర్రిపాడు, ఏఎస్‌పేట తదితర ప్రాంతాల్లోనూ రోడ్లు అధ్వానంగా మారాఇయ. ప్రధాన రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలబడుతుండటంతో ఎక్కడ గుంత తెలియని పరిస్థితి నెలకొంది. ఈ గుంతలను పూడ్చాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



అనంతసాగరం : సోమశిల రోడ్డు ఇలా..

లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణకు
డెకాయ్ ఆపరేషన్స్ : కలెక్టర్

నెల్లూరు(వైద్యం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నియంత్రణకు డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో లింగనిర్ధారణ నిషేధిత చట్టం (పీసీపీఎన్‌డీటీ), ఏఆర్‌టీల పై జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాపెట్ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ శిశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు స్కానింగ్ సెం టర్‌లను ఆకస్మిక తనిఖీలు చేయాలని సూచించారు. ఆయా స్కానింగ్ సెంటర్‌లలో ప్రభుత్వ నిబంధనలు తప్పక సరిగా పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుజాత, డీఐవో ఉమామహేశ్వరి, గైనకాలజిస్ట్ అండాళ్ భాస్కర్, డీఎస్పీ రామారావు, డెమో కనకరత్నం, ఎన్జీవో కవితారెడ్డి పాల్గొన్నారు.

డీపీవోకి సీఈవో ఇన్‌చార్జి బాధ్యతలు

నెల్లూరు(జడ్పీ) : జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు ట్రైనింగ్‌కు హాజరవుతున్నందు న సీఈవో ఇన్‌చార్జి బాధ్యతలను డీపీవో శ్రీధర్‌రెడ్డికి అప్పగిస్తూ కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి మోహన్‌రావు పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు జరిగే ట్రైనింగ్‌కు హాజరవుతున్నారు.

హైరిస్క్ వ్యాధులను గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు(వైద్యం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్‌లు హైరిస్క్ వ్యాధులను గుర్తించి తక్షణం వైద్యులు చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన ఎల్‌టీల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ల్యాబ్‌లలో రక్తపరీక్షలు నిర్వహించి సకాలంలో కచ్చితమైన ఫలితాలు అందచేయాలని సూచించారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని, తద్వారా క్షయవ్యాధి నివారణకు వైద్యులు కృషి చేస్తారని పేర్కొన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హంస్సేనమ్మ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్‌లు అందరూ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. వారాంతపు, మాసాంతపు నివేదికలు తప్పనిసరిగా అందించాలని పేర్కొన్నారు. న్యూక్లియర్ వైద్యాధికారి డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి గురించి తెలియచేసి ఆయా వ్యాధులు నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు మలేరియా నివారణ అధికారి నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక సత్యనారాయణ వ్రతం

నెల్లూరు(సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం 9గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతం, సాయంత్రం 4గంటలకు సీతారాముల కల్యాణం జరుగుతాయని ఆలయ చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీతారాముల కల్యాణం అనంతరం కృతికా దీపం, సహస్ర దీపాలంకరణ జరుగుతుందన్నారు.

ఇదేమో.. జాతీయ రహదారి...
మాకేమో.. ఇదే అడ్డదారి !



జాతీయరహదారి ఉన్న ఆవులను తరుముతున్న పోలీసులు

మనుబోలు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం.. ఆవుల సంరక్షణకు సంబంధించింది కాదు. గోమాత యాత్ర అంతకన్నా కాదు. ఇది మనుబోలు జాతీయరహదారి. ఇదిగో.. ఇలా.. ఆవులకు నిత్యం ఇదే అడ్డదారి. ఒకటికాదు... రెండు కాదు. సుమారు పాతిక ఆవులను యజమానులు ఇలా బాధ్యతారహితంగా హైవే పైకి వదిలేస్తున్నారు. రాత్రివరకు జాతీయరహదారిపై తిరగాడుతూ, డివైడర్‌లపై ఆకు, అలములు తింటూ రోడ్డుకు అడ్డంగా మందలు మందలుగా తిరుగుతుంటాయి. గతంలో ఈ ఆవుల మందల వల్ల చాలా ప్రమాదాలు జరిగాయి. పలు మార్లు పోలీసులు ఆవుల యజమానులను హెచ్చరించినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఇక రోడ్డుపై భద్రతాధికారులు దృష్టి పెట్టాలి.

బందోబస్తు మధ్య దుకాణాల ఖాళీ

- నిబంధనలు అతిక్రమించి నిర్మాణం చేసిన వైసీపీ నేత
- నాడు చోద్యం చూసిన బీఎస్ఎన్ఎల్ అధికారులు
- నష్టపోయిన చిరువ్యాపారులు



బీఎస్ఎన్ఎల్ కాంప్లెక్స్‌లో గదులు ఖాళీ చేయించేందుకు వచ్చిన పోలీసులు



సీఐతో వాగ్వాదం చేస్తున్న వైసీపీ నేతలు రఫీ, గంగిరెడ్డి

కందుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున బీఎస్ఎన్ఎల్ ఆవరణలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని చిరువ్యాపారులను భారీ పోలీసు బందోబస్తుతో మంగళవారం ఖాళీ చేయించారు. బీఎస్ఎన్ఎల్ అధికారు కోరికతో సీఐ అన్వర్‌బాషా నేతృత్వంలో రూరల్ ఎస్ఐ నాయక్, కాంప్లెక్స్‌లోని చిరువ్యాపారులను ఖాళీ చేయించారు. ఈ వ్యవహారంలో బీఎస్ఎన్ఎల్ అధికారుల బాధ్యతారాహిత్యం.. అధికారపార్టీ నేతల ఒత్తిళ్లకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయాల ఫలితంగా చిరువ్యాపారులు వీధినపడ్డారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2022లో అప్పటి వైసీపీ నేతలు ఇష్టారీతిగా వ్యవహరించడంపై ఆంధ్రజ్యోతి సహా పలు పత్రికల్లో కథనాలు వచ్చాయి. అంతేకాక ఆ శాఖ ఉన్నతాధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదులు చేసినా చోద్యం చూస్తూ కూర్చోవటమే కాక వైసీపీ నేతలకు అండదండలు అందించారు. సెట్‌బ్యాక్‌లు కూడా వదలకుండా షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మించారు. అయితే ప్రస్తుతం అదే బీఎస్ఎన్ఎల్ అధికారులు బీఎస్ఎన్ఎల్ భవనాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తి నిబంధనలు అతిక్రమించాడన్న కారణం చూపించి లీజు రద్దుచేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి షాపులు ఖాళీ చేయించారు.

ఈ వ్యవహారంలో వైసీపీ నేతకు ఏమీ నష్టం లేకపోయినా, చిరువ్యాపారులు వీధినపడే దుస్థితి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిగా జరిగిన వ్యవహారం అయినందునే లీజు రద్దుచేయటం జరిగిందని, బీఎస్ఎన్ఎల్‌కు ఆదాయం పెంచటమే లక్ష్యం తప్ప ఇందులో కక్షసాధింపులు ఏమీ లేవని టీడీపీ నేతలు పేర్కొన్నారు.

పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి

- జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు4(ఆంధ్రజ్యోతి): పిల్లల దత్తతను చట్టబద్ధంగా మాత్రమే తీసుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి బీ.సురేష్ పేర్కొన్నారు. మంగళవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో దత్తత మాసోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ నూతన మార్గదర్శకాల ప్రకారం దత్తత పొందటంచాలా శులభతరమన్నారు. చట్టబద్ధంగా కాకుండా మరే ఇతర పద్ధతుల ద్వారా దత్తత తీసుకుంటే అది చట్టరీత్యా నేరమన్నారు. దత్తతకు సంబంధించిన వివరాల కోసం నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నున్న శిశు గృహంలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, సీహెచ్ సమత, తదితరులు పాల్గొన్నారు.

శివం.. శంకరం!

నేడు 'కార్తీక పౌర్ణమి'

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆలయాల్లో విస్తృత పూజలు జరగనున్నాయి. ఈ రోజున శివాలయాల్లో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహిస్తే కోటిజన్మల పుణ్యఫలం లభిస్తుందని హిందువుల విశ్వాసం. ధ్వజస్తంభం వద్ద నందాదీపం పేరిట దీపం పెట్టడం, నూనె పాత్రలో చంద్రదర్శనం చేసుకోవడం శుభప్రదం. వైష్ణవ ఆలయాల్లో సత్యనారాయణ వ్రతాలు, విశేష అభిషేకాలు, ఉత్సవాలు నిర్వహించనున్నారు. పౌర్ణమి తిథి మంగళవారం రాత్రి 10.30 గంటలకు ప్రారంభమై బుధవారం సాయంత్రం 6.48 గంటల వరకు ఉంటుంది. బుధవారం వేకువజామున 4.52 నుంచి 5.44 గంటల్లోగా నదీస్నానం చేసి కార్తీక దీపాలు వెలిగించాలి. ఉదయం 7.58 నుంచి 9 గంటల వరకు పూజలు చేసుకోవచ్చు. సాయంత్రం 5.15 నుంచి 7.05ఎ్ రకు దీపారాధనకు అనువైన సమయాలని వేదపండితులు తెలిపారు. ఈ క్రమంలో నగరంలోని గణేష్ ఘాట్ వద్ద కార్తీకమాస లక్ష దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వర్ణాల చెరువులో సామూహిక కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు చేశారు.

● పటిష్ట ఏర్పాట్లు

కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని ఆలయాల్లో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు ఇతర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆలయాలకు వచ్చే భక్తులు అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు. క్యూలైన్ల వద్ద దీపాలు వెలిగించే చోట, గుంపులు గుంపు లుగా ఉండరాదని పేర్కొన్నారు. ఏదైనా ఆకస్మిక ప్రమాద పరిస్థితులు కనిపించిన వెంటనే దేవదాయ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. అలాగే పోలీసు, విద్యుత్, మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల అధికారుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామని తెలిపారు.

విభేదాలు ఎందుకున్నాయ్!

(5వ పేజీ తరువాయి)

చర్చించారు. ఈ విషయాలన్నిటిపైనా నివేదిక సిద్ధం చేసి, త్వరలో జనసేనాని పవన్ కల్యాణ్‌కు అందించనున్నారు. కాగా, మంగళవారం ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్‌కు జనసేన పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. పార్టీ జిల్లా నేత నూనె మల్లికార్జున యాదవ్ గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రాము, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పటిష్ట భద్రతా చర్యలు

నెల్లూరు(క్రైం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా దేవాలయాల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని ఎస్పీ అజిత వేజెండ్ల ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సురక్షితంగా, ప్రశాంతంగా పౌర్ణమి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా పోలీసు శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టిందన్నారు. రద్దీ అధికంగా ఉన్న ప్రదేశాల్లో క్యూలైన్ వ్యవస్థలు, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ ఇలా అనేక జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. రద్దీగా ఉండే ఆలయాలు, ఘాట్ల వద్ద తోపులాటలు, తొక్కిసలాటలు జరగకుండా క్రమశిక్షణతో క్యూలైన్లలో మాత్రమే ముందుకు సాగాలని ఎస్పీ కోరారు.

● అనుమంతించిన ప్రదేశాల్లోనే స్నానాలు చేయాలి: గోపినాథ్ జెట్టి

కార్తీక పౌర్ణమి సందర్భంగా సందర్శకులు పోలీసుల సూచనలు తప్పక పాటిస్తూ అనుమతించిన ప్రదేశాల్లోనే స్నానాలు చేయాలని కోస్టల్ సెక్యూరిటీ ఇన్‌చార్జ్ అధికారి గోపినాథ్ జెట్టి భక్తులను కోరారు. పౌర్ణమి సందర్భంగా బుధవారం సముద్ర స్నానాలకు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బీచ్‌ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కోస్టల్ జిల్లా మెరైన్ అధికారులను గోపినాథ్ జెట్టి ఆదేశించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల నుంచే బందోబస్తు విధులు నిర్వహించాలని, స్థానిక పోలీసులు, రెవెన్యు, మత్యకార, వైద్యారోగ్యశాఖ, స్వచ్ఛందసంస్థల సమన్వయంతో ప్రమాదాలు జరగకుండా చూడలన్నారు. సందర్శకులు పోలీసుల సూచనలు తప్పక పాటించాలని, పోలీసులు సూచనలు తప్పక పాటించాలన్నారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత సముద్రస్నానాలకు అనుమతులు ఉండవని, అత్యవసర సహాయం కోసం 112 లేదా మెరైన్ పోలీసు హెల్ప్‌లైన్ 1093కు ఫోన్ చేయాలని కోరారు.

ఆయిల్ ట్యాంకర్లకు మాఫియా బెడద

నెల్లూరు(సాంస్కృతికం) : కృష్ణపట్నం పోర్టు నుంచి ఆయిల్ సరఫరా చేసే ట్యాంకర్లకు మాఫియా బెడద ఎక్కువగా ఉందని తిరుపతి జిల్లా ఆయిల్ ట్యాంకర్ అసోసియేషన్ అధ్యక్షుడు యోగానంద్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోర్టులో యూనియన్ ఆఫీసు ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ యూనియన్ ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ట్యాంకర్‌కి రూ.300 కర్నాటక, తమిళనాడు ఆయిల్ ట్యాంకర్లకు రూ.700 వసూలు చేస్తున్నారన్నారు. రోజుకి రూ.300 చొప్పున 150 ట్యాంకర్లు ఆంధ్రప్రదేశ్‌వి, కర్నాటక, తమిళనాడు ట్యాంకర్లతో కలిపి ఆ యూనియన్‌కి నెలకి దాదాపు రూ.65 లక్షలు ఆదాయం వస్తోందని తెలిపారు. ట్యాంకర్లు నుంచి వసూలు చేసిన రూ.65లక్షలు ఎక్కడికి వెళ్తున్నాయి అనేది తెలియడంలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా కృష్ణపట్నంలో మాఫియా అవినీతి పెరగడం పట్ల ఆందోళనగా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిలు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ట్యాంకర్ల యజమానులకు న్యాయం చేయాలని కోరారు.